

www.andhrajyothy.com
వెల: రూ. 6.50
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
పేజీలు: 18 + 20
సంపుటి: 59
సంచిక: 281



శనివారం | 26-1-2019

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి సా. 4.20 తదుపరి సప్తమి; నక్షత్రం: హస్త మ. 3.05 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 10.51-12.25; దుర్ముహూర్తం: ఉ. 6.54-8.23; అమృతఘడియలు: ఉ. 9.25-10.55; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 6.02

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



సిరివెన్నెలకు పద్మశ్రీ

చెస్ క్వీన్ ద్రోణవల్లి హారిక, రైతు నేస్తం యడ్లపల్లి ఫుట్‌బాల్ క్రీడాకారుడు సునీల్ ఛెత్రికి కూడా

నలుగురికి పద్మవిభూషణ్, 14 మంది పద్మభూషణ్,

94 మందికి పద్మశ్రీ.. ఉత్తరాది ముఖ్యులకే పెద్దపీట

6





ప్రణబ్‌దాకు భారత రత్న

దివంగత ఆరెస్సెస్ ప్రచారక్ నానాజీ దేశ్‌ముఖ్‌కు, అసోం కవి గాయకుడు భూపేన్ హజారికాకు కూడా

కాంగ్రెస్, ఆరెస్సెస్, లెఫ్ట్.. ముగ్గురూ మూడు భావజాలాల ప్రతినిధులు.. ఎన్నికల వేళ మోదీ మార్క్ ఎంపిక

బెంగాల్, మహారాష్ట్ర, ఈశాన్యంపై దృష్టి.. ప్రధాని ఆనందం.. మా నేతకివ్వడం గర్వకారణం: రాహుల్

ఆర్మీ చీఫ్ రావత్‌కు పరమ విశిష్ట సేవా పతకం.. ఇద్దరు జవాన్లకు కీర్తి చక్ర.. తొమ్మిది మందికి శౌర్య చక్ర

6

అన్నగా నేనున్నా!



అమరావతిలో జరిగిన సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

• అక్కచెల్లెళ్ల దీవెన



సీఎం చంద్రబాబుకు తిలకం దిద్దుతున్న మహిళలు

అప్పు చేసైనా అక్కచెల్లెళ్లకు రూ. 10 వేలు

- రెండు నెలల్లో ఖాతాల్లో జమ చేస్తా
- నిరంతరంగా పసుపు-కుంకుమ పథకం
- దేవుడు 94 లక్షల ఆడబిడ్డలను ఇచ్చాడు
- ఇంకో 6 లక్షల మంది చేరితే కోటి సైన్యం
- 1.40 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ ఫోన్లు
- 'స్థానికం'లో ఇద్దరు పిల్లల క్లాజ్ తొలగిస్తాం
- వెలుగు సిబ్బందికి 30 శాతం జీతం పెంపు
- టీడీపీ గెలిస్తేనే పథకాలు కొనసాగుతాయ్
- డ్వాక్రా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి
- అమరావతి, కడప, విశాఖల్లో ప్రసంగం

అమరావతి/కడప/విశాఖ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'అన్నగా మీకు నేనున్నాను.. అప్పు చేసైనా అక్కచెల్లెళ్లకు అండగా నిలబడతాను. కొండనైనా బద్దలు చేసే శక్తి నా ఆడబిడ్డలు నాకు ఇచ్చారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రక్తసంబంధం లేకపోయినా మనకు రుణానుబంధం ఉందన్నారు. భగవంతుడు 94 లక్షల మంది ఆడబిడ్డలను తనకిచ్చాడని చెప్పారు. 'రానున్న 75 రోజులు కష్టపడి పనిచేయండి, చేసిన అభివృద్ధి చెప్పే బాధ్యత మీదే.. గ్రామాల్లో తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి' అని మహిళలకు పిలుపిచ్చారు. శుక్రవారం ఒకేరోజు రాష్ట్రంలోని

మిగతా 16వ పేజీలో...

▸▸ చెల్లింపు ఇలా..

ఫిబ్రవరి 1న రూ.2,500, మార్చి 8న రూ.3,500, ఏప్రిల్ 5న రూ.4 వేలు చొప్పున ఇస్తారు. ముందుగానే చెక్కులిస్తారు. ఆయా తేదీల్లో మహిళలు డబ్బులు డ్రా చేసుకునేలా చర్యలు తీసుకుంటారు.


ఐదు రిటర్న్ గిఫ్టులు ఇద్దాం

'నాకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఆయనకు ఒకటి కాదు.. ఐదు రిటర్న్ గిఫ్టులు ఇద్దాం. మనల్ని కించపరుస్తూ కేసీఆర్ మాట్లాడుతున్నారు. ఇష్టానుసారంగా తిడుతున్నారు.' -చంద్రబాబు

ఈసారి మోదీ ఇంటికే!

- సర్వేలన్నీ అవే చెబుతున్నాయి
- వినయ విధేయతే నాయకత్వ లక్షణం
- జగన్ అహంభావం వల్లే నేతలు దూరం
- తప్పుడు సర్వేలు ఆయనకు అలవాటే: సీఎం







• లెఫ్ట్‌తోనే రైట్ రైట్



విశాఖలో మాట్లాడుతున్న రాఘవులు, పవన్, సురవరం

ఆంధ్రలో మాది ఐక్యపోరాటం

- ఫిబ్రవరిలో సీట్ల సర్దుబాటు చర్చలు 16
- ఈవీఎంలపై చర్చ అవసరం
- హేతుబద్ధ మైనింగ్ జరగాలి
- దేశవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన
- మీడియాతో పవన్, సురవరం, రాఘవులు







పరంజ్యోతి

భగవంతుని పొందే మార్గం ప్రేమే



భగవంతునికి ఒక ప్రత్యేకమైన రూపం లేదు, నామం లేదు, స్థల కాలాదులు లేవు. వాటన్నింటికీ అతీతుడు పరమాత్మ. మరో కోణంలో చూస్తే.. అవన్నీ ఆయనలోనే యిమిడి ఉన్నాయి. భగవంతుడికి మనం ఒక ఆకృతిని ఆపాదించదలచితే అది నిర్మల, నిస్వార్థ, నిష్కామ ప్రేమ రూపుగట్టినట్టు ఉంటుంది. సూర్యుని వెలుగులోనే సూర్యుని, చంద్రుని వెలుగులోనే చంద్రుని ఎలా దర్శించగలమో.. అలాగే ప్రేమ స్వరూపుడైన భగవంతుని ప్రేమ చేతనే పొందగలం. భగవంతుని పట్ల మనకుగల నిస్వార్థ ప్రేమనే శుద్ధ భక్తి అంటారు. దీనికే సులభంగా వశుడవుతాడాయన. భక్తికే తప్ప యుక్తికి వశుడుగాడు. విశ్వాసానికి వశుడవుతాడుగానీ ఆడంబర ఆరాధనలకు కాదు. మనకు గల అష్టైశ్వర్యాలతో ధన, కనక, వస్తువాహనాదులతో ఆయన కృపకు పాత్రులం కాలేం. ప్రేమ, భక్తులే అందుకు రాచబాట. దీన్ని నిరూపించిన శ్రీకృష్ణ తులాభారం కథ మనందరికీ తెలిసిందే సత్యభామ ఆడంబర భక్తితో తనకున్న స్వర్ణాభరణాలన్నింటినీ రాశులుగా పోసినా శ్రీకృష్ణుడు తూగలేదు. భక్తి, ప్రేమ, విశ్వాసాలతో రుక్మిణీదేవి ఉంచిన తులసి దళానికి ఇట్టే తూగాడు.

> "పత్రమో పుష్పమో ఫలమో తోయమో
> భక్తి కల్గిన వానికి వశుడవగుట సత్యమేది
> కృష్ణా! నీవే తులసి దళమునకు తూగుదువుగాక!"

అంటూ రుక్మిణి ప్రేమతో కృష్ణ నామాన్ని జపించినందువల్లనే ఆ భగవంతుడు వశుడయ్యాడు. కనుక భగవదనుగ్రహం కావాలని నిత్యం కోరుకొనేవారంతా ముందుగా ప్రేమ భావాన్ని పెంపొందించుకోవాలి. కానీ, భగవంతుడిని ప్రేమించడం ఎట్లా అంటే.. ఈ సకల జగత్తూ భగవంతుని స్వరూపమే. ప్రతి జీవీ భగవంతుని స్వరూపమే. మానవులందరిలోనూ ఆ పరమాత్మ ఉంటాడు. అందుకే మానవ దేహాన్ని నడిచే దేవాలయమంటారు. దేహాన్ని నడిపించే అంతర్గత చైతన్యమే ఆత్మ, లేక భగవంతుడు. కనుక తోటి మానవులను ప్రేమించడం అభ్యాసం చేసుకొంటే ఆ ప్రేమ తప్పక భగవంతుని చేరుతుంది. ఎదుటివారు దుర్మార్గులా, సన్మార్గులా, ఉత్తములా కాదా అన్న విషయం మనకనవసరం. అందరిలో ఉన్నదీ ఆ శుద్ధ చైతన్యమే, కనుక అందరూ ప్రేమకు అర్హులే. ఎవరిని ప్రేమించినా, సేవించినా ఆనంద పడేది, సంతృప్తి చెందేది మన ఆరాధ్య దైవమే. ఆయన ప్రేమను పొందటానికి, భగవంతుడు మనకు ప్రసాదించిన అత్యుత్తమ మార్గం 'ప్రేమ మార్గం'.


- మాదిరాజు రామచంద్రరావు, 93933 24940

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
కడప	36.0	20.0
అనంతపురం	32.5	22.7
శ్రీకాకుళం	30.0	18.0
హైదరాబాద్	31.0	18.9
గుంటూరు	30.6	19.8
విశాఖపట్నం	29.4	17.6



అందానికి ఓట్లు పడవు

ప్రియాంక చాలా అందమైన వ్యక్తి. అందంగా ఉన్నంత మాత్రాన ఓట్లు పడవు. ఆమె రాజకీయంగా ఇంతవరకు సాధించిందేమీ లేదు. ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై మేమేం(బీజేపీ) ఆందోళన చెందడం లేదు. ఆమె రాకతో మాకు మేలే జరుగుతుంది.

- బిహార్ మంత్రి వినోద్ నారాయణ్ ఝా



సున్నా, సున్నా కలిస్తే గుండుసున్నా

ప్రియాంక రాకతో ఏమీ జరగదు. సున్నా, సున్నా కలిస్తే గుండు సున్నాయే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ పెద్ద సున్నా. ఆ పార్టీలో ఎవరు చేరినా పెద్ద ఫలితమేమీ ఉండదు.

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

మీకెందుకయ్యా అప్పు?

పీడీ ఖాతాల్లో డబ్బుందిగా..

- రాష్ట్రానికి రుణ అనుమతి ఇవ్వకుండా కేంద్రం కొర్రీలు
- తక్షణ చెల్లింపు కోసమే 'పీడీ'
- అది చెప్పినా వినని కేంద్రం
- 3నెలలకు అనుమతి కోసం ఇప్పటికి మూడుసార్లు లేఖ
- 12 వేల కోట్లు సేకరించే వీలు
- రూ.3 వేల కోట్లకే అనుమతి




అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ నుంచి రుణాలు సమీకరించుకునేందుకు రాష్ట్రానికి కావాల్సిన అనుమతులను ఇవ్వకుండా కేంద్రం కొర్రీలపై కొర్రీలు వేస్తోంది. ఎఫ్ఆర్‌బీఎం (ఆర్థిక బాధ్యతలు, బడ్జెట్ నిర్వహణ చట్టం) పరిధిలో మార్కెట్ నుంచి రుణం సమీకరించుకుంటామంటూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే కేంద్రానికి మూడు సార్లు లేఖలు రాసింది. అయినప్పటికీ కేంద్రం కనికరించడం లేదు. లేఖలు రాసిన ప్రతిసారీ ఆర్థిక శాఖ అధికారులు ఢిల్లీ వెళ్లి, అక్కడ అధికారులకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు వివరిస్తున్నారు. అయినప్పటికీ, పూర్తిస్థాయిలో అనుమతులిచ్చేందుకు కేంద్రం నిరాకరిస్తోంది. జనవరి-మార్చి వరకు రూ.12,000 కోట్లమేర మార్కెట్ నుంచి రుణాలు సమీకరించుకునే వీలు రాష్ట్రానికి ఉంది. అయితే, ఇప్పటి వరకు కేంద్రం రెండు విడతలుగా రూ.3,000 కోట్ల రుణాల సమీకరణకు మాత్రమే అనుమతులిచ్చింది. 14వ ఆర్థిక సంఘం రూపొందించిన సూత్రం ప్రకారం 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం దాదాపు రూ.32,000 కోట్ల వరకు మార్కెట్ నుంచి రుణం తీసుకునే వెసులుబాటు ఉంది. నాబార్డు రుణాలు, ఈఏపీ రుణాలు కూడా ఈ పరిధిలోకే వస్తాయి. నాబార్డు, ఈఏపీ రుణాలు మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని మార్కెట్ బారోయింగ్స్ రూపంలో తీసుకునేందుకు రాష్ట్రానికి అనుమతిస్తారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కేంద్రం తొమ్మిది నెలల కాలానికి మార్కెట్ బారోయింగ్స్ చేసేందుకు రాష్ట్రాలను అనుమతిస్తుంది. ఆ తర్వాతి మూడు నెలలకు జనవరిలో అనుమతిస్తుంది. ఈ మేరకు రాష్ట్రానికి సంబంధించి మూడు నెలల కాలానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ, ఆర్థిక శాఖ కేంద్రానికి లేఖ రాసింది. దీనికి సమాధానంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై నివేదిక సమర్పించాలని కేంద్రం కోరింది. దీనిపై రాష్ట్రం నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపింది. ఆ తర్వాత కూడా కేంద్రం అనుమతులు ఇవ్వలేదు. దీనిపై రాష్ట్ర అధికారులు కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్రం సమర్పించిన వివరాలు పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్న తర్వాత మిగిలిన మొత్తాలకు అనుమతులిస్తామని కేంద్రం వారికి సమాధానం ఇచ్చింది. కానీ, రాష్ట్రంలో ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. తమకు అంత కాలం వేచి చూసే అవకాశం లేదని రాష్ట్ర అధికారులు కేంద్రానికి వివరించారు. పీడీ ఖాతాల్లో నిధులున్నప్పటికీ, అప్పులు ఎందుకు చేస్తున్నారని కేంద్రం వారిని ప్రశ్నించింది. పీడీ ఖాతాల్లో ఉన్న నిధులు త్వరలో చెల్లింపులు చేయాల్సిన నిధులనే విషయం వివరించి, ఇప్పటి వరకు రెండు విడతలుగా రూ.3,000 కోట్లకు కేంద్రం నుంచి మన అధికారులు అనుమతులు తీసుకొచ్చారు. మిగిలిన మొత్తానికి కూడా అనుమతుల కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్రానికి మార్కెట్ రుణాలు సమీకరించుకునేందుకు తక్షణమే అనుమతులు ఇవ్వాలని కోరుతూ మూడు రోజుల క్రితం ఆర్థిక శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర కేంద్రానికి మరోసారి లేఖ రాశారు. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.12,000 కోట్ల వరకు మార్కెట్ రుణాలు సమీకరించుకునే అవకాశం ఉందనేది ఆ లేఖలో వివరించి, కనీసం రూ.7,000 కోట్లు సమీకరించునేందుకైనా అనుమతులివ్వండని కోరారు. విభజన వల్ల ఏర్పడిన ఆర్థిక లోటును పూడ్చడంలో కేంద్రం విఫలమైందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రూ.16,000 కోట్ల రెవెన్యూ లోటుకుగాను కేంద్రం రూ.3,979 కోట్లు మాత్రమే ఇచ్చిందని మిగిలిన రూ.12,000 కోట్లను కేంద్రం ఇవ్వకపోవడం వల్లే రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు తారుమారయ్యాయని పేర్కొన్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వం తరచూ ఓవర్‌డ్రాఫ్టునకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అలాగే, ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి ఇంకా పంచని అప్పు రూ.4,000 కోట్లను 2019 మార్చి 31లోగా చెల్లించాల్సి ఉండడంతో రాష్ట్ర ఖజానా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఇతర మార్గాల నుంచి రుణం సేకరించడం కంటే కూడా మార్కెట్ నుంచి తీసుకున్న రుణాలపై తక్కువ వడ్డీరేట్లు ఉంటాయి కాబట్టి... ఈ ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ7,000 కోట్ల మార్కెట్ రుణాలకు అనుమతులివ్వాలని ఆ లేఖలో రవిచంద్ర కోరారు.



వినయ్ అంత్యక్రియల్లో పుంగనూరు ఖబరస్తాన్ వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

నమాజ్ చేస్తుండగా ఆగిన గుండె!

- సోదరుడి గుండె జబ్బు నయం కావాలని ముస్లిం మతంలోకి...
- మసీదులోనే కుప్పకూలిన యువకుడు



పుంగనూరు, జనవరి 25: సోదరుడికి గుండెజబ్బు నయమవుతుందన్న విశ్వాసంతో ముస్లిం మతం స్వీకరించిన ఆ యువకుడు.. మసీదులో నమాజ్ చేస్తుండగానే కుప్పకూలిపోయాడు. చిత్తూరుజిల్లా పుంగనూరులో ఈ విషాదం చోటు చేసుకోగా, మృతుడి అంత్యక్రియలకు శుక్రవారం వేలాదిమంది తరలివచ్చారు. పుంగనూరులోని గాంధీవీధికి చెందిన ఎస్.శ్రీనివాసులుకు వినయ్, మనోజ్ ఇద్దరు కవలలు. మనోజ్ గుండెకు సంబంధించిన వ్యాధితో ఇబ్బంది పడుతుండగా, మసీదులో ఐదు పూటలా నమాజ్ చేస్తే నయమవుతుందని స్నేహితులు సూచించారు. దీంతో మనోజ్ కొంతకాలంగా మసీదుకు వెళ్తున్నాడు. సోదరుడి జబ్బు నయమవ్వాలని వినయ్ కూడా వెళ్లేవాడు. మూడునెలల క్రితం సోదరులిద్దరూ ముస్లిం మతాన్ని స్వీకరించారు. ఈ నేపథ్యంలో గురువారం మసీదులో నమాజ్ చేస్తుండగా వినయ్ నూర్‌మహ్మద్(25) గుండెపోటుతో కుప్పకూలాడు. మసీదులో చనిపోవడంతో అల్లాహ్ అనుగ్రహం ఉందంటూ మృతదేహాన్ని స్నేహితుడి ఇంటికి తరలించి ముస్లిం మతాచారం ప్రకారం కార్యక్రమాలను నిర్వహించారు.

85 పోలీసు డ్రైవర్ పోస్టులు

- మాన్యువల్‌గా దరఖాస్తులకు ఆహ్వానం

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 85 పోలీసు డ్రైవర్ పోస్టులకు ఏపీ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ జారీచేసింది. రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖలో ఈ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటివరకూ పోలీసు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానించగా, తాజా నోటిఫికేషన్‌ను మాత్రం మాన్యువల్ విధానంలో చేపడుతున్నట్లు పేర్కొంది. అన్ని జిల్లాల ఎస్పీ కార్యాలయాల్లో దరఖాస్తులు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు అందుబాటులో ఉంటాయని, రూ.10చెల్లించి తీసుకోవచ్చని పేర్కొంది. దరఖాస్తుకు అవసరమైన సర్టిఫికెట్లు జతచేసి, ఈ నెల 29నుంచి వచ్చే నెల 6లోపు ఎస్పీ కార్యాలయంలో అభ్యర్థులే నేరుగా సమర్పించాలని, ఫిజికల్, డ్రైవింగ్ పరీక్షల తేదీని ఫిబ్రవరి 12గా నిర్ణయించినట్లు తెలిపింది.

ఫిబ్రవరి నెలాఖరుకు డీఎస్సీ సెలెక్షన్స్

- 7902 ఖాళీల భర్తీకి పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపిక కమిటీల (డీఎస్సీ) ద్వారా నోటిఫై చేసిన 7,902 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేసేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్, మున్సిపల్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి నెలాఖరుకల్లా మెరిట్ లిస్టు, సెలెక్షన్ లిస్టులను రూపొందించే దిశగా కసరత్తు జరుగుతోంది. సాధ్యమైనంత వరకు మార్చిలో నియామక ప్రక్రియను కూడా పూర్తిచేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఫిబ్రవరి నెలాఖరులోగా భర్తీచేయాలని సుప్రీంకోర్టు తాజాగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ అప్రమత్తమైంది. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్) లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీ, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాళ్లు, మ్యూజిక్, డ్రాయింగ్, క్రాఫ్టు, ఆర్ట్.. తదితర కేటగిరీల పోస్టుల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ 24 నుంచి రాత పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఎస్‌జీటీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 31 నాటికి అన్ని పరీక్షలూ పూర్తవుతాయి. ఈ సారి పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా ఉపాధ్యాయ నియామకాలను పూర్తిచేసి విమర్శలకు తావులేకుండా పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

ప్రాణహాని ఉంది.. భద్రత పెంచండి

- కోడికత్తి కేసు నిందితుడి వేడుకోలు..8 వరకు రిమాండ్

విజయవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి కేంద్ర కారాగారంలో తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించడంతో పాటు ప్రత్యేక సెల్‌ను కేటాయించాలని కోడికత్తి దాడి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పార్థసారథిని వేడుకున్నాడు. రిమాండ్ గడువు ముగియడంతో అతడిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. 'నన్ను సాధారణ ఖైదీలా చూస్తున్నారు. జైల్లో పెద్దపెద్ద కేసుల్లో ఉన్న ఖైదీలంతా నా వెనుక అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఇది నాకు చాలా ఇబ్బందిగా ఉంది' అని శ్రీనివాసరావు న్యాయమూర్తి ముందు చెప్పాడు. తనకు జైల్లో ప్రత్యేకంగా సెల్‌ను కేటాయించాలని వేడుకున్నాడు. దైనందిక చర్యల గురించి రాసుకోవడానికి కాగితాలు, పెన్ ఇప్పించాలన్నాడు. ఈ విషయాలను న్యాయమూర్తి కోర్టు డైరీలో నమోదు చేయించారు. కాగా, శ్రీనివాసరావుకు ఫిబ్రవరి 8 వరకు రిమాండ్ విధించారు. మరోపక్క, శ్రీనివాసరావు తరపు న్యాయవాది సలీం దాఖలు చేసిన పిటిషన్లను మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పార్థసారథి కొట్టేశారు. విశాఖపట్నం జైల్లో ఉండగా శ్రీనివాసరావు రాసుకున్న 22 పేజీల లేఖను అప్పగించాలని, కస్టడీకి తీసుకున్న తర్వాత ఎన్ఐఏ అధికారులు మొదటి మూడు రోజులు చేసిన విచారణను పరిగణనలోకి తీసుకోవద్దని దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేశారు. కాగా, నిందితుడు శ్రీనివాసరావును కస్టడీకి పంపే సమయంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎన్ఐఏ అధికారులు ఉల్లంఘించారని, ఎన్ఐఏ ప్రొసీడింగ్‌ను ఆపాలని సలీం తాజాగా మరో 2 పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై శ్రీనివాసరావు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

సర్వేను అడ్డుకున్న వైసీపీ

- ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- ట్యాబ్‌లు లాక్కొని దౌర్జన్యం
- విజయనగరం జిల్లాలో హైడ్రామా
- బాధితుల ఫిర్యాదుతో 8 మంది అరెస్ట్
- ఓట్ల తొలగింపు ఈజీ కాదన్న ద్వివేది
- దాడులు చేస్తే ఊరుకోం: చినరాజప్ప

శృంగవరపుకోట రూరల్/పూసపాటిరేగ/అమరావతి/రాజమహేంద్రవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పాలసీ రిసెర్చ్ పేరిట విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ మండలంలో సర్వే నిర్వహిస్తున్న యువకులను వైసీపీ నేతలు అడ్డుకున్నారు. వారి దగ్గర ట్యాబ్‌లు లాగేసుకున్నారు. సర్వేల పేరుతో తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. దీంతో విజయనగరం జిల్లాలో హైడ్రామా చోటుచేసుకుంది. కొందరు వైసీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. సర్వే బృందాలపై దాడులు చేస్తే ఊరుకోబోమని హోంమంత్రి చినరాజప్ప హెచ్చరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పూసపాటిరేగలో సర్వే నిర్వహిస్తున్న యువకులను గురువారం వైసీపీ నాయకులు అడ్డగించారు. వారి ట్యాబ్‌లను లాగేసుకుని జిల్లా వైసీపీ వ్యవహారాల కమిటీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను)కు అప్పగించారు. తమపై వైసీపీ నేతలు దౌర్జన్యం చేశారని యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు 8మంది వైసీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం విజయనగరంలో మజ్జి శ్రీనివాసరావును అరెస్ట్ చేసి తీసుకుని జామి పీఎస్‌కు తరలించారు. 6 గంటలపాటు ఆయన్ని ప్రశ్నించారు. మధ్యాహ్నం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. మరోవైపు- ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బొత్స సత్యనారాయణ సచివాలయంలోని ఎన్నికల ప్రధానాధికారి గోపాలకృష్ణ ద్వివేదీని కలిసి ఫిర్యాదు చేశారు. ఓటర్ల జాబితాలను ట్యాబ్‌ల్లోకి అప్‌లోడ్ చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. యువకుల దగ్గర స్వాధీనం చేసుకున్న రెండు ట్యాబ్‌లను ఈసీకి ఇచ్చామని, మరో 5 ట్యాబ్‌లను డీజీపీని కలిసి ఫిర్యాదు చేసి అందజేస్తామన్నారు. ఓటరు జాబితాలోని పేర్లను తొలగించడం ఎవరికి పడితే వారికి సాధ్యంకాదని వైసీపీ నేతలకు ఎన్నికల ప్రధానాధికారి ద్వివేదీ వారికి బదులిచ్చారు. సర్వేలను తాము ఇప్పుడే ఆపలేమని, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత చేయకూడదని ఆయన అన్నారు. కాగా, 'ఎన్నికల సమయంలో ప్రజల నాడి తెలుసుకోవడం కోసం సర్వేలు చేసుకోవడం సహజం. ఎవరైనా చేసుకోవచ్చు. విజయనగరం జిల్లాలో సర్వే చేస్తున్న బృందాలపై వైసీపీ నేత బొత్స వర్గీయులు దాడి చేయడం దారుణం. అక్కడ కేసు నమోదు చేశాం' అని హోంమంత్రి చినరాజప్ప తెలిపారు. సర్వే బృందాలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని ఆయన రాజమహేంద్రిలో హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్ బయట వైసీపీ శ్రేణుల హడావుడి

'ప్రకృతి సేద్యా'నికి పద్మశ్రీ అవార్డు

యడ్లపల్లి కృషికి గుర్తింపుగా అవార్డు ప్రకటన




యడ్లపల్లి వెంకటేశ్వరరావు

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరావును 'పద్మశ్రీ' అవార్డు వరించింది. ప్రకృతి, సేంద్రియ సేద్యం విస్తృతమయ్యేలా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడుకు చెందిన యడ్లపల్లి వెంకటేశ్వరరావు 15 ఏళ్ల నుంచి రైతునేస్తం, ప్రకృతినేస్తం, పశునేస్తం పేరుతో మాసపత్రికలు నడుపుతున్నారు. ఏటా తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో మెరుగైన సేవలందించిన శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులకు రైతునేస్తం అవార్డులను ఐ.వి.సుబ్బారావు పేరుతో అందజేస్తుంటారు. వ్యవసాయరంగంలో ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయోత్పత్తుల నాణ్యతను మెరుగుపర్చి విదేశాలకు ఎగుమతులు చేసేవిధంగా రైతులకు 15 ఏళ్ల నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్, శిక్షణ కోసం తరగతులు నిర్వహించాలని తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు రైతునేస్తం ఫౌండేషన్‌తో ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో 'పద్మశ్రీ'కి ఎంపిక చేసినట్లు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ శుక్రవారం రాత్రి ఫోన్‌ద్వారా యడ్లపల్లి వెంకటేశ్వరరావుకు తెలిపింది. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీలు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ యలమంచిలి శివాజీ, మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు యడ్లపల్లిని అభినందించారు.

ముక్త్యాల ఎత్తిపోతలకు మోక్షం

రూ.489.28 కోట్లు విడుదల




అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై ముక్త్యాల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం నిర్మాణానికి రూ.489.28 కోట్లు విడుదల చేస్తూ జల వనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. ఇది పూర్తయితే రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం పరిధిలోని సాగు భూములకు నీరందుతుంది. రాష్ట్ర సరిహద్దులోని 38627 ఎకరాల ఆయకట్టుకు నీరందించే నాగార్జున సాగర్‌లో కేటాయించిన 32.25 టీఎంసీలు విడుదల కాకపోవడంతో, రైతుల కష్టాలను నివారించేందుకు వీలుగా.. ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర జల వనరుల శాఖ రూపకల్పన చేసింది. ఈ పథకాన్ని 2.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంలో నిర్మిస్తున్నారు. దీని ద్వారా 120 రోజుల పాటు రోజుకు 16 గంటల చొప్పున 386.27 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తారు. మొత్తం 38,627 ఎకరాలకు స్థిరీకరణ జరుగుతుందని జల వనరుల శాఖ పేర్కొంది. ఇప్పటి వరకు దేవినేని వెంకట రమణ బ్రాంచి కెనాల్‌కు వివిధ కారణాల వల్ల నీరందకపోవడంతో 30 ఏళ్లుగా శివారు ప్రాంతాల్లో సాగు, తాగు నీటికి రైతులు, ప్రజలూ అవస్థలు పడుతున్నారు. ఈ పథకం పూర్తయితే కష్టాలన్నీ తొలగిపోతాయి.

ఆనం సంజీవరెడ్డి ఎత్తిపోతలకు రూ.1953.59 కోట్లు

నెల్లూరు జిల్లాలో 47,000 ఎకరాలను స్థిరీకరించే ఆనం సంజీవరెడ్డి హైలెవల్ ఎత్తిపోతల కాలువ రెండో దశ పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కోసం రిజర్వాయర్లు, గ్రావిటీ కెనాల్, సీసీ లైనింగ్ పనులకు రూ.1953.49 కోట్లను విడుదల చేస్తూ జల వనరుల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 75.02	పాత ధర	రూ. 70.69
కొత్త ధర	రూ. 75.02	కొత్త ధర	రూ. 70.80
మార్పులేదు		పెరుగుదల: 11 పైసలు	



గాఢ నిద్ర, జ్ఞాపక శక్తికి ఉయ్యాల భేష్!

జెనీవా, జనవరి 25: చిన్న పిల్లల్ని ఉయ్యాలలో పడుకోబెడితే వెంటనే నిద్రపోతారు. పెద్దయ్యాక అలాంటి అవకాశం ఉండదు. ఎక్కడో.. లేదా ఎప్పుడో ఒకప్పుడు కాసేపు అలాంటి సరదా తీర్చుకునే వీలు దొరుకుతుంది. కానీ, ఇలా ఉయ్యాల్లో పడుకుంటే మంచి నిద్ర పట్టడంతోపాటు జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుందని తాజా సర్వే పేర్కొంది. యూనివర్సిటీ ఆఫ్ జెనీవాకు చెందిన పరిశోధకులు చేసిన ఈ సర్వే వివరాలను కరెంట్ బయాలజీ అనే జర్నల్‌లో ప్రచురించారు. పరిశీలనాత్మకంగా తెలుసుకునేందుకు 18మందిని ఎంపిక చేసి, ఒక రోజు ల్యాబ్‌లో, మరో రోజు ఉయ్యాలలో, ఇంకో రోజు మంచంపై నిద్రపుచ్చి చూశారు. ఇందులో ఉయ్యాలలో పడుకున్న వారు త్వరగా గాఢనిద్రలోకి వెళ్లిపోయారు. ఉదయాన్నే లేచిన తర్వాత పాత విషయాలను అడిగితే తడుముకోకుండా చెప్పేశారని పరిశోధకులు వెల్లడించారు. ఆ విధంగా ఉయ్యాలలో నిద్ర ఆరోగ్యానికి మంచి చేస్తుందని తేల్చారు.

ఆశావాదంతో మహిళల్లో షుగర్‌కు చెక్!

వాషింగ్టన్, జనవరి 25: ఆశావాదం మహిళల్లో షుగర్ వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుందని తాజా సర్వే పేర్కొంది. రుతుక్రమం ఆగిపోయిన మహిళలపై ఉమెన్స్ హెల్త్ ఇనీషియేటివ్ పేరుతో చేసిన ఈ సర్వే వివరాలను మోనోపాజ్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఆహారపు అలవాట్లు, ధూమపానం, వ్యాయామం, వ్యక్తిత్వ లక్షణాలతో షుగర్ వ్యాధికి ఉన్న సంబంధాలపై పరిశోధకులు ఆరా తీశారు. షుగర్ లక్షణాలు లేని లక్షా 39 వేల మంది మహిళల ఆరోగ్య పరిస్థితులను సుదీర్ఘకాలంగా పరిశీలించారు. 14 ఏళ్ల కాలంలో 19,240 మందికి టైప్2 డయాబెటిస్ వచ్చినట్లు గమనించారు. ఆశావాదం లేదని మహిళల విషయంలోనే ఇలా జరిగిందని తేల్చారు. ఏదైనా అంశంపై ఎక్కువ వ్యతిరేక ఆలోచనలు కలిగిన వారికి షుగర్ వచ్చే ముప్పు అధికమని హెచ్చరించారు.

4నుంచి వైసీపీ 'సమర శంఖారావం'

- తిరుపతిలో మొదటి సమావేశం
- 5న కడప, 6న అనంతలో...: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

తిరుపతి(టీటీడీ), జనవరి 25: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఫిబ్రవరి 4నుంచి 'సమర శంఖారావం' పేరిట సమావేశాలు నిర్వహించనున్నట్లు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయా జిల్లా కేంద్రాల్లో బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశమవుతారని చెప్పారు. తొలి సమావేశం తిరుపతిలో నిర్వహిస్తామని, 5న కడపలో, 6న అనంతపురంలో సమావేశాలు ఉంటాయని వివరించారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 14నెలల పాటు పాదయాత్ర చేసిన జగన్ అన్ని జిల్లాల్లోని ప్రజా సమస్యలను నేరుగా గుర్తించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం మొదటి నుంచి ఆయన పోరాటం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయం ఖాయమని పలు సర్వేలు చెబుతున్న నేపథ్యంలో తాము సూచించిన వారికే ప్రధానమంత్రి పదవి దక్కుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు ద్వంద్వ వైఖరికి పాల్పడుతూ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. వంగవీటి రాధా ఏవో కొన్ని సమస్యల వల్ల పార్టీని వీడారని, ఆయన తండ్రి విగ్రహం ఏర్పాటుకు జగన్ అనుమతి ఇవ్వలేదనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రంగా విగ్రహం ఏర్పాటుకు జగన్ గానీ, పార్టీ గానీ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదన్నారు.

'కాలుష్య' నియంత్రణకు ఏంచేశారు?

- అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు ఎన్జీటీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 25: వాయు, జల కాలుష్యాలు సహా ఇసుక అక్రమ తవ్వకాలు, పరిశ్రమల వ్యర్థాల ద్వారా పర్యావరణానికి జరుగుతున్న హానిని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శు(సీఎస్)లకు జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) సమన్లు జారీ చేసింది. ఘన వ్యర్థాల నిర్వహణ, నదీ జలాలు కలుషితం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని, వాటిని వివిధ రాష్ట్రాలు సమీక్షించి ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చని ఎన్జీటీ సూచించింది. ఈ నేపథ్యంలో మార్చి నుంచి మే మధ్య సీఎస్‌లు స్వయంగా ఆయా నివేదికలతో హాజరుకావాలని కోరింది. ఈ మేరకు ఎన్జీటీ చైర్‌పర్సన్ ఆదర్శ్ కుమార్ గోయెల్ 36 మంది సీఎస్‌లకు 36 తేదీలను కేటాయించారు.



తెలంగాణ పంచాయతీల్లో టీఆర్ఎస్ జోరు


- రెండో విడత ఎన్నికల్లోనూ ఆధిపత్యం
- 4130 పంచాయతీల్లో 2600 సర్పంచ్‌లు
- రెండు విడతల్లో కలిపి 5300 స్థానాల్లో గెలుపు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల్లోనూ కారు జోరు కొనసాగింది. టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు భారీ విజయాలు సాధించారు. 4130 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా.. దాదాపు 2600 స్థానాలకు పైగా సర్పంచ్ స్థానాలను టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మొదటి విడత పంచాయతీల విజయ పరంపరను కొనసాగించింది. మొత్తంగా రెండు విడతల్లో కలిసి 8300 పంచాయతీలకు ఎన్నికలు జరగగా.. దాదాపు 5300 స్థానాల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. కాంగ్రెస్ 1700 చోట్ల గెలిచింది. కొన్ని చోట్ల వివిధ కారణాలతో ఫలితాలను నిలిపివేశారు. కాగా మొదటి విడతతో పోలిస్తే.. రెండో విడతలో పోలింగ్ భారీగా పెరిగింది. మొదటి విడతలో 85.76 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ సారి 2.5 శాతం అదనంగా 88.26 శాతం పోలింగ్ నమోదైంది. మొదటి విడతలో 95.32 శాతంతో యాదాద్రి-భువనగిరి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవగా... ఈ సారి కాస్త తగ్గినప్పటికీ 93.71 శాతంతో మళ్లీ మొదటి స్థానాన్నే పొందింది. అత్యల్పంగా జగిత్యాలలో 80.23 శాతం పోలింగ్ నమోదైంది.

సర్కారు బడికి ఎమ్మెల్యేల పిల్లలు ఎందుకు వెళ్లరు?

- వాటిని ఎప్పటికీ బాగు చేయలేరా? : హైకోర్టు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపే విధంగా తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగేందుకు తీసుకున్న చర్యలేమిటని హైకోర్టు డివిజన్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఎంతమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారని నిలదీసింది. కేరళలో ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌ల పిల్లలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు వెళతారని ప్రస్తావించింది. ఇలాంటి చర్యల వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతుందని అభిప్రాయపడింది. అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు మధ్య అనుసంధానం ఉండాలని, ఇక్కడి నుంచే పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వ పాఠశాలలు పిల్లలను ఎందుకు ఆకర్షించడం లేదు? సరైన ఫలితాలు ఎందుకు రావడం లేదని నిలదీసింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించాలని, ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని సూచించింది. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అభిప్రాయపడింది. బడిలోనే సరైన చదువు చెప్పాలని, లేదంటే బతుకంతా చదువుకోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. మన ప్రధాని ఎవరు అని ప్రశ్నిస్తే చాలామంది పిల్లలు సరైన జవాబు చెప్పలేక పోతున్నారని, ఏమీ తెలియకుండానే వ్యవస్థ నడిచి పోతుందని వ్యాఖ్యానించింది. రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఏం చేస్తోందని ప్రశ్నించింది. గ్రామీణ ప్రాంతంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను అనుసంధానం చేస్తూ పైలట్ ప్రాజెక్టుగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఎంతమంది పిల్లలు అంగన్‌వాడీల్లో నమోదవుతున్నారు? ఎంతమంది ఉన్నత పాఠశాలలకు వెళుతున్నారు? ఆయా పాఠశాలల్లో ఫలితాలు ఎలా ఉన్నాయి? వంటి వివరాలు నివేదికలో పొందు పర్చాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు పడిపోవడాన్ని ప్రశ్నిస్తూ ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. కోర్టు ఆదేశాల మేరకు న్యాయవాది విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఒక నివేదికను కోర్టు పరిశీలనకు ఇచ్చారు.





వెనిజులా సంక్షోభం

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించనిదే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిద్రపోరని ఊహించిందే. గత ఏడాది గెలిచి, ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన మదురోను ట్రంప్ అధికారంలో కొనసాగనివ్వరనీ, చివరకు సైనిక ప్రయోగానికి సైతం వెనుకాడరని కొందరు విశ్లేషకులు అన్నారు. ఈ తరహా దుశ్చర్యలకు పాల్పడితే రష్యా, చైనాలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతాయి కనుక, వెనిజులా ఇరుగుపొరుగు దేశాలను ట్రంప్ తనతో కలుపుకొని, అక్కడి సైన్యాన్ని మదురోపై తిరుగుబాటు చేయిస్తారని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఊహించినట్టుగానే ట్రంప్ పుణ్యమాని వెనిజులా ఇప్పుడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. అమెరికా ఆశీస్సులతో విపక్ష నేత కువాన్ గ్వాయిడో తానే అధ్యక్షుడినని ప్రకటించుకోవడం, ప్రజలు ఎన్నుకున్న మదురోను కాక, ఇతడినే దేశాధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడం జరిగిపోయాయి.

దక్షిణ అమెరికాలోని ఏడు దేశాలతో పాటు కెనడా కూడా ట్రంప్ అభీష్టానికి అనుగుణంగా గ్వాయిడోనే గుర్తించింది. ఫ్రాన్స్, బ్రిటన్‌లు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగాలని మాత్రమే అన్నాయి. మెక్సికో, క్యూబా, బొలీవియాలు మాత్రమే మదురో పక్షాన నిలిచాయి. టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్ 'సోదరా, మదురో, బలంగా నిలబడు, నీ వెంట మేమున్నాం' అని ఒక ట్వీట్ చేశారు. భారత్ కూడా ట్రంప్ పక్షాన నిలవడానికి నిరాకరించింది. చైనా, రష్యాలు సరేసరి, వెనిజులా వ్యవహారాలను చక్కదిద్దే విషయంలో ఎంతకైనా తెగిస్తానంటున్న ట్రంప్‌ను గట్టిగా హెచ్చరిస్తున్నాయి. అమెరికా ప్రకటన తరువాత మదురో అమెరికన్ దౌత్య సిబ్బందిని బహిష్కరించి, ఆదివారంలోగా కార్యాలయాలు కట్టేసుకొని పొమ్మన్నారు. అక్కడినుంచి కదలవద్దనీ, మదురో ఏం చేయగలడో చూస్తానని ట్రంప్ అంటున్నారు. మదురో సచ్ఛీలుడనీ, ఎన్నికల్లో అక్రమాలు జరగలేదని ఎవరూ అనడం లేదు కానీ, పరిస్థితులను చక్కదిద్దుకోవలసిందీ, తమ భవిష్యత్తును నిర్ణయించుకోవలసిందీ అక్కడి నాయకులు, ప్రజలే తప్ప అమెరికా కాదు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిన మదురోను మించిన నియంతలు ఈ భూగోళంమీద అనేకులున్నారు. వారిజోలికి అమెరికా పోదు. ఐదేళ్ళక్రితం హ్యూగో ఛావెజ్ మరణానంతరం ఆయన రాజకీయ వారసుడిగా వచ్చిన వామపక్ష మదురో విషయంలో మాత్రం అమెరికాకు అన్ని ప్రజాస్వామిక విలువలూ గుర్తుకొస్తున్నాయి. చావెజ్ బతికున్నంత కాలం ఆయనను కుప్పకూల్చేందుకు ఎన్నో కుట్రలు పన్నిన అమెరికా ఇప్పుడు మదురోను దింపేసి, తన కీలుబొమ్మలను అధికారంలో ప్రతిష్ఠించాలని ప్రయత్నిస్తున్నది.

వెనిజులా సంక్షోభం సంక్లిష్టమైనది. గత ఏడాది మేనెలలో మదురో మరోమారు ఆరేళ్ళ పదవీకాలం కోసం 60శాతానికిపైగా ఓట్లతో ఎన్నికయ్యారు. ఎన్నికల్లో పోటీచేయని విపక్షం ఆయన విజయం అక్రమమని ప్రకటించింది. 2015 పార్లమెంటరీ ఎన్నికల్లో మెజారిటీ సాధించిన ప్రతిపక్షం మదురోను దించేయడానికి ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నది. మరొకపక్క అధ్యక్షుడికీ, పార్లమెంటుకూ మధ్య తలెత్తిన వివాదంలో సుప్రీంకోర్టు పార్లమెంటు అధికారాలనే రద్దు చేసింది. అధికారాలు లేని ఈ పార్లమెంటు మదురో ఎన్నికను గుర్తించబోనని పక్షం రోజుల క్రితం తీర్మానం చేసి, కువాన్ గ్వాయిడోను తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించినప్పుడు కూడా సుప్రీంకోర్టు ఇది రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేసింది. మదురోకు వ్యతిరేకంగా జనవరి 23నుంచి ప్రజలు ఉద్యమాలు చేయాలనీ, సైన్యం తిరుగుబాటు చేయాలనీ విపక్షాలు ప్రకటించడంతో దేశం ఇప్పుడు రాజుకుంది. ఈ పరిణామాలన్నింటి వెనుకా అమెరికా ఉన్నది. మదురో ఎన్నికను గుర్తించేది లేదని గత ఏడాదిలోనే ప్రకటించిన అమెరికా, ఇటీవల మదురో ప్రమాణస్వీకారం నాడు సైన్యాన్ని తిరుగుబాటు చేయవలసిందిగా బహిరంగంగానే పిలుపునిచ్చింది. చమురు ఎగుమతులపై ఆధారపడిన వెనిజులాను పలు ఆంక్షలతో పీల్చిపిప్పిచేస్తున్న అమెరికా, మదురో స్థానంలో ఎవరు వచ్చినా భారీ విరాళాలు, రుణాలు సమకూరుస్తానని ఆశచూపుతున్నది. దశాబ్దం క్రితం నాటి ఆర్థిక సంక్షోభం వెనిజులాను మరింత తీవ్రంగా వెంటాడుతున్నది. వినిమయ వస్తువుల ధరలు పదిపన్నెండు రెట్లు పెరిగిపోయాయి. నిరుద్యోగం, ఆకలి, ఆకలిచావులు, భారీ వలసలతో జనజీవనం అస్తవ్యస్తమై మదురోపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. అమెరికా ప్రాంతీయ ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, దాని కార్పొరేట్ సంస్థలకు వీసమెత్తు చోటివ్వకుండా, చమురు క్షేత్రాలను జాతీయం చేసిన మదురోను దింపేయడానికి అమెరికా సంక్షోభాన్ని మరింత రాజేస్తున్నది. మదురో ప్రభుత్వం స్థానంలో ప్రతిపక్షాలు వస్తే అమెరికా పెత్తనం, దోపిడీ పెరగడం తప్ప తమకు ఒరిగేది లేదని వెనిజులా ప్రజలకు తెలియకపోదు.

మళ్ళీ 'జనఘోష రైలు యాత్ర'

పార్లమెంట్ సాక్షిగా ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా ఇచ్చిన పలు హామీల అమలు పట్ల కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ళకు పైగా నేరమయ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నది. ఈ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ, చట్ట ప్రకారం చేయవలసిన పనులను సత్వరం చేయమని ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులు, యువకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఎన్నో రూపాలలో ఆందోళనలు చేస్తూనే ఉన్నప్పటికీ ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్రుల జనఘోషను ఢిల్లీ పాలకులకు వినిపించడం కోసం పలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. రైల్వే జోన్ విషయమై హై కోర్ట్ లో పిల్ వేశాము. వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన నిధులను వెనుకకు తీసుకోవడం పట్ల కూడా కోర్ట్ లో న్యాయం కోరుతున్నాం. గత సంవత్సరం ఇదే సమయంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీకి రైలు యాత్ర నిర్వహించాము.

మోదీ ప్రభుత్వ హయాంలో చివరి బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభం కాబోతున్నాయి. ఈ ప్రభుత్వ చివరి బడ్జెట్ ను ఫిబ్రవరి 1న పార్లమెంట్ లో ప్రవేశ పెట్టనున్నారు. ఈ సందర్భంగా అంతకన్నా ముందే వెళ్లి ఈ ప్రాంత ప్రజల ఘోషను వివిధ పక్షాల నాయకులు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడానికి 'జనఘోష రైలు యాత్ర' ను తలపెట్టాము. రాజకీయాలతో సంబంధం లేకుండా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్రుల జనఘోషను ఢిల్లీలో వినిపించి, రాష్ట్ర హక్కులను సాధించడానికి ఈ యాత్ర చేపట్టాము. జనవరి 27న విశాఖపట్నం నుండి ఉదయం 7.30 గంటలకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఉత్తరాంధ్ర ప్రతినిధి బృందంతో ఢిల్లీకి బయలు దేరుతున్నాము. ఈ నిరసన కార్యక్రమంలో వినూత్న రీతిలో ఢిల్లీలో ఉండే ఐదు రోజులు కూడా ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు అందరు కూడా నల్ల దుస్తులనే ధరించి కేంద్రమంత్రులు, పార్లమెంట్‌లోని వివిధ పక్షాల నాయకులు, రాష్ట్ర ఎంపీల వద్దకు వెళ్లి కలసి, వినతి పాత్రాలను సమర్పిస్తారు. వినతి పత్రాలతో పాటు పలు ఆందోళన కార్యక్రమాలను సహితం చేపట్టి వారిపై వత్తిడి తీసుకు వచ్చి వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతానికి తగు న్యాయం చేయమని కోరతాము.



మోదీ ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నది. విభజన హామీల అమలుకై నవ్యాంధ్ర ప్రజల ఘోషను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడానికి 'జనఘోష రైలు యాత్ర' ను తలపెట్టాము. రాజకీయాలతో సంబంధం లేకుండా రాష్ట్ర హక్కులను సాధించడమే ఈ యాత్ర లక్ష్యం.

గత ఏడాది కూడా జనవరి 27నే వినూత్న రీతిలో 'రైలు దీక్ష'ను 48 గంటల పాటు చేపట్టాము. ఈ సందర్భంగా ఢిల్లీలోని వివిధ రాజకీయ పక్షాల నాయకులను, సంబంధిత మంత్రులను కలసి వినతి పత్రాలను అందజేయడంతో పాటు ఢిల్లీలో వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలు జరిపారు. అదే తరహాలో ఈ సంవత్సరం కూడా అదే రోజున జనవరి 27న విశాఖపట్నంలో రైలు ద్వారా బయలుదేరి ఇంకా పెద్ద ఎత్తున ఈ ప్రాంత ప్రజల జన ఘోషను వినిపించడానికి రైలు యాత్రను చేపట్టాము. ఈ యాత్రకు మద్దతు ఇవ్వమని వివిధ రాజకీయ పక్షాలకు, రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేస్తున్న వివిధ సంఘాల నాయకులను కలుసుకొని కోరాము.

ఈ సారి జరిపే జనఘోష రైలు యాత్రలో ఉత్తరాంధ్రలోకి మూడు జిల్లాల నుండి కూడా భారీ సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారు. కళా బృందాలను కూడా తీసుకు వెళ్లి బిజెపి ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ఈ బృందాల ద్వారా దేశ వ్యాప్తంగా తెలియచెప్పే విధంగా సన్నాహాలు చేస్తున్నాము.

రాష్ట్ర విభజన జరిగి ఐదు సంవత్సరాలు కావస్తున్నా పార్లమెంట్ సాక్షిగా అప్పటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలు, విభజన చట్టంలోని వివిధ అంశాలు అమలు కానందుకు నిరసనగా ఈ ఆఖరి ప్రయత్నం చేస్తున్నాము. రాష్ట్రానికి, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి, విశాఖపట్నంకు రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్‌ల కేటాయింపు, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, విశాఖపట్నంలో హై కోర్ట్ బెంచ్ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్ట్ ఖర్చును పూర్తిగా కేంద్రమే భరించడం, ఈ ప్రాజెక్ట్ పూర్తికి అవసరమైన అన్ని చర్యలను కేంద్రం సత్వరం తీసుకోవడం, వెనుకబడిన ఉత్తరాంధ్రలో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం, ఉత్తరాంధ్ర మరో భోపాల్ కాకుండా పర్యావరణాన్ని రక్షించడం వంటి ప్రధాన డిమాండ్లతో 'జనఘోష రైలు యాత్ర' చేబడుతున్నాము. ఎన్నికల సమయంలో, ఆ తర్వాత ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక సదుపాయాలు, సహాయం గురించి మోదీ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఎదురుచూసాము. కానీ ఎటువంటి ఆర్థిక భారం లేని రైల్వే జోన్ వంటి విషయంలో కూడా సానుకూలంగా అడుగు వేయక పోవడం, తాము ఇచ్చిన హామీల గురించే మాట్లాడక పోవడం ద్వారా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పట్ల ప్రదర్శిస్తున్న నేరమయ నిర్లక్ష్యం ఏమాత్రం క్షంతవ్యం కాబోదు. అందుకు భారీ మూల్యం చెల్లింపవలసి వస్తుందని హెచ్చరిస్తున్నాను. మనమంతా కలిస్తేనే ఈ ప్రభుత్వం మెడలు వంచి మన హక్కులను, ప్రయోజనాలను సాధించుకోవడం సాధ్యం కాగలదని ఈ సందర్భంగా మనమూ గ్రహించాలి.

■ కొణతాల రామకృష్ణ
కన్వీనర్, ఉత్తరాంధ్ర చర్చా వేదిక

పాత నీరూ కొత్త గాలీ!

■ పి. చిదంబరం



'పళని' పలుకు

పాష్య లక్ష్మి మళ్ళీ వచ్చింది. సంక్రాంతి మహోత్సవాన్ని జరుపుకున్నాం. పండుగ తొలినాటి ప్రతీకాత్మక వేడుక భోగిమంటలు. పాతబట్టలు, విరిగిపోయిన వ్యవసాయ పరికరాలు, ఇంకా పనికిరాని వస్తువులను ఆ వేడుకలో దగ్ధంచేస్తాం. నిరాశలు, నిస్పృహలు, ఇక్కట్లు, ఇబ్బందులు అన్నిటినీ పక్కన పెట్టిన వనవంగా జీవితాన్ని ప్రారంభిస్తారు. పంటల పండుగ సంక్రాంతి వలే ప్రజాస్వామ్య ప్రక్రియ సార్వత్రక ఎన్నికలు కూడా కొత్త జీవితాన్ని నిర్మించుకునేందుకు ఒక ఆస్కారాన్ని జాతికి కల్పిస్తుంది. కొత్త సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకుని ఆంగ్ల మహాకవి ఆల్ఫ్రెడ్ టెన్నిసన్ ఉత్తేజకర ఉద్ఘోష 'రింగ్ఔట్ది ఓల్డ్, రింగ్ ఇన్ ది న్యూ' భారతీయప్రజాస్వామ్య ప్రస్థానంలో రాబోయే సార్వత్రక ఎన్నికలు తీసుకువచ్చే మేలు మలుపుకు కూడా వర్తిస్తుంది.కొత్త పాలనకు స్వాగతం పలికేముందు,నిరాశా నిస్పృహలు, ఇక్కట్లు ఇబ్బందులకు గురిచేసినపాతపాలనలోని చాలా వాటినిమనం త్యజించాలి. అవేమిటో వివరంగా ప్రస్తావిస్తాను.

మనలను పీడిస్తున్న సమస్యలు చాలా సంక్లిష్టమైనవి. వాటి పరిష్కారానికి ఓర్పు, నేర్పు ఎంతో అవసరం. బలప్రయోగం పనిచేయదు. అధికార దర్పం చూపడం నిష్ప్రయోజనం. సమస్యతో సంబంధమున్న ప్రతి ఒక్కరి అభిప్రాయానికి మన్ననినిచ్చి నిష్పాక్షిక దృక్పథంతో వ్యవహరిస్తేనే సత్ఫలితాలు సమకూరుతాయి.జమ్మూకశ్మీర్ లోన్యూఢిల్లీ పాలకులుఅనుసరిస్తున్నవిధానాలు పరిస్థితులు మరింతగా విషమించడానికి మాత్రమే దోహదం చేస్తున్నాయి. అధికార బలంతో దేన్నైనా అధిగమించగలమనుకోవడం పెద్ద పొరపాటు. సైనిక పద్ధతులను ప్రజలు హర్షించరు. అల్పసంఖ్యాక వర్గాలవారిపై అధిక సంఖ్యాకుల అభిప్రాయాలను రుద్దితే ఎలా? ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం ఇలా చేస్తుండడం వల్లే కశ్మీరీలలో భారత్ పట్ల వ్యతిరేకత ప్రబలిపోతోంది. యువ కశ్మీరీలు ఉగ్రవాద బృందాలలో చేరిపోతున్నారు. ఇదెంత విషాదం! 2010 సంవత్సరంలో ఐఏఎస్‌కు ఎంపికైన ఒక కశ్మీరీ యువకుడు న్యూఢిల్లీ తీరుతెన్నుల మూలంగా తీవ్ర ఆశాభంగం, నైరాశ్యంతో ఆ అత్యున్నత సర్వీస్ నుంచి నిష్క్రమించారు. ఈశాన్య భారత రాష్ట్రాలలో న్యూఢిల్లీ అనుసరిస్తున్న విధానాలు కశ్మీర్‌లో అనుసరిస్తున్న వాటికి భిన్నమైనవి కావు. కాకపోతే నేషనల్రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్ఆర్‌సి)ని అంత హడావుడిగా రూపొందించడమేమిటి? ప్రభుత్వ వైఖరి కారణంగానే నలభై లక్షల మందికి పైగా భారతీయ పౌరులు ఎన్ఆర్‌సిలో నమోదు కాలేకపోయారు. భారతీయులై ఉండికూడా ఏ దేశానికి చెందని పౌరులై పోయారు! మన పౌరులను మనమే గుర్తించకపోవడం గర్హనీయం కాదూ? ఎందుకిలా జరిగింది? పొరుగుదేశాలలో ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో 'పీడనకు గురవుతోన్న మైనారిటీల' విషయమై తప్పుడు శ్రద్ధ చూపడమే అందుకు కారణం కాదూ? ఈ వైఖరి మారాలి.

అక్రమ చట్టాలను మనం రద్దు చేసి తీరాలి. వాటి స్థానంలో సరైన శాసనాలను తీసుకురావాలి. 'దేశద్రోహం' అంటే ఏమిటో నిర్వచిస్తున్న భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) లోని 124 ఎ సెక్షన్ ఉపసంహరణకు అగ్ర ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అవును ఆ ఐపీసీ నిబంధనను సంపూర్ణంగా తొలగించి తీరాలి. అలాగే అమాయక పౌరుల ప్రాణాలను దయాదాక్షిణ్యాలు, జవాబుదారీతనం లేకుండా బలిగొనడానికి దారితీస్తున్న సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని కూడా రద్దు చేయాలి. లేదూ, దాన్ని విస్తృతంగా సవరించాలి. ఇవి ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. సరే, వస్తు సేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ట్యాక్స్ – జీఎస్టీ) చట్టాలను పూర్తిగా పునః రూపొందించి తీరాలి. మీలో ఎవరైనా సెంట్రల్ జీఎస్టీ యాక్ట్ పాఠాన్ని పూర్తిగా చదివారా? ఏ కొద్ది భాగాన్ని అయినా అర్థం చేసుకున్నారా? లీగల్ ఇంగ్లిష్ భాషలో ఉన్నట్లుగా చెప్ప బడుతున్న ఈ శాసన పాఠాన్ని చదివి, అర్థం చేసుకున్న వ్యక్తి ఎవరైనా ఉంటే అతనికి తక్షణమే, అవును తక్షణమే, న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయడానికి అనుమతి నివ్వాలి. న్యాయశాస్త్రంలో ఎటువంటి డిగ్రీలు, శిక్షణ లేకున్నప్పటికీ న్యాయవాది కావడానికి అతడు అన్ని విధాల అర్హుడవుతాడు మరి! వస్తుసేవల పన్ను చట్టాలలోని అక్రమ సంపాదన వ్యతిరేక నిబంధనను తొలగించాలి. అంకుర సంస్థలపై వేస్తున్న ANGEL TAXను రద్దు చేయాలి.

ప్రభుత్వ సహాయం అవసరంలేని వారు మన సమాజంలో ఎంతమంది వుంటారు? దురదృష్టవశాత్తు మన సమాజంలో అత్యధికులు తమ కష్టాల నుంచి బయటపడేందుకు ప్రభుత్వ సహాయంపై ఆధారపడుతున్న వారే. అంటే పేదలు అంత పెద్ద సంఖ్యలో ఉన్నారనేది స్పష్టం. మరి ఈ పేదల అభ్యున్నతికై ప్రభుత్వాలు అనేక పథకాలు రూపొందిస్తోంది. అయితే వాటి అమలులో చిత్తశుద్ధి లేదు. అసలు ఆ సంక్షేమ పథకాల రూపకల్పనే లోపభూయిష్ఠమైనదని సహేతుకంగా చెప్పవచ్చు. ఆ శ్రేయో పథకాలు స్వతసిద్ధంగానే వివక్షాపూరితంగా ఉంటున్నాయి. వాటి స్థానంలో తక్షణమే, ఉద్దేశిత లక్ష్యాలను శీఘ్రగతిన సాధించడానికి దోహదం చేసే పటిష్ఠ పథకాలను రూపొందించాలి. ఇటువంటి పథకాలు ఒకటా రెండా? చాలా వున్నాయి.

కొన్నిటిని పేర్కొంటాను. అవి: 'ముద్రా' రుణాలు; (వాడుకోని, వాడుకోవడం అసాధ్యంగా ఉండే మరుగు దొడ్లను నిర్మించే) స్వచ్ఛ్ భారత్; రైతులను దోచి, బీమా కంపెనీలను సుసంపన్నం చేస్తున్న ఫసల్ బీమా యోజన (పంటల బీమా పథకం); శిక్షణ పొందినవారిలో కేవలం 28శాతం మందికి మాత్రమే ఉద్యోగాలను చూపగలుగుతున్న కౌశల్ వికాస్ యోజన (నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం); స్వల్ప నిధులు మాత్రమే కేటాయించిన, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళలేని పేదలనూ మినహాయించిన ఆయుష్మాన్ భారత్ (అందరికీ ఆరోగ్యం) పథకం మొదలైనవి. మీఅనుభవంలోకి వచ్చిన మరే ఇతర పథకాన్ని అయినా ఈ జాబితాలో చేర్చవచ్చు. ఏమైనా ఈ సంక్షేమ పథకాలలోని లొసుగులు, లోపాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలి.

ప్రతి పౌరునికీ ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య నిస్తున్నారు. ఇదే ఆధార్ పథకం. 'సబ్సిడీలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు బదిలీ చేసేందుకు, పౌరులకు సేవలను అందించేందుకు' మాత్రమే ఆధార్‌ను ఉపయోగించుకోవాలని ప్రభుత్వాన్ని ఆధార్ చట్టం స్పష్టంగా నిర్దేశించింది. అంతమటుకు మాత్రమే అధికారాలను కల్పించింది. అయితే ప్రభుత్వం ఈ అధికారాలను ఉల్లంఘిస్తోంది. నిర్దేశించిన వాటితో పాటు ఇంకా వివిధ కార్యకలాపాలకు సైతం ఆధార్ అనివార్యమయ్యేలా చేసింది. ఇందుకు పౌరులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని పెద్ద ఎత్తున సేకరిస్తోంది. అంటే దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను పాలకులు కాలరాచి వేస్తున్నారు. చట్ట విరుద్ధంగా పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని ఎలా సేకరించగలుగుతున్నారు? రాబోయే ప్రభుత్వం ఈ ప్రశ్నకు సవివరమైన సమాధానమిచ్చితీరాలి.



ప్రస్తుతం మన పాలనా వ్యవస్థలో విస్తారంగా ఉన్న లోపాలు, లొసుగులు, అవకతవకలను తొలగించుకున్నప్పుడు మాత్రమే మనం అనేక అవస్థల నుంచి బయటపడగలం. వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రక ఎన్నికల అనంతరం రానున్న కొత్త పాలన అందుకు దోహదం చేసి తీరాలి.

ఇప్పుడు అన్ని కార్యలాపాలూ యాంత్రీకృతమై పోతున్నాయి. ఓటింగ్ పద్ధతి కూడా ఇందుకు మినహాయింపు కాదు. అయితే పంచాయత్ నుంచి పార్లమెంటు వరకుసకల ఎన్నికలలో ఓటింగ్‌కు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) తీరుతెన్నులపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల నిర్వహణలో ఈవీఎంల ప్రమేయం ఉండకూడదని గతంలో వలే పేపర్ బ్యాలెట్లనే ఉపయోగించాలని డిమాండ్ చేస్తున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. అయితే ఎన్నికల సంఘం (ఇసి), ప్రభుత్వం ఈ అభ్యంతరాలను పూర్తిగా త్రోసి పుచ్చుతున్నాయి. పేపర్ బ్యాలెట్‌ను మళ్ళీ ఉపయోగించేది లేదని, ఈ వీఎమ్‌లను శాశ్వతంగా ఉపయోగించడం జరుగుతుందని ఘంటాపథంగా ప్రకటిస్తున్నాయి.


నేను ఈవీఎమ్‌లకు మద్దతు నిచ్చాను. ఎందుకంటే ఈవీఎమ్‌లయితే చెల్లదగ్గ ఓటును వేయడం చాలా సులువు. మనం ఎవరికి వేశామో వారికే అది జమ కాగలదని భరోసా ఉంటుంది. అయితే ఈవీఎమ్‌లు సరిగ్గా పని చేయడం లేదని, వాటిని ట్యాంపరింగ్ చేయడం జరుగుతుందని విశదం చేస్తున్న పలు ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఇది నన్ను ఎంతైనా కలవరపరచింది. ఈ సమస్యకు పరిష్కారంగా ఈవీఎమ్‌లతోపాటు వివిప్యాట్ (ఓటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) లను కూడావినియోగించాలని సూచించాను. దరిమిలా ఆ రెండిటినీ ఉపయోగించడం జరుగుతోంది. ప్రతి శాసనసభా నియోజక వర్గంలోనూ ఈవీఎమ్‌లలో ప్రతి అభ్యర్థికీ నమోదయినఓట్ల సంఖ్య, వివిప్యాట్ పత్రాలతో సరిచూచి, సక్రమంగా ఉన్నట్టు నిర్ధారించాలి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ 250 నుంచి 300 దాక పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. ఈవీఎమ్ లలో ప్రతి అభ్యర్థికీ నమోదయిన ఓట్ల సంఖ్య వివిప్యాట్ పత్రాల భౌతికలెక్కింపుతో సరిసమానంగా ఉండాలి. అలా ఉన్నప్పుడే పోలింగ్ సక్రమంగా జరిగినట్టుగా భావించి తీరాలి. అయితే ఇలా ఈవీఎమ్ లలో నమోదయిన ఓట్లను, వివిప్యాట్ పత్రాలను రెండిటినీ లెక్కించి సరి చూడటమనేది ఎక్కువ సమయం తీసుకునే ప్రక్రియ అని, ఫలితాల ప్రకటనలో జాప్యం జరగగలదని కొందరు వాదిస్తున్నారు. ఇది చాలా బలహీన వాదన. సహేతుకమైనది కాదు. ఫలితాల ప్రకటన మూడు లేదా నాలుగు గంటలు జాప్యమయితే నష్టమేమున్నది? ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రియ మరింత విశ్వసనీయతను సంతరించుకుంటే ఇటువంటి ఆక్షేపణలు, జాప్యాలను పట్టించుకోవల్సిన అవసరం లేదు.

బ్యాలెట్ పేపర్ల వినియోగానికితిరిగి వెళ్ళవలసిన అవసరం లేదనే నమ్మకం నాలో గట్టిగా పాదుకుపోయింది. అయితే ఈ నెల 22న 'ది హిందూ'లో జి.సంపత్ వ్యాసం చదివిన తరువాత ఈవీఎమ్‌ల విషయంలో నాలో నిరుత్సాహం చోటు చేసుకున్నది. ఆ వ్యాస రచయిత వాదనల ప్రకారం పేపర్ బ్యాలెట్ పద్ధతే ఉత్తమమైనది. ఆ పద్ధతిలో ఓటు ఎవరికి వేసింది ఖాయంగా తెలుస్తుంది; అది రహస్య బ్యాలెట్; ఓట్ల గణనమనకు దృశ్యమానమవుతుంది. ఈ మూడు గీటురాళ్ళను పేపర్ బ్యాలెట్ పద్ధతి సంతృప్తి పరుస్తుంది. ఈవీఎమ్ వివిప్యాట్ పద్ధతి ఈ మూడు గీటురాళ్ళ విషయంలో విఫలమయిందని జర్మన్ రాజ్యాంగ న్యాయస్థానం తీర్పు ఒకటి స్పష్టం చేసింది. 'హిందూ' వ్యాస రచయితతో గానీ, జర్మనీ న్యాయస్థానంతో గానీ విభేదించడం కష్టం. పోలింగ్ ప్రక్రియ నుంచి ఈవీఎమ్‌లను పూర్తిగా ఉపసంహరించాలని నేను చెప్పను. అయితే పోలింగ్ కేంద్రాలలో ఈవీఎమ్‌లలోని ఓట్లలెక్క, వివిప్యాట్ పత్రాల లెక్క సరిసమానంగా ఉండితీరాలని మనం డిమాండ్ చేసి తీరాలి. ప్రస్తుతం మన పాలనా వ్యవస్థలో విస్తారంగా ఉన్న లోపాలు, లొసుగులు, అవకతవకలను తొలగించుకున్నప్పుడు మాత్రమే మనం అనేక అవస్థల నుంచి బయటపడగలం. వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రక ఎన్నికల అనంతరం రానున్న కొత్త పాలన అందుకు దోహదం చేసి తీరాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

వైజ్ఞానిక వైఖరి వికసించాలి

భారత రాజ్యాంగం ప్రస్తావించిన ప్రాథమిక విధులలో 'వైజ్ఞానిక దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను పరిశోధనా, సంస్కరణ స్ఫూర్తిని పెంచుకోవడం' కీలకమైనది. ఆధునిక ప్రపంచంలో భారత్‌కు సముచితమైన స్థానం కోసం తొలి ప్రధాని నెహ్రూ పటిష్ఠపునాదులు వేసారు. ప్రజల ప్రగతికి ఉపయోగపడే మౌలిక రంగాలు ప్రభుత్వమే నిర్వహించాలన్న రాజ్యాంగ లక్ష్యం వెలుగులో తన హయాంలోని పంచవర్ష ప్రణాళికలలో యుద్ధ ప్రాతిపదికన భారీగా పాఠశాలలను, కళాశాలలను స్థాపించాడు. మత పురోగతికి అడ్డుకట్టవేయాలంటే విద్యార్థులలో వైజ్ఞానిక దృక్పథం పెంచాలని ఆయన నిర్ణయించుకున్నాడు. నెహ్రూ 1958లో శాస్త్ర సాంకేతిక విధాన రూపకల్పన చేసాడు. జహంగీర్ భాబా సారథ్యంలో అణుశక్తి కమిషన్ స్థాపించాడు. శాస్త్ర సాంకేతిక రంగాలలో స్వావలంబన కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసాడు. సి.వి. రామన్, జె.సి ఘోష్, శాంతి స్వరూప్ భట్నాగర్‌ల సహకారంతో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ ను దేశవ్యాప్తంగా విస్తరింపచేసి అరవైకి పైగా పరిశోధన ప్రయోగ, ఇన్నోవేషన్ కేంద్రాలను ప్రారంభించాడు. ఇందిరాగాంధీ హయాంలో 1970 లో ఏర్పాటైన నేషనల్ కమిటి ఆన్ సైన్స్ అండ్ టెక్నాలజి ఈ కృషిని మరింతగా కొనసాగించింది రక్షణ రంగంలో స్వయం సమృద్ధి కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్, ఎర్త్ మూవర్స్, డైనమిక్స్, ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ లాంటి ఎన్నో సంస్థలను నెహ్రూ స్థాపించాడు.



వరల్డ్ నెహ్రూ, ఇందిరల హయాంలో సమృద్ధిగా నిధులు పొందిన పరిశోధనా సంస్థలకు తర్వాత కాలంలో కేటాయింపులు తగ్గుముఖం పట్టాయి. జి.డి.పి లో శాస్త్ర సాంకేతిక రంగాలకు మూడు శాతం కేటాయించాల్సిందిగా ఉండగా గత ఇరవై సంవత్సరాలుగా సగటున 0.7% నిధులను పొందాయి. మోదీ అధికారంలోకి వచ్చాక కేటాయింపులు 0.4%కి పడిపోయాయి. పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలలో జడత్వం ఆవరించింది. శాస్త్రవేత్తల కృషిని అగౌరవ పరిచే సూడో సైన్స్ ధోరణులను వ్యాప్తి చెందిస్తున్నది. ఇటీవల జలంధర్‌లో జరిగిన 106వ భారతీయ సైన్స్ కాంగ్రెస్ ఈ సూడో ధోరణులకు అశాస్త్రీయ ప్రసంగాలకు వేదికగా నిలిచింది. 1974లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సమావేశమైన భారత శాస్త్రవేత్తల బృందం వ్యక్తిగత మత విశ్వాసాలకు, పురాణ సంబంధ అంశాలకు శాస్త్రీయత విలువను ఆపాదించకూడదని, శాస్త్రీయ శోధనలలో వాటికి తావివ్వకూడదని తీర్మానించింది. దీనిని ఉల్లంఘిస్తూ సంఘ్ పరివార్ అనుకూల 'శాస్త్రవేత్తల' బృందం 2015 ముంబై, 2016 మైసూరు, 2017 తిరుపతి, 2018 ఇంఫాల్, 2019 జలంధర్ సమావేశాలను కాల్పనిక గాథల వేదికలగా మార్చి ప్రపంచం ముందు నవ్వుల పాలు చేసింది. చరిత్రతో పాటు సైన్స్‌ని కూడా వక్రీకరించి మత రాజకీయాలను అధికారం కోసం బీజేపీ ప్రచారం చేస్తున్నది. సైన్స్ కాంగ్రెస్‌లను సర్కస్‌లుగా వర్ణించిన నోబెల్ గ్రహీత వెంకట్రామన్ రామకృష్ణన్ సమావేశాలకు రావడం మానివేసాడు. ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగం ప్రవచించిన వైజ్ఞానిక మానవజిజ్ఞాసను ప్రజలలో పాదుకునేలా పౌరసమాజం తీవ్రంగా కృషి చేయాలి. ప్రజల ప్రగతికి ఉపయోగపడే విద్య వైద్యం శాస్త్ర సాంకేతిక రంగాలను రాజ్యమే నిర్వహించాలి. విద్యాలయాల్లో విజ్ఞానశాస్త్రాన్ని పటిష్ఠంగా బోధించాలి. ఈ ప్రస్థానంలోనే మాభారతదేశం ప్రపంచపటంలో సమున్నతంగా నిలబడుతుంది.

■ అస్నాల శ్రీనివాస్

మన కాలం బసవేశ్వరుడు

శివ కుమార స్వామిజీ 'మఠం అంటే మతం కాదు, జనహిత క్షేత్రమని' ఆధ్యాత్మికతకు కొత్త అర్థంచెప్పి ఆధ్యాత్మికతను సమాజ సేవగా మార్చిన మహనీయుడు. కుల మత ధర్మ లింగ వర్గ వర్ణ ప్రాంత రహితంగా నిరుపేదలకు అన్నం, ఆశ్రయం, విద్యను అందించిన అభినవ బసవేశ్వరులు. 12వ శతాబ్దంనాటి సాంఘిక సంస్కర్త బసవన్న అవతారం శివకుమారస్వామీజీ. సామాన్య కుటుంబంలో జన్మించిన స్వామిజీ దీన, దళిత, బడుగు, బలహీన వర్గాల్లో వెలుగులు నింపిన మహనీయుడు. సర్వమానవ సమానత్వం, నిరాడంబరత, సమాజసేవకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన స్వామీజీ, సమాజ మనుగడకు మతం కాదు మానవత్వం ముఖ్యమని, మహాత్మ బసవేశ్వరుని ఆశయాలకు అనుగుణంగా కుల రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేసారు. ఆధ్యాత్మికతకు కొత్త అర్థం చెప్పిన ఆధునికుడు స్వామీజీ. మఠాల, పీఠాల గమ్యాలు మారాలని కొత్త లక్ష్యాలతో, కొత్త మార్గాలలో నడవాలని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని స్వామీజీ ఆకాంక్షించారు. సదా తపోదీక్షలో ఉన్నట్లు కనిపించే గొప్ప ధ్యాని, ఆత్మ జ్ఞాని, గ్రామసీమల్లో విజ్ఞాన జ్యోతిని నింపిన అక్షర యజ్ఞోపవీతం స్వామీజీ. నిరుపేదల ఆశాదీపం. సేవే మానవ జాతి పరమార్థం అని చాటిన నిష్కామయోగి, లక్షలాది ప్రజలపై కరుణధార కురిపించిన దయాసింధు, దీనబంధు స్వామీజీ. తన జీవితంలో సామాజిక సేవ ఆధ్యాత్మిక సేవ తప్ప దేని గురించి ఆలోచించని మహనీయుడు శివకుమారస్వామీజీ.

కర్ణాటకలోని రామ్‌నగర్ జిల్లా, మాగాడి తాలుకాలోని, వీరపురాలో 01 ఏప్రిల్, 1907న స్వామీజీ గంగమ్మ, హోనప్ప దంపతులకు సామాన్య రైతు కుటుంబంలో 13వ సంతానంగా జన్మించిన స్వామీజీకి తల్లితండ్రులు శివణ్ణ అని నామకరణం చేసారు. బాల్యంలో తన తల్లిని కోల్పోవడంతో తన సోదరి పెంపకంలో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. పాఠశాల విద్యను తుమ్కూర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ పూర్తి చేసుకున్నారు. విద్యాభ్యాస సమయంలో సెలవుల్లో కృషీవలుడి అవతారమెత్తి తన తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. తుమ్కూర్‌లో తను ఉంటున్న ప్రదేశంలో ప్లేగు వ్యాధి వ్యాపించడంతో అద్దె ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. ఇల్లు ఖాళీ చేసిన స్వామీజీ సిద్ధగంగ మఠంలో ఆశ్రయం పొందారు. ఆ సమయంలో అప్పటి సిద్ధగంగ మఠాధిపతి ఉద్దాన శివయోగీశ్వరులకు అత్యంత సన్నిహితుడు, వారసుడు అయిన చిన్నస్వామి మరులరాధ్యతో పరిచయం ఏర్పడింది. పరిచయం మంచి మిత్రత్వంగా మారి క్రమంగా స్వామీజీని ఆధ్యాత్మిక చర్చల్లో పాల్గొనే స్థాయికి తీసుకెళ్ళింది. మరులరాధ్య శివణ్ణను తన గురువు సిద్ధగంగ మఠాధిపతి ఉద్దాన శివయోగీశ్వరులకు పరిచయం చేసారు. ఇతరులకంటే భిన్నంగా ఆలోచిస్తూ, నిత్యం ఆధ్యాత్మిక చింతనలో గడిపే, శివణ్ణలోని అపారజ్ఞానం, ధార్మిక విలువలు, వేద పరిజ్ఞానం, ఆధ్యాత్మిక సంపత్తి, శిష్టాచారాలు పాటిస్తూ, నిష్ఠగా ఉండే శివణ్ణ మఠాధిపతి శివయోగీశ్వరుల స్మృతిపథంలో మెదిలారు. మఠవారసుడు మరులరాధ్య ఆకస్మిక మరణంతో ఉద్దాన శివయోగీశ్వరులు శివణ్ణను 03 మార్చి, 1930న తన వారసుడిగా మఠానికి ఉత్తరాధికారిగా నియమించారు. అప్పటి నుండి శివణ్ణ శివకుమార స్వామీజీగా మారిపోయారు. స్వామీజీ కొన్ని సంవత్సరాలపాటు మఠానికి ఎన్నోరకాల సేవలందించారు. 11 జనవరి 1941న గురుమగారు ఉద్దాన శివయోగీశ్వరులు శివైక్యం చెందడంతో శివకుమారస్వామీజీ సిద్ధగంగ మఠం మఠాధిపతిగా బాధ్యతలను స్వీకరించారు. శివకుమార స్వామీజీ తను మఠాధిపతిగా బాధ్యతలను స్వీకరించినపుడు ఆర్థిక వనరులు గానీ, ఆస్తులు గానీ, విద్యాసంస్థలు గానీ అంతగా లేవు. దాతల ఔన్నత్యంతో నిత్య కార్యక్రమాలు జరిగేవి. మఠం అంటే కేవలం ఆధ్యాత్మికతనే కాకుండా నిరుపేదల వెనకబాటుతనాన్ని, విద్యావసరాన్ని గుర్తించిన స్వామివారు, విద్య అనేది కులం, మతం, ధనిక, పేదలకు అతీతంగా అందరికి సమానంగా అందాలనే దృక్పథంతో విద్యాసంస్థలను నెలకొల్పి విద్యార్థులకు ఉచిత విద్య, భోజన వసతి కల్పించారు. విద్యాసంస్థలను నెలకొల్పిన మొదట్లో ఉదయం, సాయంత్రం భిక్షాటన చేసి విద్యార్థుల భోజనానికి కావలసిన సామగ్రి సమకూర్చి మూడుపూటల భోజన వసతి కల్పించారు. ఆధ్యాత్మికత, విద్య అవసరంపై స్వామివారు చేసే బోధనలు జనాన్ని కదిలించాయి. క్రమంగా కర్ణాటకయే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా స్వామీజీకి, శిష్యులు, భక్తులు ఏర్పడ్డారు.

ముఖ్యంగా 1960లో వరుసగా కర్ణాటకలో కరువు సంభవించినపుడు ప్రజలు పనులు కరవై, బతుకు బరువై, ఆహారం దొరకక ప్రాణాలు కోల్పోతున్న సమయంలో క్షామం కమ్మిన నేలపై సిద్ధగంగ మఠం ఓ ఆశాకిరణంలా ప్రజలకు కనిపించింది. అన్నార్తులుగా వచ్చిన ప్రజల మొర ఆలకించి తన పరివారంతో కదిలి జోల పట్టి ఊరూ వాడ తిరిగి మానవతా వాదుల సాయంతో ప్రజల క్షుద్బాధ తీర్చారు స్వామీజీ. యాత్రలు, నిరంతర యత్నాలతో మఠానికి ఆదాయ వనరులు సమకూర్చుకున్నారు. అంచెలంచెలుగా విద్యా సంస్థలను పెంచిన స్వామివారు 1963లో సిద్ధగంగ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించారు. పట్నం నుండి పల్లెదాకా 132కి పైగా విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి ఉచిత విద్యతోపాటు, భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిత్యం 11 వేల మందికి పైగా విద్యార్థులకు మూడు పుటలా భోజనంతోపాటు, మఠ సందర్శనకు వచ్చే భక్తులకు ఎల్లవేళలా భోజన సదుపాయం కల్పించారు. ప్రపంచ చరిత్రలో ఒక వ్యక్తి శక్తిగా మారి వేలాదిమందికి అన్నదానం, విద్యాదానం చేయడం ఇది మొదటిదని చెప్పవచ్చు. సామాజిక ప్రగతికి సాంకేతిక విద్య తోడ్పడుతుందని విశ్వసించిన స్వామీజీ అందుకు అనుగుణంగా పాఠశాలతో పాటు కాలేజీలు, ఉన్నత విద్యా సంస్థలు నెలకొల్పి ఎంతో ఖర్చుతో కూడుకున్న సాంకేతిక విద్యను సైతం వేలాది మందికి దాదాపు ఉచితంగా అందిస్తూ వేల మంది డాక్టర్లను, ఇంజనీర్లను, విద్యావేత్తలను తయారు చేసారు. అంధుల శిక్షణా సంస్థలు సైతం నెలకొల్పి వారి జీవితాల్లో వెలుగులు నింపారు శివకుమారస్వామీజీ.



ఆధ్యాత్మికతకు కొత్త అర్థం చెప్పిన ఆధునికుడు శివకుమార స్వామీజీ. మఠాల, పీఠాల గమ్యాలు మారాలని కొత్త లక్ష్యాలతో, కొత్త మార్గాలలో నడుస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని స్వామీజీ ఆకాంక్షించారు. సేవే మానవ జాతి పరమార్థం అని చాటిన నిష్కామయోగి, లక్షలాది ప్రజలపై కరుణధార కురిపించిన దయా సింధు, దీనబంధు స్వామీజీ. సామాజిక సేవ ఆధ్యాత్మిక సేవ తప్ప దేని గురించి ఆలోచించని మహనీయుడు శివకుమారస్వామీజీ.

కర్ణాటక ప్రజలు, లింగాయతులు స్వామీజీని నడిచే దైవంగా, త్రివిధ దాసోహిగా భావిస్తారు. దాసోహి అంటే నిరంతర దాత అని అర్థం. స్వామీజీ విద్యాదానం, అన్నదానం, విజ్ఞాన దానం లక్ష్యం కోసం తన జీవితాంతం శ్రమించారు. అందుకే త్రివిధ దాసోహిగా పేరుగాంచారు. రైతు లేనిదే బతుకు లేదని విశ్వసించిన స్వామీజీ వారి అభ్యున్నతికి తోడ్పడ్డారు. రైతులన్నా, పశువులన్నా స్వామీజీకి అపారమైన ప్రేమ. ప్రతి సంవత్సరం రైతుమేళా నిర్వహించి వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. తన విద్యా సంస్థలలో విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై ఆసక్తి కలిగించేందుకు రైతు ఆవశ్యకతను బోధించేవారు. తన గురుకులంలోని విద్యార్థులకు విద్యతోపాటు వ్యవసాయ పనుల్లో శిక్షణ ఇచ్చేవారు.

స్వామీజీకి ధార్వాడ్‌లోని కర్ణాటక విశ్వవిద్యాలయం 1965లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన శత జయంతి సందర్భంగా 2007లో కర్ణాటక ప్రభుత్వం కర్ణాటక రత్న అవార్డుతో సత్కరిస్తే, 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో గౌరవించింది. స్వామీజీకి భారత రత్న ఇవ్వాలని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి కేంద్రానికి విజ్ఞప్తి చేసారు. అలాగే వీరశైవ లింగాయతులు, దేశవ్యాప్తంగా స్వామి భక్తులు కూడా స్వామీజీకి భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. స్ఫూర్తిమంతమైన స్వామీజీ సేవా నిరతి ఆధారంగా జగజ్యోతి సిద్ధగంగ అనే సినిమాను నిర్మించడం ఆయన గొప్పతనాన్ని చాటి చెపుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా స్వామీజీకి భక్తులు, ఇంతటి ఆదరణ ఉన్నప్పటికి స్వామీజీ రాజకీయాలకు అతీతంగా ఉన్నారు. రాజకీయాలను శాశించే శక్తి ఉన్నప్పటికీ ఎప్పుడూ ఆ దిశగా ఆలోచించలేదు. కర్ణాటకలో ప్రధాన సామాజిక వర్గం లింగాయతులకు ఆరాధ్య దైవమైన శివకుమార స్వామీజీ రాజకీయంగా తటస్థంగా ఉండేవారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలప్పుడు రాష్ట్ర ప్రభుత్వ లింగాయతులకు మైనారిటీ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నా ఆయన స్పందించలేదు. పార్టీలకతీతంగా ప్రధానమంత్రులు మోదీ, వాజపేయి, ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయి, దేవగౌడ వంటివారు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వంటి మేధావులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ రంగాల ప్రముఖులు సిద్ధగంగ మఠాన్ని సందర్శించి స్వామీజీ దీవెనలు అందుకొని స్వామీజీ సేవలను కొనియాడారు.

నిరుపేదల అభ్యున్నతికోసం తన జీవితాన్ని అంకితం చేసిన స్వామీజీ నేటి సమాజానికి ఆదర్శం. వయస్సు మీద పడుతున్నా తన పనులు తాను చేసుకుంటూ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగిస్తూ 80 ఏళ్ళపాటు కర్ణాటకలో సాంఘిక సంస్కరణ వాదిగా, విద్యావేత్తగా, ప్రజలకు నడిచే దైవంగా, త్రివిధ దాసోహిగా తన 111 ఏళ్ళ జీవితాన్ని ఆధ్యాత్మికతను సమాజ సేవగా మార్చి సిద్ధగంగ మఠ సేవ కార్యక్రమాలను ప్రపంచ వ్యాప్తంగా గుబాళించేలా చేసి సెలవు తీసుకున్నారు. శివకుమార స్వామీజీ శివైక్యం నేటి సమాజానికి, వీరశైవ లింగాయతులకు, కర్ణాటక ప్రజలకు తీరని లోటు.

■ బర్మని మల్లికార్జున్

‘ఈ-నామ్’లో అంతర్రాష్ట్ర వాణిజ్యం

- కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం
- 29న హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమావేశం

అమరావతి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆరు రాష్ట్రాల్లో ఈ-నామ్ విధానం ద్వారా అంతర్రాష్ట్ర వాణిజ్యానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిత్యం పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అవకాశం ఉన్న మార్కెట్ యార్డుల్లో ఈ వాణిజ్యాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఈనామ్ అమలు విధానం ఉన్న యార్డుల్లో ఈ విధానాన్ని త్వరలో ప్రవేశపెట్టనున్నారు. తద్వారా ఏ యార్డులోని పంట ఉత్పత్తినైనా వ్యాపారులు ధరను నిర్ణయించి, కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. సరుకు నాణ్యత, తూకం, రైతు పేరు, ఊరు, ఇతర అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచుతారు. ఆన్‌లైన్‌లో పంట ఉత్పత్తి వివరాలను చూసుకుని, వ్యాపారులు ధరను నిర్ణయించి, రైతుకు సమ్మతమైతే, ఈనామ్ విధానంలో వెనువెంటనే చెల్లింపులు జరుపుతారు. దీనివల్ల ఇటు రైతుకు ఆశించిన ధర వస్తుందని, అటు మార్కెటింగ్ శాఖకూ ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఫలించిన ప్రయోగం!

అంతర్రాష్ట్ర వాణిజ్యం అమలుపై నమూనాగా ఇటీవల ఏపీలోని కర్నూలు, తెలంగాణలోని గద్వాల యార్డుల మధ్య వేరుశనగ క్రయవిక్రయాలను నిర్వహించారు. గద్వాల వ్యాపారి కర్నూలు యార్డులోని సరుకు, కర్నూలు వ్యాపారులు గద్వాల యార్డులోని సరుకును కొనుగోలు చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో తొలి దశలో ఆరు రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఈ నెల 29న హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరగనున్నది. ఏపీ, తెలంగాణ, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులు, ఆయా యార్డు కార్యదర్శులు హాజరై, అంతర్రాష్ట్ర వాణిజ్యంపై చర్చించనున్నారు. ఆరు రాష్ట్రాల్లోని ఏయే యార్డుల్లో ఏయే పంట ఉత్పత్తులను అంతర్రాష్ట్ర వాణిజ్యం కిందకు తేవచ్చనే అంశంపై సమావేశంలో చర్చించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రధానంగా మిర్చి, పసుపు, వేరుశనగ, అపరాలు, పండ్లు, కూరగాయల వాణిజ్యానికి అవకాశముందని అధికారులు గుర్తించారు. గుంటూరులో మిర్చి, దుగ్గిరాల, కడపలో పసుపు, అనంతపురంలో బత్తాయి, పుంగనూరులో కూరగాయలు, పొదలకూరులో నిమ్మకాయలు, మదనపల్లి, కర్నూలులో మామిడి, టమాటా.. ఇతర యార్డుల్లో అక్కడికి నిత్యం వచ్చే పంట ఉత్పత్తులతో అంతర్రాష్ట్ర వాణిజ్యాన్ని నిర్వహించనున్నట్లు మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు.



గవర్నర్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కోటేశ్వరమ్మ

దుర్గమ్మ సేవలో నరసింహన్

- నృసింహుని దర్శించుకున్న గవర్నర్

మంగళగిరి/విజయవాడ, జనవరి 25: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ దంపతులు శుక్రవారం రాత్రి బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో ఆలయానికి వచ్చిన వారికి ఈవో కోటేశ్వరమ్మ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ గౌరంగబాబు, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరఫున నూతన వస్త్రాలు, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు శుక్రవారం ఉదయం గవర్నర్ మంగళాద్రి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. గవర్నర్ దంపతులకు తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని ఈవో అందజేశారు.

కేటీఆర్ అవివేకి

- తెలంగాణ పథకాలను కాపీ కొట్టాల్సిన అవసరం ఏపీకి పట్టలేదు
- మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం(విశాఖ జిల్లా), జనవరి 25: తమ పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం కాపీ కొడుతున్నదని తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనడం ఆయన అవివేకానికి నిదర్శమని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ...పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపార అనుభవం ఉందని, మరో రాష్ట్రం నుంచి కాపీ కొట్టాల్సిన అవసరంగానీ, ఇంకొకరు చెప్పాల్సిన పనిగానీ ఆయనకు లేదన్నారు. సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందే తెలుగుదేశం పార్టీ అన్న విషయాన్ని కేటీఆర్ తెలుసుకోవాలన్నారు.

చెల్లింపులపై అనుమానాలొద్దు

- డ్వాక్రా సభ్యులకు చెక్కులపై యనమల
- ప్రజల గుండెల్లో చంద్రబాబు: ఎమ్మెల్సీ డొక్కా

తొండంగిరూరల్, విజయవాడ(విద్యాధరపురం), జనవరి 25: డ్వాక్రా మహిళలకు ఇచ్చే చెక్కుల చెల్లింపుపై ఎటువంటి అనుమానమూ అక్కర్లేదని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. చెక్కులపై వైసీపీ చేస్తున్న విమర్శలు అర్థరహితమని తిప్పికొట్టారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో టీడీపీ కార్యకర్తల బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. డ్వాక్రా మహిళలకు పోస్టుడేటెడ్ చెక్కులు ఇచ్చి మోసం చేస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పేదలకు మేలుచేసే పార్టీ తెలుగుదేశమైతే.. ప్రజలను మోసంచేసే పార్టీ వైసీపీ అని విమర్శించారు. ఒకవిడత నగదు ఇచ్చి, రెండు విడతలుగా చెక్కులు ఇస్తామన్నారు. చెక్కుపై వేసే తేదీనాటికి పూర్తిగా చెల్లిస్తామని, ఆ తేదీన బ్యాంకుకు వెళ్లి చెక్కును నగదుగా మార్చుకోవచ్చునన్నారు. కాగా, తప్పుడు సర్వేలతో దుష్ప్రచారం చేసినంత మాత్రాన ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న నమ్మకాన్ని, అభిమానాన్ని మార్చడం ఎవరితరమూ కాదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ విజయవాడలో అన్నారు. ఒక టీవీ సీఈవో ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అత్యంత సన్నిహితుడని, అలాంటి వారు చేసే సర్వేలు ఎంత పారదర్శకంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు.

‘గ్లోబరీనా’పై పోలీసులకు

జేఎన్టీయూకే ఫిర్యాదు

- 2013లో ఇరుపక్షాల ఒప్పందం.. 2015లో రద్దు
- అప్పట్లో కోర్టును ఆశ్రయించిన గ్లోబరీనా సంస్థ

జేఎన్టీయూకే, జనవరి 25: గ్లోబరీనా సంస్థపై తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో జేఎన్టీయూకే రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. 2013లో వీసీ తులసీరాందాస్ హయాంలో జేఎన్టీయూకే హైదరాబాద్‌కు చెందిన గ్లోబరీనా టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఈ-కంటెంట్ పరీక్షలకు సంబంధించి అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందాన్ని 2015లో జేఎన్టీయూకే వీసీ వీఎస్ఎస్ కుమార్ రద్దు చేశారు. అప్పట్లో గ్లోబరీనా సంస్థ తమ ఒప్పందాన్ని జేఎన్టీయూకేలో అర్థాంతరంగా ముగించారని, దీనివల్ల తమకు చాలా నష్టం వచ్చిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ వ్యవహారం కొంతకాలంగా నడుస్తోంది. కాగా.. వర్సిటీ అధికారులు ఆర్బిట్రేటర్ సలహామేరకు ఈ నెల 18న సర్పవరం పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్లోబరీనా ఒప్పందంలో అప్పట్లో కీలకంగా వ్యవహరించిన వీసీలు, రిజిస్ట్రార్‌లను విచారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సర్పవరం సీఐ ఆర్‌గోవిందరాజు దర్యాప్తునకు రంగం సిద్ధంచేశారు.

చీటింగ్ కేసు పెట్టాం: రిజిస్ట్రార్

గ్లోబరీనా సంస్థ జేఎన్టీయూకే వల్ల తమకు నష్టం జరిగిందంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఆ సంస్థ మోసం వల్ల జేఎన్టీయూకే నష్టపోయిందని ఆ సంస్థే, వర్సిటీకి ఈ మొత్తాన్ని చెల్లించాలని కోరుతూ చీటింగ్ కేసు పెట్టినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. అప్పట్లో ఎంతకాలానికి ఎంత చెల్లించారు, ఆ సమయంలో ఉన్న అధికారుల వివరాలు పోలీసులకు తెలిపామన్నారు. అప్పట్లో గ్లోబరీనాకు రూ.26 కోట్ల చెల్లింపులు జరిపినట్లు సమాచారం ఉండడంతో దీనిపై లిఖిత పూర్వకంగా పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.



త్రిమూర్తులును అభినందిస్తున్న కార్యకర్తలు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా త్రిమూర్తులు

జగదాంబ సెంటర్ (విశాఖ పట్నం), జనవరి 25: తన తుది శ్వాస వరకు మాలల సంక్షేమానికి కృషిచేస్తానని మాలమహానాడు రాష్ట్ర నూతన అధ్యక్షుడు జంగా త్రిమూర్తులు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా జంగా త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శిగా జి.కిరణ్ (పశ్చిమ గోదావరి జిల్లా) ప్రమాణ స్వీకారం చేశారు.

29న విజయవాడలో రాజకీయ పక్షాల సమావేశం

- విభజన అన్యాయాలపై ఉమ్మడి కార్యాచరణకు భేటీ
- హాజరుకావాలని ముఖ్యమంత్రికి లేఖ రాశా
- వైసీపీ నేతలు రాలేమన్నారు: ఉండవల్లి



రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా జరిగిన అన్యాయాలపై కొత్తగా ఏర్పడే లోక్‌సభలోనైనా చర్చించేలా చేయడం కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో రాజకీయ పార్టీలకు ఆహ్వానం పంపినట్టు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29న విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో సమావేశమవుతున్నట్టు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి హాజరవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాసినట్టు తెలిపారు. టీడీపీ ఉంటే తాము పాల్గొనేది లేదని జగన్ మాటగా ఎంపీ సుబ్బారెడ్డి తనకు చెప్పారన్నారు. బీజేపీ అధ్యక్షుడు కన్నా ఆ రోజు తనకు వేరే పని ఉందని, ఎవరినైనా ముఖ్యులను పంపిస్తానని వెల్లడించినట్టు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి మధు ఈ సమావేశానికి హాజరు కానున్నట్టు ఆయన చెప్పారు.

నౌహీరాపై చార్జిషీటుతో బాధితుల్లో ఆనందం

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హీరా గ్రూప్ అధినేత నౌహీరా షేక్‌పై పోలీసు చర్యలు కఠినమవుతున్నాయి. ముంబై ఆర్థిక విభాగం అధికారులు ఈ నెల 22న 3 వేల పేజీలతో చార్జిషీట్ దాఖలు చేశారు. ముంబై లో ఆమెపై మొత్తం రూ.500 కోట్ల డిపాజిట్లకు సంబంధించి 273 ఫిర్యాదులు రావడంతో పాటు ఆ డబ్బును ఆమె తన వ్యక్తిగత ఖాతాల్లోకి మార్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఆరు ఆస్తులను గుర్తించామని... వాటి విలువ రూ.400 కోట్లనిముంబైకి చెందిన పోలీసు అధికారి వివరించారు. కాగా.. ఆమె ఆస్తులను వేలంపాట వేసి వాటిని తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిపాజిటర్లు కోరుతున్నారు. ఈ కేసును సీబీఐ లేదా ఎన్ఐఏకు అప్పగించాలని హీరాగ్రూప్ బాధితుల సంఘం అధ్యక్షుడు షాబాజ్‌ఖాన్ డిమాండ్ చేస్తున్నారు.

లోక్‌సత్తా ముసాయిదా మేనిఫెస్టో విడుదల

విజయవాడ (గవర్నర్‌పేట), జనవరి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనరాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రచారం చేయడం కోసం ముసాయిదా మేనిఫెస్టోను ప్రకటిస్తున్నట్లు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ తెలిపారు. సూచనలు, సలహాలను క్రోడీకరించి తుది మేనిఫెస్టోను ఫిబ్రవరి 23న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో విడుదల చేస్తామన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ముసాయిదా మేనిఫెస్టోను శుక్రవారం విడుదల చేశారు. అవినీతి నిర్మూలన, సంక్షేమాన్ని, అభివృద్ధి సాధించడం, అందరికీ ఉన్నత ప్రమాణాలతో ఉచిత విద్య, వైద్యం, సామాజిక న్యాయం ప్రధాన అంశాలుగా ముసాయిదా తీర్చిదిద్దామని చెప్పారు.

రైతులు నూతన పద్ధతులు అవలంబించాలి

- జస్టిస్ జాస్తి చలమేశ్వర్



జస్టిస్ చలమేశ్వర్‌ను సన్మానిస్తున్న వీసీ దామోదరనాయుడు

లాంఫాం(తాడికొండ) జనవరి 25: రైతులు కొత్త పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయంలో నూతన ఒరవడి సృష్టించాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంయుక్త కార్యాచరణ సమితి ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం లాం ఫారంలోని వ్యవసాయ విద్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ, 130 కోట్ల జనాభా ఉన్న మన దేశానికి రైతే వెన్నెముక అన్నారు. రైతు కుటుంబం నుంచే తాను న్యాయమూర్తి వృత్తిలోకి వచ్చానని తెలిపారు.

అవినీతి రహిత సమాజ స్థాపనే ధ్యేయం: కేఏపాల్

దొండపర్తి (విశాఖపట్నం), జనవరి 25: అవినీతి రహిత సమాజ స్థాపనే ‘ప్రజా శాంతి’ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. శుక్రవారం ఆయన విశాఖపట్నంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆదాయం కేవలం రూ.1.5 లక్షల కోట్లని, రాష్ట్ర బడ్జెట్ రూ.3.5 లక్షల కోట్లని, మిగిలిన రూ.2 లక్షల కోట్లు చంద్రబాబు ఎక్కడ నుంచి తేగలరని పాల్ ప్రశ్నించారు. రూ.5 లక్షల కోట్లు తెచ్చే సత్తా తనకు మాత్రమే ఉందని ఆయన అన్నారు. ఈ నెల 26 నుంచి రాష్ట్రంలో తాము సభలు నిర్వహించనున్నామని పాల్ తెలిపారు. తమతో పొత్తు కుదుర్చుకోకుంటే జనసేన పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చెప్పారు.

ఈ దేశం నాకిచ్చిందే ఎక్కువ!

"నాకు ప్రసాదించిన భారతరత్న అనే ఈ గౌరవాన్ని భారత ప్రజల పట్ల గాఢమైన వినమ్రతతో, కృతజ్ఞతా భావంతో స్వీకరిస్తున్నా. గతంలో చాలాసార్లు చెప్పా. మళ్లీ చెబుతున్నా. ఈ గొప్ప దేశ ప్రజలకు నేనిచ్చిన దానికన్నా వారి నుంచి తీసుకున్నదే ఎక్కువ"

- ప్రణబ్ ముఖర్జీ, మాజీ రాష్ట్రపతి

మట్టిలో మాణిక్యాలు... ఈ పద్మాలు!

వారు మట్టి మనుషులు. ఇంకా చెప్పాలంటే... మట్టిలో మాణిక్యాలు! హడావుడీ, ఆర్భాటం ఉండదు! కానీ... వారి సేవ నిరుపమానం! ఇలాంటి వారికి మోదీ సర్కారు ఘనమైన గుర్తింపు ఇస్తోంది. శుక్రవారం ప్రకటించిన 'పద్మశ్రీ' అవార్డుల్లో మట్టిలోని మాణిక్యాలు వీరు...

గోమాతకు... మాత: ఫెడ్రిక్ ఇరినా బ్రునింగ్



స్వదేశం జర్మనీ వీడి దేశంకాని దేశం వచ్చారు. భారత్‌లోని మధురలో స్థిరపడ్డారు. 'సురభీ గోసేవా నికేతన్' పేరిట గోశాల ప్రారంభించారు. దాదాపు 1200 ఆవుల సంరక్షణ చూసుకుంటున్నారు. అందులో... జబ్బున పడినవీ, ముసలివీ, కంటిచూపులేనివీ ఉన్నాయి. వాటి నిర్వహణ కోసం ప్రతినెలా 22 లక్షలు ఖర్చు చేస్తున్నారు. 23 ఏళ్లుగా గోవులకు ఆమె చేస్తున్న సేవకు ఇప్పుడు పద్మశ్రీ వరించింది.

సికిల్ సెల్ కిల్: సుదామ్ కేట్



గిరిజనులను వేధించే అనారోగ్యం... సికిల్ సెల్. గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో ఈ సమస్య మరీ అధికం. సుదామ్ దీనిపై పరిశోధన సంస్థను ప్రారంభించారు. దాదాపు 2 లక్షల మందికి పరీక్షలు చేశారు. 3వేల మందికి ఈ వ్యాధి ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు. 'సికిల్ సెల్ దవాఖానా' ప్రారంభించి పరిశోధన, వ్యాధి నిర్ధారణ, ఆయుర్వేద విధానంలో చికిత్స అందిస్తున్నారు.

చాయ్... గురు: దేవరపల్లి ప్రకాశ్ రావు



ఒడిసాలోని కటక్‌కు చెందిన దేవరపల్లి ప్రకాశ్ రావు... ఓ టీకొట్టు యజమాని. కానీ, ఆయన జీవిత టీ అమ్ముకుని, తన కుటుంబాన్ని పోషించుకునేందుకే పరిమితం కాలేదు. 'ఆశా ఓ ఆశ్వాసన' అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. తన ఆదాయంలో సగాన్ని మురికివాడల్లోని పిల్లల చదువు, ఆహారం కోసం వెచ్చిస్తున్నారు. తన ఏడేళ్ల వయసు నుంచి కష్టపడుతూనే ఉన్నారు. ఇప్పటికి 200 సార్లు రక్తదానం చేశారు. ప్రకాశ్‌రావుకు స్వల్ప పక్షవాతంతో బాధపడుతున్నారు.

దేశీ విత్తనానికి రక్ష: కమలా పూజారి



కమలా పూజారి నివాసం... ఒడిసాలోని మారుమూల గిరిజన ప్రాంతం కోరాపుట్! ఒడిసాలో సేంద్రియ సాగు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నారు. దేశీయ వంగడాలకు రక్షణగా నిలుస్తున్నారు. అంతరించి పోయే దశలో వరి, పసుపు, నువ్వులు తదితర దేశీయ వంగడాల విత్తనాలకు తిరిగి ప్రాణం పోశారు. ఒడిసా ప్లానింగ్ బోర్డులో మొట్టమొదటి గిరిజన మహిళ ఆమే కావడం విశేషం.

లేడీ టార్జన్: జమునా తుడు



జార్ఖండ్‌కు చెందిన జమునా తుండు అంటే కలప మాఫియాకు హడల్. అంతేకాదు... నక్సల్స్ కూడా ఆమె పేరు చెబితే వెనుకడుగు వేస్తారు. పర్బి సింగ్భం ప్రాంతంలో 'వన సంరక్షణ సమితి' ఏర్పాటు చేసి పదివేల మంది మహిళలను పోగు చేశారు. గత 20 ఏళ్లుగా 300 గ్రామాల పరిధిలోని 50 హెక్టార్ల అడవిని కాపాడారు. చంపేస్తామని కలప మాఫియా బెదిరించినా వెనక్కి తగ్గలేదు. ఆడపిల్ల పుట్టగానే 18, పెళ్లి సమయంలో 10 మొక్కలు నాటేలా స్థానికులను ప్రోత్సహించారు. ఆమెకు స్థానికులు పెట్టుకున్న ముద్దు పేరు... లేడీ టార్జన్!

ఐదు రూపాయల డాక్టర్: శ్యామా ప్రసాద్



రాంచీకి చెందిన రిటైర్డ్ మెడికల్ ప్రొఫెసర్... శ్యామా ప్రసాద్ ముఖర్జీ! ఆయన వయసు 84 సంవత్సరాలు. 50 ఏళ్లుగా ఆయన వైద్య వృత్తిలో ఉన్నారు. ఫీజు... ఐదు రూపాయాలు మాత్రమే. ఒక్కోసారి అదీ తీసుకోరు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారు. ప్రతి రోజూ 40 మందికి తగ్గకుండా ఆయన వైద్య సేవ చేస్తారు.

బందూక్ ఛోడో- ఢోల్ పకడో: అనూప్ రంజన్ పాండే



బస్తర్ బ్యాండ్ అనే ఓ థియేటర్ గ్రూప్ వ్యవస్థాపకుడైన అనూప్ రంజన్ పాండే.. రెండు దశాబ్దాలుగా ఆదివాసీల సంప్రదాయ సంగీత పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నివసించే ఆదిమ తెగలవారు ఉపయోగించే 110 అరుదైన సంగీత వాయిద్యాలను సేకరించారు. 'బందూక్ ఛోడో- ఢోల్ పకడో' నినాదంతో అరుదైన సంప్రదాయ కళల పునరుజ్జీవానికి అంకితమయ్యారు.

హిందూ, ముస్లిం భాయీ, భాయీ: హనీఫ్ శాస్త్రి



ప్రాచీన శ్లోకాల ఆధారంగా రచించిన పుస్తకాలు, పద్యాలతో హిందూ, ముస్లింల మత సామరస్యం కోసం సంస్కృత, హిందీ పండితుడైన మహమ్మద్ హనీఫ్ ఖాన్ శాస్త్రి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఆయన 8 పుస్తకాలు, 700 వరకూ పద్యాలు రాశారు. 2009లో జాతీయ మత సామరస్య అవార్డును కైవసం చేసుకున్నారు.

100 ఏళ్ల యోగా టీచర్: తావ్ పోర్ఛోన్-లించ్



ప్రపంచంలోనే అత్యంత వృద్ధ యోగా టీచర్‌గా పేరుగాంచిన తావ్ పోర్ఛోన్-లించ్ ఆ రంగానికే వన్నెతెచ్చారు. 43 ఏళ్లుగా యోగా టీచర్‌గా సేవలందిస్తున్న లించ్.. అమెరికా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో అంతర్జాతీయ క్లాసులు బోధిస్తూ.. 1500 మంది యోగా టీచర్లను తయారు చేశారు. యోగా వలన చాలా యాక్టివ్‌గా ఉండే లించ్ 88 ఏళ్ల వయసులోనూ బాల్‌మ్ డాన్స్‌తో అబ్బురపరిచారు. 'ఏజ్‌లెస్ బాడీ - టైమ్‌లెస్ మైండ్'కు ఆమె ఉదాహరణ.

వ్యవసాయంలో వైవిధ్యం: రాజ్‌కుమారి దేవి



'కిసాన్ చాచీ'గా సుపరిచితమైన రాజ్‌కుమారి దేవి మారుమూల గ్రామాల్లోని రైతుల్లో చైతన్యం తీసుకొచ్చి వైవిధ్యమైన పంటలు పండించేలా ప్రోత్సహించారు. తద్వారా అధిక లాభాలు ఆర్జించేందుకు మార్గం చూపారు. గ్రామాల్లోని సుమారు 300కిపైగా మహిళలతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి తమ కాళ్లపై తాము నిలబడేలా స్ఫూర్తిని నింపారు.

పేదల ఇంజనీర్... ఉదబ్ కుమార్



ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 118 వినూత్న ఆవిష్కరణలు ఆయన మదిలో నుంచి పుట్టాయి! గ్రామీణ పేదలు, కూలీల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన యంత్రాలను రూపొందించడంలో ఉదబ్ కుమార్‌ది అందెవేసిన చేయి! ఇంజనీరింగ్ కోర్సుకు మధ్యలోనే గుడ్‌బై చెప్పేసిన ఈయన.. తక్కువ ధరకే దానిమ్మ విత్తనాలు వొలిచే పరికరాన్ని, తేలిగ్గా అల్లం తోలు తీసే పనిముట్టును, తేయాకు తోటల డిమాండ్‌ను తీర్చడానికి కొత్త పాలిథిన్ తయారీ యంత్రం... ఎన్నో ఆవిష్కరణలను అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ అవార్డ్(2009)' అందుకున్నారు.

విత్తన మనిషి: బాబూలాల్ దహియా



విత్తన మనిషిగా గుర్తింపు పొందిన బాబూలాల్ దహియా(73) మధ్యప్రదేశ్‌కు చెందిన వారు. తన జీవితాన్ని సంప్రదాయ విత్తనాలకే అంకితం చేశారు. 2 ఎకరాల పొలంలో 110 వరి రకాలను పెంచి, వాటి పరిరక్షణకు, రక్షణకు పాటుపడ్డారు. 100కు పైగా పప్పులు, ధాన్యాలు, కూరగాయల విత్తనాలను భద్రపరిచారు. సాత్పూరా కొండలపై జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు 24 జిల్లాలో 'బీజ్ యాత్ర' చేపట్టి 1600 రకాల విత్తనాలను సేకరించారు. బఘేలీ జానపద సాహిత్యంలో 5 పుస్తకాలను, బఘేలీ సాహిత్యంలో రెండు పుస్తకాలను రచించారు.

భారతరత్నం ప్రణబ్ దా

నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికాలకు మరణానంతరం అత్యున్నత పురస్కారం



న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక, రాజకీయ రంగాలను మలుపు తిప్పిన ఉత్తమ ఆర్థికవేత్త, ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ ప్రథమ పౌరుడు ప్రణబ్ ముఖర్జీని దేశంలోనే అత్యుత్తమ పౌర పురస్కారమైన భారతరత్న వరించింది. ప్రముఖ సంఘ సేవకుడు నానాజీ దేశ్‌ముఖ్, ప్రముఖ అస్సామీ గాయకుడు భూపేన్ హజారికాలకు కూడా వారి మరణానంతరం ఈ అత్యున్నత పురస్కారం దక్కింది. వీరిలో ప్రణబ్ ముఖర్జీ కాంగ్రెస్ కురువృద్ధుడు కాగా.. నానాజీ దేశ్‌ముఖ్ ఆరెస్సెస్‌లో కీలక నేత. ఇక, భూపేన్ హజారికా పౌరహక్కుల కోసం విశేష కృషి చేసిన వామపక్ష నేపథ్యమున్న గాయకుడు. రాజకీయ భావజాలాలకు అతీతంగా ఈ ముగ్గురికీ మోదీ ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించింది. రాష్ట్రపతిగా పని చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజేంద్ర ప్రసాద్, జాకిర్ హుస్సేన్, వీవీ గిరి గతంలో భారతరత్నకు ఎంపికయ్యారు. ఇప్పుడు ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకోనున్న ఐదో మాజీ ప్రథమ పౌరుడిగా ప్రణబ్ చరిత్రలో నిలవనున్నారు. 'భారత రత్నా'ల్లో ప్రణబ్ పశ్చిమ బెంగాల్‌కు చెందినవారు కాగా, హజారికా అసోం; నానాజీ దేశ్‌ముఖ్ మధ్యప్రదేశ్‌కు చెందినవారు. ప్రణబ్‌కు భారతరత్న ప్రకటించడం ద్వారా అటు బెంగాల్లో మమత, ఇటు కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల ముందు మోదీ షాక్ ఇచ్చారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అలాగే, పౌరసత్వ వివాదంతో అసంతృప్తులు చెలరేగిన ఈశాన్యంలో పరిస్థితిని చల్లబరచడానికి భూపేన్‌కు పురస్కారం దోహదం చేస్తుందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. నిజానికి, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో వాజపేయి, మదన్ మోహన్ మాలవీయలకు భారతరత్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మూడేళ్లపాటు ఈ అత్యున్నత పౌర పురస్కారాన్ని ఎవరికీ ఇవ్వలేదు. మళ్లీ, ఈ ఏడాది ఒకేసారి ముగ్గురికి ప్రకటించింది. ఇందిర నుంచి సోనియా వరకూ ట్రబుల్ షూటర్‌గా వ్యవహరించిన కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీకి మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం భారతరత్న ప్రదానం చేయాలని నిర్ణయించడం విశేషం. దాదాపు ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన 84 ఏళ్ల ప్రణబ్ రాజనీతిజ్ఞుడిగా, మేధావి, సంక్షోభ పరిష్కర్తగా గుర్తింపు పొందారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు చేపట్టిన ఆయన.. ఆర్థిక మంత్రిగా ఎనలేని కీర్తిని ఆర్జించారు. 47 ఏళ్ల వయసులో భారతదేశానికి అతి పిన్న వయస్కుడైన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టింది కూడా ఆయనే. యూపీఏ హయాంలో అత్యంత కీలకమైన విదేశాంగం, రక్షణ, ఆర్థిక శాఖలను నిర్వహించారు. 2012-17 మధ్య కాలంలో రాష్ట్రపతిగా సేవలు అందించి ఆ పదవికే వన్నె తెచ్చారు. రాష్ట్రపతి అంటే కేవలం రబ్బరు స్టాంపు అన్న ముద్రను పటాపంచలు చేశారు. ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేస్తూ తన ప్రత్యేకతను చాటారు. ఆయనకున్న అపార పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని గత ఏడాది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన వార్షికోత్సవాల్లో ప్రసంగించేందుకు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఇక, పార్లమెంటు సభ్యత్వాన్ని కూడా తృణప్రాయంగా భావించి వదులుకొని, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో గ్రామీణ, ఆరోగ్య, విద్యా రంగాల్లో సా వ ా జిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన బీజేపీ మాజీ నేత నానాజీ దేశ్‌ముఖ్‌కు కూడా భారతరత్న ప్రదానం చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. 2010లో తన 93వ ఏట మరణించేంత వరకు సామాజిక సేవకు అంకితమైన నానాజీ దేశ్‌ముఖ్ ఆరెస్సెస్‌లో సామాన్య కార్యకర్త నుంచి బీజేపీ ఎంపీ వరకు ఎదిగారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. బీజేపీ నిర్మాణంలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పాటులోనూ, జనతా ప్రభుత్వ ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారు. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. ఇక, అసోంకు చెందిన ప్రముఖ గాయకుడు, కవి భూపేన్ హజారికా 1926లో జన్మించారు. ప్రముఖ అమెరికా పౌర హక్కుల కార్యకర్త పాల్ రాప్సన్ స్ఫూర్తితో గాయకుడిగా అవతరించారు. బెంగాలీ, హిందీ భాషల్లో ఆయన వందలాది గీతాలను ఆలపించి ప్రజా గాయకుడిగా గుర్తింపు పొందారు. గంగా నదిపై ఆయన రాసి పాడిన గీతం ఇప్పటికీ జనం నోళ్లలో మార్మోగుతుంది. అనేక చలన చిత్రాల్లో కూడా ఆయన పాటలు రాసి ఆలపించారు. 2011 నవంబరు 5న తనువు చాలించారు.

రాజనీతిజ్ఞుడు ప్రణబ్
మోదీ కితాబు

ప్రస్తుత పరిస్థితుల్లో తిరుగులేని రాజనీతిజ్ఞుడు ప్రణబ్ ముఖర్జీ అని ప్రధాని మోదీ కొనియాడారు. "దశాబ్దాలపాటు ఆయన నిరంతరాయంగా, నిస్వార్థంగా జాతికి సేవ చేశారు. దేశ ప్రగతి ప్రయాణంలో బలమైన ముద్ర వేశారు. ఆయన మేధస్సు, ప్రతిభాపాటవాలతో సరి తూగగలిగిన వాళ్లు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారు" అని ట్విటర్లో వ్యాఖ్యానించారు. గ్రామీణాభివృద్ధికి నానాజీ దేశ్‌ముఖ్ శిఖర సమానమైన సేవ చేశారని కొనియాడారు. నిజ జీవితంలో కూడా ఆయన భారతరత్నమేనని ప్రశంసించారు. ఇక, భూపేన్ హజారికా సంగీతం, పాటలను తరాల తరబడి ప్రజలు శ్లాఘించారని, వారి నుంచి న్యాయం, సామరస్యం, సౌభ్రాత్రం సందేశాలు ప్రసరించాయని కొనియాడారు. ప్రణబ్‌కు భారతరత్న ప్రకటించడంపై రాహుల్ గాంధీ హర్షం వ్యక్తం చేశారు. "ప్రజా సేవ, జాతి నిర్మాణంలో విశేష కృషి చేసిన 'మావాడు' ప్రణబ్‌ను గుర్తించి, గౌరవించడం కాంగ్రెస్ పార్టీకి గర్వకారణం" అని ట్విటర్లో వ్యాఖ్యానించారు.

భారతరత్నకు ప్రణబ్ సంపూర్ణ అర్హుడు: సీఎం కేసీఆర్

మాజీ ప్రధాని ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న పురస్కారం ప్రకటించడంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారానికి ఆయన సంపూర్ణ అర్హుడని కొనియాడారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠపరచడానికి, రాజ్యాంగాన్ని సమర్థంగా అమలు చేయడానికి ప్రణబ్ ఎంతో చొరవ చూపారని ప్రశంసించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు నిర్వహించి దేశానికి ఎంతో సేవ చేశారన్నారు.

ప్రణబ్.. రాజకీయ యోధ!



సంక్షోభ పరిష్కర్త... కాంగ్రెస్ వ్యూహకర్త.. ఆరు పదుల ప్రజా జీవితం

ప్రణబ్‌దా.. మంత్రాంగంలో మహామంత్రి తిమ్మరుసు అంతటివాడు. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నపుడు ఇందిర, రాజీవ్, సోనియా, మన్మోహన్.. అందరూ ప్రయోగించే ట్రబుల్ షూటర్! కాంగ్రెస్ కేబినెట్లలో అన్నీ తానై నడిపిన ఐదడుగుల అపర మేధావి!! ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో పార్టీని, దేశాన్ని ఎన్నోసార్లు కష్టాల కడలి నుంచి ఒడ్డుకు చేర్చిన ఘనత ఆయనది. నెహ్రూ ప్రవచించిన రాజకీయ ఒరవడిలో రాజనీతిజ్ఞతను ఒంటబట్టించుకున్నవాడు. రాష్ట్రపతిగా నిర్ణయాత్మకంగా వ్యవహరించిన దక్షత గల నేత. ఆ రాజకీయ యోధుడికి అత్యున్నత గౌరవం అందించాలన్న మోదీ ప్రభుత్వ నిర్ణయం వెనుక రాజకీయ కోణాన్ని పక్కన పెడితే నిశ్శంసయంగా ఆయన జాతి రత్నమే!

అది.. 1969!

ఆ సభలో.. బంగ్లా కాంగ్రెస్ ప్రతినిధి ఒకరు ఉపన్యాసం దంచేస్తున్నారు! ఆ సమయానికి అక్కడే ఉన్న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఆ ప్రసంగానికి ముగ్ధురాలైపోయారు. ఆ వ్యక్తి గురించి ఆరా తీశారు. ఆయన తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడని, కాంగ్రెస్ పార్టీలో అనేక హోదాల్లో పనిచేశారని తెలిసింది. కట్‌చేస్తే...ఏడాది ముగిసేలోపే ఆ వ్యక్తి కాంగ్రెస్ తరఫున రాజ్యసభ సభ్యుడయ్యారు! ఆయనే.. ప్రణబ్ ముఖర్జీ!! ఇందిరా గాంధీ వేసిన అంచనా వ్యర్థం కాలేదు! పార్టీలో అత్యంత కీలకస్థానానికి ఎదిగారు.

ప్రధాని కోరిక తీరలేదు గానీ...

ప్రధాని కావాలన్నది ఆయన చిరకాల వాంఛ. మూడు సార్లు చేజారింది. మొదటిది ఇందిర హత్యానంతరం, రెండోది రాజీవ్ హత్యానంతరం, మూడోది 2009లో మన్మోహన్‌సింగ్ రెండో టర్మ్ సమయంలో! తన అభిలాషను ఆయన పరోక్షంగా కాంగ్రెస్ నాయకశ్రేణికి తెలియపర్చినా లాభం లేకపోయింది. మన్మోహన్ రెండోసారి ప్రధాని అయ్యాక ప్రభుత్వ వ్యవహారాల్లో రాహుల్‌గాంధీ జోక్యం ఎక్కువ కావడం ఆయనకు నచ్చేది కాదు. ప్రధాని పదవి కంటే పెద్దదైన రాష్ట్రపతి పదవిని ఆయనకు కట్టబెట్టి సోనియాగాంధీ ఆయనకు కొంతలో కొంత ఊరటనిచ్చారు.

అడుగుజాడ తండ్రిదే!

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో బీర్భుం జిల్లాలోని మిరాటి గ్రామంలో 1935, డిసెంబర్ 11న బ్రాహ్మణ కుటుంబంలో ప్రణబ్ జన్మించారు. ఆయన తండ్రి కామద కింకర్ ముఖర్జీ కూడా కాంగ్రెస్ పార్టీలోనే అనేక హోదాల్లో పనిచేశారు. ప్రణబ్ కూడా తన తండ్రి అడుగుజాడలలోనే నడిచారు. కలకత్తా యూనివర్సిటీ నుంచి చరిత్ర, రాజనీతి శాస్త్రంలో ఎమ్మేతో పాటు న్యాయశాస్త్రంలో కూడా పట్టా పొందారు. న్యాయవాదిగా, ఉపాధ్యాయుడిగా, జర్నలిస్టుగా పనిచేసిన ప్రణబ్.. వెలకట్టలేనంత అనుభవాన్ని గడించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయ వర్గాల్లో ప్రణబ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అమోఘమైన జ్ఞాపక శక్తి ఆయన సొంతం. భారత ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దిన అతికొద్ది మందిలో ప్రణబ్ ఒకరు. సంకీర్ణ రాజకీయాల్లోని అనేక ఒత్తిడులను తట్టుకుంటూ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆర్థికవేత్తగా బాధ్యతలు నిర్వర్తించడం, ప్రపంచీకరణ దిశగా చర్యలు చేపట్టడం ఆయనకే చెల్లింది.

రాజకీయ ప్రస్థానం

43ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆయన పార్లమెంటుకు నేరుగా ఎన్నికైంది రెండుసార్లేనంటే ఆశ్చర్యం కలగక మానదు! సుదీర్ఘకాలం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగిన దాదా.. 2004, 2009 ఎన్నికల్లో మాత్రం జంగీపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రతి కాంగ్రెస్ ప్రధాని క్యాబినెట్‌లోనూ మంత్రిగా పనిచేసిన అనుభవం!! 1982లో ఆర్థికమంత్రి అయ్యారు. అప్పుడు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్‌తో కలిసి రెండేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు. ఇందిరా గాంధీ హత్య తర్వాత ప్రధాని పదవి ఆశించడంతో కాంగ్రెస్ ఆయనను దూరంగా పెట్టింది. కొత్త పార్టీని పెట్టారు. తర్వాత రాజీవ్‌తో రాజీకి వచ్చారు. పీవీ నరసింహారావు హయాంలో ప్రణబ్‌కు మళ్లీ ప్రాధాన్యం లభించింది. కీలక శాఖలను ప్రణబ్ నిర్వహించారు. యూపీఏ-1 సర్కారులో ఏకంగా 42 మంత్రుల సాధికార మండళ్లకు నేతృత్వం వహించారు.

తెలంగాణ కమిటీకి కూడా!

తెలంగాణ ఏర్పాటు విషయమై ఏర్పాటుచేసిన మంత్రివర్గ కమిటీకి కూడా ప్రణబ్ ముఖర్జీయే నేతృత్వం. ఫలానా తేదీలోగా తెలంగాణ విషయమై ప్రకటించి తీరాలని కేసీఆర్ డెడ్‌లైన్ విధించినపుడు "నాకెవరూ డెడ్‌లైన్లు పెట్టలేరు.. హెడ్‌లైన్లూ సూచించలేరు. నేనెప్పుడు నిర్ణయం తీసుకోవాలో అప్పుడే తీసుకుంటా..ఇది డెడ్‌లైన్లకు సంబంధించిన అంశం కాదు" అని నిష్కర్షగా తేల్చిచెప్పారు. 2018లో ఆయన నాగ్‌పూర్ వెళ్లి ఆరెస్సెస్ శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఉపన్యాసం చేయడం వివాదాస్పదంగా మారింది. సోనియా మొదలుకొని కాంగ్రెస్ శ్రేణులన్నీ ఆయన చర్యను తప్పుపట్టాయి. ఆయన జంకలేదు. అక్కడికి వెళ్లి ఆరెస్సెస్ విధానాన్ని తప్పుబట్టి మరీ వచ్చాక గానీ కాంగ్రెస్‌వాదుల కోపం చల్లారలేదు.

క్షమాభిక్ష ఆయన డిక్షనరీలోనే లేదు..

ఘోరమైన పాపాలకు ఒడిగట్టినవారికి మరణమే తగిన శిక్ష అని గట్టిగా నమ్మే ప్రణబ్‌దా.. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఏకంగా 45 క్షమాభిక్ష పిటిషన్లను తిరస్కరించి ఉరి ఖరారు చేశారు. కేవలం నాలుగింటిని మాత్రమే ఆయన జీవిత ఖైదుగా మార్చారు. ఆ 45 మందిలో 26-11 దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాది అజ్మల్ కసబ్, పార్లమెంట్‌పై దాడుల కుట్రదారు అఫ్జల్ గురు, యాకూబ్ మెమన్ మొదలైన వారెందరో ఉన్నారు. ప్రణబ్- ఫైళ్లను చకచకా క్లియర్ చేసేవారు. ఎనిమీ ప్రాపర్టీ ఏక్ట్ ఆర్డినెన్స్‌ను మాత్రం సంప్రదాయాలకు విరుద్ధంగా ఐదుసార్లు నాన్చారు. గుజరాత్ ప్రభుత్వ ఉగ్రవాద-నిరోధక బిల్లునూ వెనక్కి తిప్పి పంపారు. పరమత ద్వేషం, మూకోన్మాదం, పెరుగుతున్న హింసలను రాష్ట్రపతి హోదాలో దునుమాడారు.

సిరివెన్నెలకు పద్మశ్రీ



భర్తకు అభినందనలు తెలుపుతున్న సిరివెన్నెల పద్మావతి

న్యూఢిల్లీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'నిగ్గదీసి అడుగు.. ఈ సిగ్గులేని జనాన్ని, అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని'.. అంటూ తూటాల్లాంటి మాటలనే పాటలుగా సంధించి సమాజాన్ని మేల్కొలిపిన ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రిని పద్మశ్రీ పురస్కారం వరించింది. అలాగే.. చెస్ క్వీన్ ద్రోణవల్లి హారిక, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సునిల్ ఛెత్రి, 'రైతు నేస్తం' సంస్థ వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావులకు కూడా కేంద్రం పద్మశ్రీ ప్రకటించింది. వీరిలో యడ్లపల్లి వెంకటేశ్వరరావు, హారికలకు ఏపీ నుంచి ఈ పురస్కారం దక్కగా.. సిరివెన్నెల సీతారామశాస్త్రి, సునీల్ ఛెత్రి తెలంగాణ నుంచి ఆ గౌరవాన్ని పొందారు. కళలు, సామాజికసేవ తదితర రంగాల్లో విశేష కృషి చేసిన 112 మందికి కేంద్ర ప్రభుత్వం 2019 సంవత్సరానికిగాను పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రముఖ జానపదగాయని తీజన్‌బాయ్ సహా నలుగురికి దేశ రెండో అత్యున్నత పౌరపురస్కారమైన పద్మవిభూషణ్‌ను ప్రకటించింది. గత ఏడాది దివంగతుడైన సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్‌తోపాటు.. అకాళీ దళ్ రాజ్యసభ సభ్యుడైన సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా, బీజేపీ సీనియర్ నేత, లోక్‌సభ మాజీ డిప్యూటీ స్పీకర్ కరియా ముండా తదితర 14 మందిని పద్మ భూషణ్ పురస్కారం వరించింది. గత ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలకూ కలిపి ఒకే ఒక్క పద్మశ్రీ (కిడాంబి శ్రీకాంత్) దక్కగా.. ఈసారి నలుగురికి ఆ గౌరవం దక్కింది. అలాగే.. ఒడిశా నుంచి మరో తెలుగువాడైన దేవరపల్లి ప్రకాశరావు కూడా పద్మశ్రీ పురస్కారాన్ని పొందారు. ఈసారి పద్మవిభూషణ్ (4), పద్మభూషణ్ (14), పద్మశ్రీ (94).. అన్నీ కలిపి మొత్తం 112 అవార్డులు ప్రకటించగా.. అందులో 11 మంది విదేశీయులు/భారతీయమూలాలున్నవారు/భారతసంతతి విదేశీయులు. ముగ్గురికి మరణానంతరం పద్మ పురస్కారాలు ప్రకటించారు. అవార్డీల్లో 21 మంది మహిళలు.. ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. కాగా.. "నన్ను తమ సొంతం చేసుకుని అభిమానించిన వాళ్లందరి ఆనందం ఫోన్లలో, మెసేజ్‌లలో చూస్తుంటే నాకు ఆనందంగా ఉంది. అభిమానుల ఆనందమే అన్నిటినీ మించిన మహదానందం" అని సిరివెన్నెల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇక.. పద్మ అవార్డులు సాధించిన తెలుగు తేజాలకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందనలు తెలిపారు.

రాష్ట్రాల వారీగా..

మహారాష్ట్ర 11, యూపీ 10, న్యూఢిల్లీ 8, తమిళనాడు 7, గుజరాత్ 6, బిహార్ 5, కర్ణాటక 5, కేరళ 5, హరియాణా 5, ఎంపీ 4, ఝార్ఖండ్ 4, కశ్మీర్ 3, పంజాబ్ 3, పశ్చిమబెంగాల్ 3, ఉత్తరాఖండ్ 3, ఒడిశా 3, రాజస్థాన్ 2, హిమాచల్ ప్రదేశ్ 2, ఏపీ 2, తెలంగాణ 2, ఛత్తీస్‌గఢ్ 2, అస్సాం 2, త్రిపుర 1, సిక్కిం 1, మణిపూర్ 1, చండీగఢ్ 1, విదేశీయులు 11.

పద్మవిభూషణ్

1. తీజన్‌బాయ్	జానపద సంగీతం	ఛత్తీస్‌గఢ్
2. ఇస్మాయిల్ గుల్లేహ్	ప్రజాసంబంధాలు	డిజిబౌటీ
3. అనిల్‌కుమార్ నాయక్	వాణిజ్యం, పరిశ్రమలు	మహారాష్ట్ర
4. బల్వంత్ మోరేశ్వర్ పురందరే	రంగస్థల కళాకారుడు	మహారాష్ట్ర

పద్మ భూషణ్ పురస్కార గ్రహీతలు

1. జాన్ చాంబర్స్	అమెరికా వ్యాపారవేత్త	
2. సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా	రాజకీయ వ్యవహారాలు	పంజాబ్
3. ప్రవీణ్ గోవర్ధన్	ప్రజాసంబంధాలు - దక్షిణాఫ్రికా మంత్రి	
4. మహాశయ్ ధరమ్ పాల్ గులాటీ	వాణిజ్యం, పరిశ్రమలు	ఢిల్లీ
5. దర్శన్ లాల్ జైన్	సామాజిక సేవ	హరియాణా
6. అశోక్ లక్ష్మణ్ రావు కుకడే	వైద్య సేవ	మహారాష్ట్ర
7. కరియా ముండా	రాజకీయ వ్యవహారాలు	ఝార్ఖండ్
8. బుధాదిత్య ముఖర్జీ	సితార్ కళాకారుడు	పశ్చిమ బెంగాల్
9. మోహన్‌లాల్	సినీ నటుడు	కేరళ
10. నంబి నారాయణ్	ఇస్రో శాస్త్రవేత్త	కేరళ
11. కుల్దీప్ నయ్యర్ (మరణానంతరం)	జర్నలిజం	ఢిల్లీ
12. బచేంద్రి పాల్	పర్వాతారోహకురాలు	ఉత్తరాఖండ్
13. వీకే షుంగ్లూ	మాజీ కాగ్ (సివిల్ సర్వీస్)	ఢిల్లీ
14. హుకుం దేవ్ యాదవ్ (ఎంపీ)	రాజకీయ వ్యవహారాలు	బిహార్

మనోజ్ బాజ్‌పేయి, ప్రభుదేవా, శంకర్ మహదేవన్, శంతను నారాయణ్ (అడోబ్ సంస్థ సీఈవో), బజరంగ్ పూనియా, శివమణి తదితరులకు పద్మశ్రీ ప్రకటించారు.

విజయగాథ



వ్యవసాయం లాభసాటిగా లేక పలువురు రైతులు పట్టణాలకు వలసపోతున్నా అనంతపురం జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎండ్లూరి సుధీర్ నాయుడు ఉద్యోగం వదిలేసి వ్యవసాయం బాట పట్టారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడకు చెందిన ఆయన ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకొని ఖర్జూరం సాగు చేస్తున్నారు. ఏటా లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్న ఆయన విజయగాథ.

ఖర్జూరం సాగుతో కనకవర్షం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి సాగు వైపు .. లక్షల్లో లాభం ఆర్జిస్తున్న అనంత రైతు సుధీర్

ఆరేళ్ల క్రితం తన స్వగ్రామంలో మూడెకరాల్లో ఖర్జూరం మొక్కలు నాటారు సుధీర్. మన రాష్ట్రంలో ఖర్జూరం సాగు చేసే వారి సంఖ్య చాలా తక్కువ. గుజరాత్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఖర్జూరం పంటను సాగు చేస్తున్నారు. అక్కడ పండించే పంటను కరువు జిల్లా అనంతలోనూ పండిస్తే ఎలా వుంటుందని ఆలోచించారు. ఆరేళ్ల క్రితం మూడెకరాలలో ఖర్జూరం మొక్కలు నాటారు. ఇంటర్‌నెట్‌లో లభించే సమాచారంతో దుబాయ్‌లోని అబుదాబి నుంచి బరిగి రకం మొక్కలు తెప్పించారు. ఎకరాకు 76 మొక్కలు చొప్పున 228 మొక్కలు నాటారు. రవాణా చార్జీలతో కలిపి అప్పట్లో ఒక్కో మొక్కకు రూ.3,600లు చొప్పున మొత్తం 8.2 లక్షలు ఖర్చయింది. ప్రతి మూడు నెలలకోమారు చెట్టు వయస్సుకు తగ్గట్టుగా చెట్టు చుట్టూ పాదుల్లో వర్మికంపోస్టు, వేపచెక్కను వేస్తున్నారు. ఒకసారి వర్మికంపోస్టు, వేపచెక్కవేస్తే, మూడు నెలల తర్వాత గొర్రెలు, కోడి పెంటను వేస్తున్నారు. ఇలా సేంద్రియ ఎరువులు వేయడం ద్వారా అధిక దిగుబడి వస్తోంది. సేంద్రియ ఎరువులతో పాటు తోట నిర్వహణకు మూడెకరాలకు ఏడాదికి రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. ప్రతి మూడు రోజులకోమారు డ్రిప్ ద్వారా చెట్లకు తడి ఇస్తున్నారు. మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం 2017 నుంచి దిగుబడి రావడం మొదలైంది. ఆ సంవత్సరం ఎకరాకు 5 టన్నుల చొప్పున మూడెకరాలకు 15 టన్నుల దిగుబడి వచ్చింది. తద్వారా రూ.24 లక్షల దాకా ఆదాయం వచ్చింది. గత ఏడాది ఎకరాకు 6 టన్నుల దిగుబడి పెరిగింది. మూడెకరాల్లో 18 టన్నుల దిగుబడి వచ్చింది. తద్వారా రూ. 28 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్చిలో పంట పూతకు రానుంది. జూలై నెలకల్లా కోతకు వస్తుంది. ప్రతి ఏడాది రంజాన్ పండుగకు ముందుగానే పంట కోతకు వస్తుండటంతో ఆదాయం బాగా వస్తోంది. అలాగే గత ఏడాది మరో మూడెకరాల్లో ఖర్జూరం మొక్కలు నాటారు. ఈ ఏడాది అదనంగా ఆరు ఎకరాల్లో మొక్కలు నాటాలని ఆలోచిస్తున్నారు సుధీర్.

ఒక్కో చెట్టుకు వంద కిలోల దిగుబడి

ఒక్కో ఖర్జూరం చెట్టుకు 100 నుంచి 120 కేజీల దాకా దిగుబడి వస్తోంది. కోతకు వచ్చిన రెండు నెలలపాటు మాగిన గెలలను కోతకోసి విక్రయిస్తున్నారు. తన తోట వద్దే ఖర్జూరం పంటను సుధీర్‌నాయుడు విక్రయిస్తున్నారు. వ్యాపారులు పంటను కొనుగోలు చేసేందుకు తోట వద్దకే వస్తున్నారు. కిలో రూ. 160 నుంచి రూ.200లకు విక్రయిస్తున్నారు. స్థానికంగానే ఖర్జూరం దొరుకుతుండటంతో వ్యాపారులకు కూడా అనుకూలంగా ఉంది. ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసే రైతులు బెంగుళూరు, హైదరాబాద్, కోయంబత్తూరు మార్కెట్‌కు సరుకును తీసుకెళ్లి అమ్ముకునే వీలుంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం వ్యవసాయం/నార్పల

ఖర్జూర సాగుకు అనంత భేష్



మా తాతయ్య వెంకటయ్య స్ఫూర్తితోనే వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నా. ఇంటర్‌నెట్‌లో లభించే సమాచారాన్ని సేకరించి ఆ సూచనలు అనుసరిస్తున్నాను. జిల్లా వాతావరణానికి ఖర్జూరం చెట్లు తట్టుకోగలవు. అందుకే వాటిని ఎంచుకున్నా. ఈ ఏడాది పదెకరాలకు ఖర్జూరం సాగును పెంచాలనుకుంటున్నా. ఉద్యోగం చేసినప్పటి కంటే ఖర్జూరం సాగు చేసి మంచి దిగుబడులు సాధించడం ఎక్కువ సంతృప్తినిస్తోంది.

- ఎండ్లూరు సుధీర్‌నాయుడు

ఆవుపాలతో రొయ్యల తెగుళ్లకు చెక్

పశ్చిమ గోదావరి రైతుల వినూత్న ప్రయోగం

రొయ్యల మేతలో ఆవుపాలను కలిపి తెగుళ్లను నివారించి, అధిక దిగుబడులు సాధిస్తున్నారు పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు ప్రాంత రొయ్యల రైతులు. ఆవుపాల ప్రయోగంతో మంచి లాభాలు గడిస్తున్న ఆ రైతుల ప్రయోగం విశేషాలు.

రొయ్యల రైతులను తెగుళ్లు భయపెడుతున్నాయి. రొయ్యల సాగులో మంచి లాభాలు వుండటంతో ఎక్కువ మంది రైతులు రొయ్యల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. అయితే తెగుళ్ల కారణంగా రొయ్యల దిగుబడి గణనీయంగా తగ్గడంతో రైతులు నిరుత్సాహపడ్డారు. తెగుళ్ల నివారణకు మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టారు. పాలకోడేరుకు చెందిన రొయ్యల రైతులు ఆవుపాలతో తెగుళ్ల నివారణకు ప్రయత్నించి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో పాలకోడేరు మండల రైతులు మొదటిసారిగా అప్పట్లో వచ్చిన రొయ్య తెగుళ్ళకు నివారణగా రొయ్యకు సారా, బ్రాందీలు కలిపిన మేతను అందిస్తూ సంచలనం సృష్టించారు. అదే రీతిలో పాలకోడేరు మండల రైతులు వైట్‌కట్‌ను నివారించేందుకు ఆవుపాలతో విరుగుడు కనిపెట్టారు. తల్లిపాలు లేకపోతే బిడ్డకు ఆవు పాలు పడితే వ్యాధినిరోధక శక్తి ఎలా పెరుగుతుందో అదేవిధంగా రొయ్యకు ఆవు పెరుగును పులియబెట్టి, మజ్జిగ చేసి రొయ్య మేతలో కలిపి నిత్యం అందిస్తున్నారు. పులియబెట్టిన ఆవు పెరుగును రొయ్యల చెరువుల్లో వేయడం ద్వారా రొయ్యకు వచ్చే వైట్‌కట్ అనే తెగులు నివారణ అవుతుందని ఇక్కడి రైతులు చెబుతున్నారు. తెగులు నివారణ కావడంతో పాటు రొయ్యలు మంచి సైజులో ఎదగడం వల్ల అధిక లాభాలు వస్తున్నాయంటున్నారు పాలకోడేరు రైతులు.



ప్రయోగం

- ఆంధ్రజ్యోతి, పాలకోడేరు

ఆవుపాలతో సత్ఫలితాలు



ఆవుపాలు చాలా మంచి ఫలితాన్నిస్తున్నాయి. ఆవుపాలను కాచి పెరుగును పులియబెట్టి రొయ్య మేతలో ప్రతీరోజు వేస్తున్నా. ఈ పద్ధతి కొంత కష్టంతో కూడుకున్నప్పటికీ రొయ్య ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడి లభించింది. ప్రతీ రైతు ఆవులను పెంచుకోవడం ద్వారా అన్ని విధాల మేలు జరుగుతోంది.

- సుబ్బరాజు, రొయ్యల రైతు

పాడి రైతులకు వరం.. మినీ గోకులం

పాల ధరను అందులో వుండే వెన్న శాతమే నిర్ణయిస్తుంది. కేవలం పాల విక్రయం మీదే ఆధారపడకుండా పాల ఉత్పత్తులు, గోబర్ గ్యాస్, వర్మి కంపోస్ట్ వంటి వాటి విక్రయం ద్వారా పాడి రైతులు అదనపు ఆదాయం పొందితే పాడి లాభదాయకంగా వుంటుందంటున్నారు శ్రీకాకుళం పశుసంవర్ధక శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ మాదిన ప్రసాదరావు



ప్రశ్న: పాడి పశువులకు పోషక విలువలతో కూడిన దాణా ఎలా ఉండాలి?

జ : పశువు రోజువారీ ఆహార అవసరాలకు అనుగుణంగా ఎక్కువ మాంసకృత్తులను, అధిక శక్తిని అందించే ఆహారాన్ని ఇవ్వాలి. పోషక విలువలు కలిగిన దినుసులను తగుపాళ్లలో కలిపి మర పట్టించాలి. దీనినే దాణా అంటారు. దాణాలో మాంసకృత్తులు 16 శాతం, జీర్ణమయ్యే పోషక పదార్థాలు 70 శాతం ఉండేలా వివిధ దినుసులు, పదార్థాలను కలుపుకోవాలి. రెండు లీటర్లు పైబడి పాలిచ్చే పశువులకు తప్పనిసరిగా సమీకృత దాణాను ఇవ్వాలి. పాలిచ్చే గేదెలైతే ప్రతి రెండు లీటర్లకు కిలో చొప్పున రోజుకి ఏడు కిలోలకు మించకుండా దాణాను అందించాలి. పాలిచ్చే ఆవులకు ప్రతి 2.5 లీటర్లకు ఒక కిలో చొప్పున దాణా ఇవ్వాలి. అలాగే దాణా కూడా తాజాగా ఉండాలి.

ప్రశ్న: దాణాను భద్రపరచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

జ : దాణా తయారీకి ఉపయోగించే పదార్థాలు బాగా ఎండి ఉండాలి. వాటిలో తేమ 5 శాతం కంటే ఎక్కువ ఉండకూడదు. తేమ ఎక్కువైతే మొక్కజొన్న, వేరుశనగ, సోయా పిండ్లు బూజు పడతాయి. దీనివల్ల దాణాలో అఫ్లోటాక్సిన్ అనే విషపదార్థం తయారవుతుంది. ఉప్పు కలవని ఖనిజ లవణ మిశ్రమాన్ని కలపడం మంచిది. ఆ తర్వాత అయోడైజ్డ్ ఉప్పును కలిపితే పునరుత్పత్తికి దోహదపడుతుంది. సమీకృత దాణాను తయారుచేసుకోవాలంటే 25-30 కిలోల బియ్యం/గోధుమ తౌడు, 30-40 కిలోల మొక్కజొన్న, జొన్న గింజల పిండి, 20-30 కిలోల వేరుశనగ, తెలగ, పత్తి, కొబ్బరి, తెలగపిండి, కిలో ఉప్పు, రెండు కిలోల ఖనిజ లవణ మిశ్రమంతో 20 కిలోల వరకూ ఉలవలు, శనగపొట్టు, కందిపొట్టు, కర్రపెండలం పిప్పి అవసరమవుతాయి. దాణాలో తగినంత మొలాసిస్ కలిపితే మంచి రుచి వస్తుంది. పశువులకు శక్తి కూడా లభిస్తుంది. పశుపోషణలో దాణా ఖర్చే సింహభాగం వుంటుంది. రైతులు స్వయంగా దాణా తయారు చేసుకోగలిగితే ఖర్చు తగ్గడంతో పాటు పశువులకు మేలైన దాణా అందుతుంది.

ప్రశ్న: పాలలో వెన్న శాతం పెరగాలంటే ఏ విధమైన చర్యలు తీసుకోవాలి?

జ : పాల ధర నిర్ణయించేది పాలలోని కొవ్వు శాతమే. అయితే కొవ్వు శాతం పశుజాతులను బట్టి మారుతుంది. పొదుగువాపు లేకుండా చూసుకోవాలి. వ్యాధినిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించడమే కాకుండా పరిశుభ్రత పట్టించాలి. పాలు పితకడం కూడా ఐదు నుంచి ఆరు నిముషాలలో ముగించాలి. పోషకాలుండే దాణాను అందించాలి. పాడి దాణాలో 12 - 14శాతం ప్రోటీన్స్, 5 - 6శాతం కొవ్వు పదార్థాలు తగ్గకుండా జాగ్రత్త పడాలి. అలాగే మొత్తం ప్రొటీన్స్ కొవ్వుశాతంలో 40 శాతం మించకుండా చూసుకోవాలి.



ఇంటర్వ్యూ

ప్రశ్న : చూడి పశువుల యాజమాన్యంలో ఎలాంటి మెలుకువలు పాటించాలి?

జ: యాజమాన్య పద్ధతులు కచ్చితంగా పాటించాలి. దూడలను సక్రమంగా పోషించి పునరుత్పత్తి సమస్యలు రాకుండా అవి ఎదకు వచ్చిన వెంటనే ఒకేసారికి చూడి నిలిచేలా చర్యలు తీసుకోవాలి. చూడి నిలిచిన క్షణం నుంచి కంటికి రెప్పలా కాపాడితేనే ఆ పశువు ఈనిన తర్వాత దాని సామర్థ్యానికి తగ్గట్టుగా పాలు ఇస్తుంది. ఈనిన తర్వాత తిరిగి మూడు నెలల్లోగా ఎదకు వచ్చేలా చేసి చూడి కట్టించేలా చేయగలిగితే ఏడాదికి ఒక దూడను పొంది అధిక పాల దిగుబడిని సాధించగలం.

ప్రశ్న : పాడి పశువుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

జ : అధిక పాలనిచ్చే సంకరజాతి హోల్‌స్టెయిన్ ఆవులను ఎంపిక చేసుకోవచ్చు. అయితే సంకరజాతి ఆవులను ఎంచుకున్నప్పుడు వాటిలో విదేశీ రక్తం 50 - 62.5 శాతం మించకుండా ఉండాలి. దేశవాళీ ఆవుజాతులతో సాహీవాల్, సింధీ, గిర్, ఒంగోలు జాతులను ఎంపిక చేసుకోవచ్చు. గేదెల విషయానికి వస్తే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ముర్రా జాతి గేదె అత్యంత శ్రేష్టమైంది. గతంలో పొదుగువాపు వ్యాధి, గాలికుంటు వ్యాధి వంటివి సోకాయేమో తెలుసుకోవాలి. ఒకటి రెండు ఈతల్లోనివి లేగ దూడతో సహా, ఈనిన రెండు వారాలలోపు కొనడం మంచిది. కనీసం రోజుకి 12-15 లీటర్ల దిగుబడి ఇచ్చే పశువుని, రెండుపూటలా పాలను చూసి ఎంపిక చేసుకోవాలి. 2-6 శాశ్వత దంతాలు కలిగి ఉన్న పశువులను ఎంపిక చేసుకోవాలి. పశువులకు గృహ వసతి ముఖ్యం, అందుకే ప్రభుత్వం పాడి రైతులకోసం మినీ గోకులం పథకం ప్రవేశపెట్టింది. రెండు నుంచి ఆరు పశువులు ఉన్న రైతులు కేవలం పదిశాతం సొమ్ము చెల్లిస్తే చాలు పశువుల శాలలను నిర్మించుకోవచ్చు. ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం రాయితీపై పశుగ్రాసాలు సాగు చేసుకునే అవకాశం ఉంది.

ప్రశ్న : పాడి రైతులు కేవలం పాల అమ్మకాల ద్వారానే కాకుండా ఇతరత్రా అధిక లాభాలను ఎలా పొందవచ్చు?

జవాబు : పాలనే కాకుండా పాలతో ఉత్పత్తులు కోవా, స్వీట్స్ వంటి పదార్థాలు చేసి అమ్మకాలు చేపట్టాలి. గ్రామాల్లో సామూహిక గోబర్ గ్యాస్ ప్లాంట్స్, వర్మి కంపోస్టు యూనిట్లు వంటివి ఏర్పాటు చేసుకోవాలి. దీన్నే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఊబరైజేషన్ పేరిట పథకాన్ని అమలుచేసి రైతుకు అదనపు ఆదాయాన్ని అందించే లక్ష్యంగా ప్రణాళికను సిద్ధం చేస్తోంది.

- ఆంధ్రజ్యోతి, శ్రీకాకుళం

సమాహారం

ఆధునిక ఆహారపు అలవాట్లతో వ్యాధి నిరోధక శక్తి నశించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా సేంద్రియ విధానంలో పండించిన సిరిధాన్యాలు వాడడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని భావిస్తున్నారు. ఈ సిరిధాన్యాల వాడకంపై విజయవాడలో అవగాహన సదస్సు జరుగనున్నది. జనవరి 27 ఆదివారం నాడు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం-ఆంధ్రప్రదేశ్, రైతునేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్‌లో గల సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిరిధాన్యాలపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో స్వతంత్ర శాస్త్రవేత్త, ఆరోగ్య నిపుణులు డా. ఖాదర్‌వలీ గారు పాల్గొంటారు. వేదిక దగ్గర సిరిధాన్యాలు, సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకంతో పాటు, వ్యవసాయ అనుబంధ రంగాల పుస్తకాలు లభిస్తాయి. మరిన్ని వివరాలకు 98481 23050, 98493 12629 నెంబర్లలో సంప్రదించగలరు.



27న విజయవాడలో సిరిధాన్యాలపై సదస్సు



ఫిబ్రవరిలో పౌల్ట్రీ వర్క్‌షాప్

అనంతపురంలో ఫిబ్రవరి 3న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంకుర సంస్థల నిర్వాహకుల కోసం పౌల్ట్రీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పౌల్ట్రీ రంగం, ఆర్గానిక్ పద్ధతుల్లో కోళ్ల పెంపకం, మార్కెటింగ్ అవకాశాలపై ఈ వర్క్‌షాప్‌లో విశ్లేషణలు వుంటాయి. **వివరాలకు : 80966 39109**

వ్యవసాయ అనుబంధరంగాల ప్రదర్శన

రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన ఈ రోజుతో ముగుస్తుంది. వ్యవసాయం, ఉద్యాన రంగం, ఆక్వా, పాడిపరిశ్రమ, కోళ్ల పరిశ్రమల్లో ఆధునిక పోకడలు తెలుసుకునేందుకు రైతులకు ఇది మంచి అవకాశం అని నిర్వాహకులు చెబుతున్నారు.

వివరాలకు : 79979 77589, 79979 77145

మిద్దెతోటతో వేసవి నుంచి ఉపశమనం

తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పట్టణాల్లోని పైకప్పులపై మిద్దె తోటలు ఏర్పాటు జరగాలన్నది నా కల. అదే జరిగితే వేసవిలో తెలుగు ప్రజల ఇళ్లు చల్లగా వుండటంతో పాటు వారి మనసులు కూడా చల్లగా, మనుషులు ఆరోగ్యంగా వుంటారంటున్నారు ప్రముఖ మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి.



మిద్దెతోట

మిద్దెతోటలు, పెరటితోటల గురించి, కాలానుగుణంగా వాటిల్లో చెయ్యాల్సిన పనుల గురించి మాట్లాడుకుంటూనే మధ్య మధ్య కొన్ని ముఖ్యమైన విషయాలను మాట్లాడుకుందాం. వచ్చేది వేసవి కాలం. ఏటికేడు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి కానీ తగ్గడం లేదు. కారణాలు మనలో చాలామందికి తెలుసు. అడవుల నరికివేత, నగరీకరణ, పారిశ్రామిక కాలుష్యం వంటివి ముఖ్యకారణాలు. స్థిర వ్యవసాయం ప్రారంభమైన నాటి నుంచే అడవుల నరికివేత కూడా మొదలయింది. ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడిన నాటి నుంచి అడవుల సంరక్షణ చర్యలు కూడా ఆరంభమయ్యాయి. అయితే, అవి అరకొరగానే ఉంటున్నాయి. అడవుల నరికివేతలో ప్రభుత్వాలు, ప్రజలు ఎవరూ తక్కువ వారు కాదు. నగరీకరణ కూడా అంతకంతకూ పెరుగుతోంది. దీనికి ప్రభుత్వ విధానాలు కారణం. ఉపాధి అవకాశాలు నగరాలలో కేంద్రీకృతం చెయ్యడం ముఖ్య కారణం. పారిశ్రామిక విప్లవం ఆరంభమయిన నాడే, వాతావరణ కాలుష్యం కూడా మొదలయింది. ఒక్క వాతావరణమే కాకుండా సమస్త పర్యావరణం- చివరికి భూగోళమే ప్రమాదంలో పడుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త గ్రహాల అన్వేషణ కొరకు బోలెడు ఖర్చు చేస్తున్నారు. కాని, అడవుల సంరక్షణకు అందులో పదో వంతు చెయ్యడం లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు ఎంతో కొంత స్పందించక తప్పడం లేదు. ఈ భూగోళం మీద జరుగుతున్న సకల విధ్వంసాలకు కారణాలు ప్రభుత్వాల మీదకు నెట్టడం చాలా సులభం. కానీ, మిద్దె ఇల్లు కట్టుకున్న ప్రతివారూ ఈ విధ్వంసంలో భాగస్వాములే. ఎంతో ప్రకృతిని వాడుకుంటేనే గానీ ఒక గృహాన్ని నిర్మించలేరు. ఆ గృహం మీద కనీసం మిద్దెతోటను నిర్మించాలి. మిద్దెతోటను నిర్మించుకోవడం, సామాజిక బాధ్యతే కాదు- ప్రకృతి రుణ విముక్తి కూడా! వేసవికాలంలో మిద్దెమీద తోట ఉంటే, లోపల ఇల్లు చల్లగా ఉంటుంది. ఇల్లు చల్లగా ఉంటే మనుషులు చల్లగా ఉంటారు. వారి మనసులూ చల్లగా ఉంటాయి. ఆయురారోగ్యాలు వర్ధిల్లుతాయి. భాగ్యనగరం పైకప్పు దాదాపు 50 వేల ఎకరాలు అని ఒక అంచనా. భాగ్యనగరంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి పట్టణంలోని పైకప్పులు మా మిద్దెతోట మాదిరి అయితే ఎలా ఉంటోందో అని నా కల. తెలుగురాష్ట్రాలకు అప్పుడు నిజంగా భాగ్యోదయం జరుగుతుంది. పట్టణాలు ఈ రోజున ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు మిద్దెతోటల్లో పరిష్కారం ఉంది. వేసవి తాపం నుండి ఇంటిని చల్లబరచుకోవడానికి మిద్దెతోటలను మించిన సహజసిద్ధమైన ఏర్పాటు మరేమీ లేదు. మిద్దెతోట ఉన్న వారికి 'పండు వేసవి'! లేనివారికి 'మండు వేసవి'!

నవ్య
కుటుంబ కదంబం

శతకోటి గళం



నేడు
గణతంత్రదినోత్సవం!
రాజ్యాంగం అందరికీ సమానహక్కులు ఇచ్చింది. చట్టం ముందర అందరూ సమానులేనని స్పష్టంగా పేర్కొంది. వయసు, జెండర్, జాతి, మత, కుల భేదాలు లేకుండా అందరికీ సమానమైన పౌరహక్కులు, మానవహక్కులు ఉన్నాయంది. కానీ వాస్తవపరిస్థితి అలా ఉందా? లేదు! అన్ని రంగాలలో యథేచ్ఛగా హక్కుల అతిక్రమణ, ఎందరో అన్యాయాలకు, దోపిడీకి గురికావడం జరుగుతోంది. పలు ఉద్యమాలలో పాలుపంచుకుంటున్న మహిళలు ఈ సందర్భంగా ఏమంటున్నారంటే...

ఇది అందరి మాట!

ONE BILLION RISING

రాజ్యాంగం తల్లి లాంటిది!



"భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను నిర్వీర్యం చేస్తున్న పరిస్థితులను చూస్తున్నాం. అందుకే మానవహక్కుల పట్ల చైతన్యంతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ఇందులో నవతరం ముఖ్య పాత్ర వహించాలి. అందుకోసం ఐక్యంగా పోరాడాలి. తల్లి లాంటి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. రాజ్యాంగమే ప్రమాదంలో పడితే హక్కుల కోసం ఎవరిని ఆశ్రయించగలం? ప్రజలు పేదరికంలో మగ్గడం, అందరికీ సమానంగా విద్య, వైద్య రంగాల సేవలలో ప్రభుత్వాల వైఫల్యం, పెరుగుతున్న అంతరాలు, మహిళల హక్కుల అణచివేత,రకరకాల హింసలు, అసమానతలు, ట్రాన్స్ జండర్లను క్రిమినల్స్‌గా చూడడం, ట్రాఫికింగ్ వంటి ఎన్నో సమస్యలు రాజ్యాంగంలోని చట్టాల అమలు వైఫల్యాన్ని అద్దంపడుతున్నాయి. చట్టాలను సైతం బేఖాతరు చేయని పరిస్థితి ఉంటోంది. అందుకే శాంతి, సమానత్వాల కోసం రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది".

- సుమిత్ర, అంకురం స్వచ్ఛంద సంస

మన రాజ్యాంగం గొప్పది కానీ...



"నేను భారత రాజ్యాంగాన్ని పూర్తిగా విశ్వసిస్తా. దానికి మించిదేమీ లేదు. ఇటీవల రాజ్యాంగ స్వరూపాన్ని మారుస్తామనే ప్రచారం ఊపందుకుంది. లౌకికరాజ్యం పదం తొలగించి హిందూత్వ దేశంగా చేస్తామనే ప్రచారం సాగింది. వీటిని జాగ్రత్తగా గమనించాలి. చాలామందికి మన చట్టాల పట్ల అవగాహన లేదు".

-కొండవీటి సత్యవతి, 'భూమిక'



గణతంత్రదినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో 'సెలబ్రేటింగ్ కాంస్టిట్యూషన్- ప్రొటెక్టింగ్ సివిల్ లిబర్టీస్' అనే నినాదంతో 'రైజ్-రెసిస్ట్-యునైట్' అంటూ తెలంగాణా, హైదరాబాద్‌లో అంతర్జాతీయ శతకోటి ప్రజాగళం కాంపెయిన్ 'వన్ బిలియన్ రైజింగ్' రేపు జరుగుతోంది. ఇందులో దళితులు, మైనారిటీలు, మహిళలు, మేథావులు, ఆదివాసీలు, ట్రాన్స్‌జండర్లు, ముస్లిం మైనారిటీలు, అందరూ పాలుపంచుకుంటున్నారు.

ప్రాథమిక హక్కులు లేవు మాకు...



'రాజ్యాంగపరంగా మాకు ఏ భద్రతా లేదు. ఇంటి నుంచి విద్య, ఉపాధి వంటి ఎన్నో హక్కుల విషయాలలో నిరాదరణకు గురవుతున్నాం. ప్రాథమిక హక్కులు శూన్యం. 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి రాష్ట్రం అమలు చేయాలి. ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రభుత్వ విధాన నిర్ణేతల్లో, ప్రజల మైండ్‌సెట్‌లో మార్పు రావాలి. ట్రాన్స్‌జండర్స్ పరంగా సెన్సిటైజేషన్ అవసరం".

- చంద్రముఖి, తెలంగాణ హిజ్రా ఇంటర్‌సెక్స్ ట్రాన్స్ జండర్ కమిటీ సభ్యురాలు

ఎవరి చేతుల్లో ఉంది?



"అంబేడ్కర్ స్త్రీపురుష సమానత్వం, కులాల సమానత్వం- ఇలా అన్నింటికి సంబంధించి అద్భుతంగా భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను కూడా సమాజంలో హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా ఉండాలని చేపట్టారు. అయితే రాజ్యాంగం అనే ఆయుధం ఎవరి చేతుల్లో ఉన్నదన్నది కూడా ప్రధానమైనదే! దీన్ని బట్టి మన రాజ్యాంగం ఎవరి చేతుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చు. అమలు చేసే వ్యవస్థ వైఫల్యం చెందడం చూస్తున్నాం. సమానత్వ భావన కుటుంబం నుంచి కులాలవరకూ అన్నింటిలోకి చొచ్చుకుపోలేదు ఇంకా! సమాజంలో అసమానతలు వేళ్లూనుకుని ఉన్నాయి. సమానత్వ భావన ప్రజలలో రేకెత్తించాలంటే బలమైన చైతన్యాన్ని సమాజంలో తీసుకురావాలి. వర్గానికి, కులానికి సంబంధించిన అసమానత్వ ధోరణులు పోవాలంటే శక్తిమంతమైన, ఐక్యమైన, బలమైన ఉద్యమం రావాలి. ప్రభుత్వం నుంచి కూడా గట్టి మద్దతు రావాలి. రెండు నాల్కల ధోరణి పోవాలి".

- ఝాన్సీ, దళిత స్త్రీ శక్తి

బడ్జెట్ ఏదీ?



'ఆందోళన చేస్తే చట్టాలు వచ్చాయి. ఆ వచ్చిన చట్టాలు సరిగా అమలు కావడం లేదు. అవి సరిగా అమలు కాకపోవడానికి కావాల్సిన బడ్జెట్, వనరులు ప్రభుత్వం కేటాయించడం లేదు. పోలీసువ్యవస్థ సైతం సరిగా లేదు. కోర్టుకు వెళ్లిన తర్వాత కూడా అత్యాచారాలకు, హింసకు, హత్యలకు గురయిన మహిళలకు తగిన సాక్ష్యాలు లేవంటూ న్యాయం జరగడం లేదు. అన్ని రంగాలలో సమానహక్కులు లేని పరిస్థితి ఉంది. అందుకే మంచి చట్టాలతోపాటు అమలు కూడా సరిగా జరగాలి. మన పోరాటం దానిపైనే.

- ఆశాలత, 'ఐద్వా' సభ్యురాలు

డెవలప్‌మెంట్ ఏది?



"రాజ్యాంగంలో మైనారిటీ హక్కులకు సంబంధించిన చట్టాలు చక్కగా ఉన్నాయి కానీ అవి చేతల్లో మాత్రం నామమాత్రంగా నిలుస్తున్నాయి. పేదరికంతోపాటు పితృస్వామ్య వ్యవస్థ ఒత్తిడులను ముస్లింమహిళలు, ఆడపిల్లలు ఎదుర్కొంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు అందడం లేదు. అణచివేతకు గురవుతున్నారు.మైనారిటీలను ప్రభుత్వాలు, ప్రజలు పట్టించుకోవట్లేదు. చట్టాల విషయంలో 'ట్రిపుల్ తలాక్'నే తీసుకుంటే దానిపై నిర్ణయం తీసుకునే ఆప్షన్‌ని వారికి ఇవ్వాలి కదా! అది లేకుండా చేస్తే ఎలా? అలాగే ముస్లిం రిజర్వేషన్ల పరంగా కూడా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను పరిగణలోకి తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. అంతేకాదు సమాజంలో ముస్లింల మీద నమ్మకం లేని పరిస్థితులు కూడా ఉన్నాయి"

- జమీలా నిషాత్, షాహిన్ సొసైటీ

హక్కులు కొందరికే...



"రాజ్యాంగంలో అన్నీ రాసుకున్నాం. కానీ దాని ఫలాలు మాత్రం కొందరే అనుభవిస్తున్నారు. ఉదాహరణకు ప్రాథమికహక్కులు ఎంతమంది ప్రజలు, అందులోనూ స్త్రీలు, పిల్లలు వాస్తవంగా పొందుతున్నారు? మనది పురుషాధిక్య సమాజం. అందులో మార్పు రానంతవరకూ మానవహక్కులు అన్నీ కాగితాలకే పరిమితమవుతాయి. మహిళలపై, పిల్లలపై తీవ్ర హింసతోపాటు మానవహక్కుల గురించి మాట్లాడేవారిని అనుమానంగా చూస్తున్నారు. పేద ప్రజలు, మైనారిటీలు, స్త్రీలు, అసమానతలు ఎదుర్కొంటున్నారు. లింగవివక్ష వల్ల, పితృస్వామ్య వ్యవస్థ వల్ల వీరిని వస్తువులుగా చూస్తూ లైంగికంగా దోపిడీ చేస్తున్నారు. అందుకే శతకోటి ప్రజాగళం వంటి ఈవెంట్లు జరగాలి".

- శ్యామలా దేవి, ఛైర్‌పర్సన్ బాలల సంక్షేమసమితి, హైదరాబాద్ జిల్లా

పిల్లలకు చెబుతున్నాం...



"మేం భారత రాజ్యాంగ విలువలు, హక్కుల గురించి పిల్లలకు చెబుతాం. వారి విద్యాహక్కుపై పనిచేస్తున్నాం. జెండర్ సెన్సిటివిటీని పెంపొందిస్తున్నాం. మనకున్న చట్టాల గురించి చెబుతున్నాం. చట్టాలు అమలుకు పౌరులు తోడ్పడాలి. ప్రభుత్వంలో ఆ రకమైన రాజకీయ పట్టుదల రావాలంటే ప్రజల నుంచి ఒత్తిడి అవసరం. తమ హక్కుల కోసం ప్రజలు ప్రభుత్వాల్ని ప్రశ్నించాలి. ఆ పని పిల్లల్లోంచి మేం మొదలెట్టాం"

- అంబిక, అమన్ వేదిక

ఉన్నత స్థానాల్లో లేరు...



"రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన లేదు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలసహకారం విషయంలో ప్రభుత్వాలు సహకరిస్తున్నామని అంటున్నా అది అందరికీ జరగడం లేదు. కంపెనీల్లో ఉన్నత స్థానాలో మహిళలకు స్థానం ఉండడం లేదు. ఆడవారిపై లైంగిక హింస పరంగా ఎన్ని కంపెనీలు ఇంటర్నల్ కమిటీలు పెట్టారన్నదానికి మౌనమే సమాధానం. జండర్ బడ్జెట్ లేదు".


- గీత గోటి, కాన్ఫెడరేషన్ ఆఫ్ విమెన్ ఎంటర్‌ప్రైజెస్ అధ్యక్షులు

• నాగసుందరి

అపూర్వం

ధ్రువ దరహాసిని

భువిపైనే అత్యంత శీతల ప్రదేశం... ఉష్ణోగ్రత మైనస్ నలభై డిగ్రీలు! ఊహించుకుంటేనే వణుకు పుట్టి, గడ్డకట్టే వాతావరణంలో అడుగులు వేసింది ఓ ఇద్దరు పిల్లల తల్లి. మంచు గడ్డల మధ్య మొక్కవోని దీక్షతో ప్రయాణించి... 'దక్షిణ ధ్రువం'పై మువ్వన్నెల జెండా రెపరెపలాడించింది. ఈ ఘనత సాధించిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిణిగా చరిత్ర సృష్టించింది. అతి ఎత్తయిన భారత్-చైనా సరిహద్దులోని మూడున్నర వేల కిలోమీటర్ల మేర మంచు ప్రాంతాన్ని పహరా కాస్తూ... ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న అపర్ణా కుమార్ సాహస యాత్ర ఈ గణతంత్ర దినోత్సవ వేళ ఆమె మాటల్లోనే...



నాది 2002 యూపీ కేడర్ ఐపీఎస్ బ్యాచ్. ప్రస్తుతం 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్' (ఐటీబీపీ) డీఐజీగా డెహ్రాడూన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాను. నేను పుట్టి పెరిగింది బెంగళూరులో. ఐపీఎస్ కావాలన్నది నా కల. ఎంతో కష్టపడి దాన్ని నెరవేర్చుకున్నాను. మొరాదాబాద్‌లో పోస్టింగ్ వేసినప్పుడు పర్వతారోహణపై మనసు మళ్లింది. దాంతో 2014లో అడ్వాన్స్ మౌంటెనీరింగ్ కోర్సు చేశాను. ఇక అక్కడి నుంచి వెనక్కు తిరిగి చూసుకోలేదు. 'సెవెన్ సమిట్స్' (ఏడు ఖండాల్లోని ఎత్తయిన పర్వతాల అధిరోహణ) పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దీంతో 2014లోనే ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలని ప్రయత్నించాను. కుదరలేదు. కానీ ఆ వెంటనే టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని ఎక్కగలిగాను. తరువాతి ఏడాది మళ్లీ ఎవరెస్ట్ ఎక్కడం మొదలుపెట్టాను. ఆకస్మిక హిమపాతాలు, భూకంపాల వల్ల అదీ విఫలమైంది. చివరకు 2016 మే నెలలో మూడోసారి ప్రయత్నించి, శిఖరాగ్రానికి చేరుకోగలిగాను. మొత్తం నలభై ఐదు రోజులు పట్టింది. ఆ ఘనత సాధించిన తొలి మహిళా ఐపీఎస్‌ను నేనే. అంతే కాదు ఏడు ఖండాల్లోని అత్యంత ఎత్తయిన శిఖరాల్లో ఆరింటిని అధిరోహించిన మొట్టమొదటి 'ఆలిండియా సర్వీస్ ఆఫీసర్'ను కూడా నేనే కావడం గర్వంగా ఉంది.



ఆ అనుభూతితోనే అడుగులు...

దాదాపు మూడేళ్ల క్రితం ఎవరెస్టు అధిరోహించిన తరువాత డిపార్ట్‌మెంట్‌లో మంచి గుర్తింపు లభించింది. అదే ఏడాది నాకు డీఐజీగా పదోన్నతి దక్కింది. అది నాలో ఉత్సాహం నిపింది. నేను చెప్పేదొక్కటే... పట్టుదలగా ప్రయత్నిస్తే మహిళలు ఎందులోనూ తక్కువ కాదని అర్థం చేసుకోవాలి. అప్పుడే రంగం ఏదైనా రాణించగలుగుతారు. ఇప్పుడు నేను పనిచేస్తున్న ఐటీబీపీ పరిధిలోని ప్రాంతమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. చైనా సరిహద్దులోని శీతల ప్రదేశం. అక్కడ విధులు నిర్వర్తించడమంటే అంత సులువు కాదు. కానీ... దేశం కోసం కాపలా కాస్తున్నామన్న అనుభూతి చాలు... నరనరాలనూ ఉత్తేజితం చేయడానికి! అదే నన్ను ఎప్పటికప్పుడు లక్ష్యం వైపు అడుగులు వేసేలా ప్రోత్సహిస్తుంది.

కల నెరవేరింది...

ఓ పక్క కర్తవ్య నిర్వహణ... మరోవైపు కుటుంబ బాధ్యత... ఇద్దరు పిల్లల తల్లిగా నలభై నాలుగేళ్ల వయసులో నా లక్ష్యాలను చేరుకోవడం అంత సులువు కాదని నాకు తెలుసు. అయితే పర్వతారోహణలో శిక్షణ మొదలు పెట్టినప్పటి నుంచి నాదో కల... ఉత్తర, దక్షిణ ధ్రువాలను చేరి, మన జెండా ఎగరేయాలని! ముందు దక్షిణ ధ్రువ యాత్ర పూర్తి చేయాలనుకున్నాను. దాని కోసం తీవ్రంగా శ్రమించాను. అంటార్కిటికా అంటేనే ఎముకలు కొరికే చలి. ఈ యాత్రకు బయలుదేరే ముందు న్యుమోనియాతో బాధపడ్డాను. అయినా వెనక్కు తగ్గలేదు. మందులు వేసుకుంటూనే సన్నద్ధమయ్యాను. భూమిపైనే అతి శీతల ప్రదేశమైన అంటార్కిటికాలో అనుక్షణం వాతావరణం మారిపోతుంటుంది. ఉన్నట్టుండి మేఘాలు కమ్మేస్తాయి. చలి గాలులు బలంగా వీస్తాయి. మంచు చుట్టుముడుతుంది. అడుగడుగునా అవరోధాలు... ఆటంకాలు. అన్నింటికీ మించి మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య రోజుకు ఎనిమిది గంటలు స్కైయింగ్, వాకింగ్ అంటే సాధారణ విషయం కాదు. చేతులు బిగుసుకుపోయేవి. వేళ్లు ముడుచుకునేవి. ఎముకలు కొరికే చలిలో ఒళ్లు మొద్దుబారుతుందేమోనని భయపడ్డాను. దానికితోడు నా చలువ కళ్లద్దాలు పగిలిపోయాయి. మా బృందంలో ఆరోగ్య సమస్యలతో ఇద్దరు సహచరులు, గైడ్ మధ్యలోనే వెనుదిరిగారు. కానీ నేను సడలని సంకల్పంతో 111 కిలోమీటర్లు మంచులో నడిచి, ఈ నెల 13న దక్షిణ ధ్రువాన్ని చేరుకోగలిగాను.

ఇక మిగిలింది... ఉత్తర ధ్రువమే!

దక్షిణ ధ్రువం చేరుకోగానే నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. అడుగడుగునా సవాళ్లను అధిగమించి, ఇంత వరకూ దేశంలో ఏ మహిళా ఐపీఎస్ సాధించని ఘనత సాధించానంటే ఎంతో ఆనందంగా ఉంది. ఎనిమిది రోజులు సాగిన ఈ ప్రయాణం నిజంగా ఓ సాహస యాత్ర. ఇప్పుడు నా లక్ష్యం ఉత్తర ధ్రువం! ఈ ఏప్రిల్‌లో దాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నా. అది కూడా చేరితే నా కల నెరవేరినట్టే. నా ఈ మౌంటెనీరింగ్ ప్రయాణంలో నా భర్త సంజయ్‌కుమార్ ప్రోత్సాహం, సహకారం మరువలేనిది. నా విజయం వెనుక ఆయన ఉన్నారు. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. దక్షిణ ధ్రువ యాత్ర విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు. ఆ ప్రోత్సాహం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

వంటిల్లు

అదుర్స్... అటుకుల్స్...

అటుకుల ఉప్మా.. గతంలో నానమ్మలు ఇళ్లలో చేసే సాధారణ అల్పాహార వంటకం. తయారీ చాలా సింపుల్. అంతేనా తిన్నాక కడుపు నిండినట్టు అనిపించి చాలాసేపటి దాకా ఆకలేయదు. శరీరానికి సత్తువనిస్తుంది. కాబట్టి ఇంటిల్లపాదీ అల్పాహారంగా తినచ్చు. వారంలో ఒకట్రెండు రోజులు చిన్నారులకు అటుకుల ఉప్మాను లంచ్‌బాక్స్‌లో పెట్టిస్తే, లొట్టలేసుకుంటూ తింటారు.



కావలసినవి:

అటుకులు - 3 కప్పులు (లావు రకం)
సెనగపప్పు - టీ స్పూన్
మినపపప్పు - టీస్పూన్
జీలకర్ర - తగినంత
పల్లీలు - 3 టేబుల్‌స్పూన్లు
మెంతులు - కొన్నిగింజలు
ఆవాలు - తగినంత
పచ్చి మిరపకాయలు - 3
కరివేపాకు - కొద్దిగా
ఉప్పు- రుచికి తగినంత
పసుపు - అర టీస్పూన్
నిమ్మరసం - తగినంత
కరివేపాకు - తగినంత
నూనె - తగినంత

తయారీ:

ముందుగా పచ్చిమిరపకాయలు, కరివేపాకును శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పెట్టుకోవాలి. వెడల్పాటి పాత్రలో నీరు పోసి అటుకులను ఒక నిమిషం నానబెట్టాలి. తర్వాత తీసి చిల్లుల గిన్నెలో వడపోసుకోవాలి. అటుకులు తడిగా ఉంటే సరిపోతుంది.

స్టవ్ మీద కడాయి పెట్టి, వేడయ్యాక నూనె పోసి కాచాలి. అందులో పల్లీలు వేసి సన్నటిమంట మీద చిటపట శబ్దం చేసేదాక వేయించి, తీసి పక్కన పెట్టుకోవాలి. తర్వాత నూనెలో వరుసగా మెంతులు, మినపపప్పు, ఆవాలు, జీలకర్ర వేసుకోవాలి. తర్వాత కరివేపాకు, పచ్చిమిర్చి వేసి వేగాక పసుపు వేసి, తిరగమోతనంతటినీ ఒకసారి బాగా కలుపుకోవాలి. అందులో నానబెట్టిన అటుకులు, తగినంత ఉప్పు వేసుకోవాలి. పసుపురంగు అంతా తెల్లటి అటుకులకు పట్టేలా బాగా కలపండి. దీనికి వేయించిపెట్టుకున్న పల్లీలు వేసి, గరిటెతో కలపండి. స్టవ్ ఆఫ్ చేసి నిమ్మరసం వేసి బాగా పట్టేలా కలపండి. అంతే అటుకుల ఉప్మా తయారయిపోయినట్టే! ఎంచక్కా ప్లేట్‌లో వడ్డించుకొని లాగించేయడమే!

ఆహారం - ఆరోగ్యం

జలుబు వదిలిపోతుంది!

శీతకాలం మొదలైనప్పటి నుంచి నాకు తరచు జలుబు చేస్తుంటుంది. శీతకాలం చివరకు వచ్చేస్తున్నా, ఈసారి కొంచెం ఎక్కువగానే ఉంది. జ్వరం వచ్చినట్టుగా ముఖమంతా నొప్పిగా ఉంటుంది. ఇలాంటి సమయంలో తీసుకొనే ఆహారం ఎలా ఉంటే బాగుంటుంది? ఒక మంచి వంటకం చెప్పండి.

- స్వాతి

జలుబు చాలా కామన్. అది ఏ సీజన్‌లో అయినా రావచ్చు. దుమ్ము, ధూళి, అతి ఎండ, అతి చలి, శీతకాలం... ఇవన్నీ జలుబుకు కారణం కావచ్చు. జలుబు అంటువ్యాధి. అందుకే ఇలాంటి సందర్భాల్లో ఆహార పరంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.



- ❖ ద్రవ పదార్థాలు, అంటే... నీళ్లు, సూప్‌లు, రసం, మజ్జిగ, సాంబారు, పళ్లరసాల ఎక్కువగా తీసుకోవాలి.
- ❖ తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలి. బయట ఎక్కువ తిరగవద్దు.
- ❖ జలుబు ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం ముఖానికి ఆవిరి పట్టాలి. మరుగుతున్న నీటిలో కొద్దిగా పసుపు వేసి ఆవిరి పడితే మంచిది. తులసి దళం, చిటికెడు మిరియాలు కూడా వేయొచ్చు. మరీ ఘాటు ఉండకుండా చూసుకోవాలి.
- ❖ ఆహారం తీసుకున్న ప్రతిసారీ ఉప్పు నీటితో నోటిని పుక్కిలించాలి.

మిరియాల రసం...

జలుబుతో బాధపడుతున్నప్పుడు ఉపశమనం కోసం మిరియాల రసం భేషుగ్గా ఉపయోగపడుతుంది.

కావాల్సినవి: చింతపండు నిమ్మకాయంత. ఒక్కొక్కటి చొప్పున ఉల్లిపాయ, టమోటా, మిరపకాయ. కారం, ధనియాల పొడి చెమ్చాడు. అర చెమ్చాడు చొప్పున మిరియాల పొడి, పసుపు, తగినంత ఉప్పు.

వీటన్నిటిని అర లీటరు నీళ్లలో మిశ్రమం లాగా కలుపుకొని మరిగించాలి.

తాలింపు కోసం: 4 వెల్లుల్లి రెబ్బలు, మిరియాలు అర చెమ్చా, జీలకర్ర అర చెమ్చా, కరివేపాకు.

వీటిని కల్వంలో వేసి మెదపాలి. బాణలిలో ఒక స్పూను నువ్వుల నూనె వేసి ఆవాలు వేగించాలి. కల్వంలో మెదిపిన మిశ్రమం, రసం అందులో వేసి పొంగించాలి. అంతే.. ఔషధీ రసం రెడీ! దంపుడు బియ్యంలో రసం కలుపుకొని, భోజనం చెయ్యండి. భోజన ప్రియులు మిరియాల అప్పడం రోస్ట్ చేసుకొని, తీసుకోవచ్చు. ఈ వంటతో జలుబు దెబ్బకు తగ్గుతుంది.



- డాక్టర్ బి.జానకి,
న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com





తెలుసుకుందాం!

సాహసం వీరి పథం

ప్రమాదం ఎదురైతే ఏం చేయాలో ఆ క్షణం అర్థం కాదు. కానీ ఈ చిన్నారులు మాత్రం సమయస్ఫూర్తితో స్పందించారు. ఇతరుల ప్రాణాలు కాపాడటానికి తమ ప్రాణాలు పణంగా పెట్టారు. వాళ్లు చూపించిన ధైర్యసాహసాలకు గాను సాహసబాలల పురస్కారాలకు ఎంపికయ్యారు.



హిమప్రియ

సమయస్ఫూర్తితో...

తీవ్రవాదులను చూస్తే భయంతో వణికిపోతాం. కానీ జమ్ముకు చెందిన ఎనిమిదేళ్ల గురు హిమప్రియ మాత్రం సమయస్ఫూర్తిని ప్రదర్శించింది. జమ్ములోని సుంజువాన్ ఆర్మీ క్యాంప్‌పై గత ఏడాది ఫిబ్రవరి 10న తీవ్రవాదులు దాడి చేశారు. ఇంట్లోకి చొరబడటంతోనే గ్రెనేడ్ విసిరారు. ఆ దాడిలో హిమప్రియ తల్లి గాయపడింది. అయినా కూడా హిమప్రియ చలించకుండా తీవ్రవాదిని మాటల్లో పెట్టింది. తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి నెమ్మదిగా ఆ తీవ్రవాదిని ఒప్పించగలిగింది. ఆ చిన్నారి సాహసాన్ని అందరూ మెచ్చుకున్నారు. హిమప్రియ భారత్ అవార్డుకు ఎంపికయింది.



సౌమ్యదీప్ జనా

తెగువకు హ్యాట్సాఫ్

పదమూడేళ్ల సౌమ్యదీప్ జనా కూడా జమ్ములో తీవ్రవాదుల దాడిని ఎదుర్కొన్నాడు. తీవ్రవాదుల దాడిని పసిగట్టిన సౌమ్యదీప్ తల్లిని, చెల్లెలును గదిలోకి పంపించి గడియబెట్టాడు. ప్రధాన ద్వారం మూసేసి ఇనుప పెట్టెలు అడ్డంగా పెట్టాడు. కానీ టెర్రరిస్టులు గ్రెనేడ్ విసిరి, కాల్పులు జరిపారు. ఆ దాడిలో సౌమ్యదీప్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడు. భద్రతా బలగాలు అతన్ని ఆసుపత్రికి తరలించాయి. మూడు నెలల తరువాత ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చాడు. అయితే తన ఎడమభాగం పూర్తిగా చచ్చుబడిపోయింది. అయితే నేం...'నా కుటుంబం కోసం చేశాను. వాళ్లకు ఏం కాకుండా చూసుకున్నాను. అది చాలు' అని అంటాడు సౌమ్యదీప్. సౌమ్యదీప్‌ను భారత్ అవార్డు వరించింది.

చిట్టి చెల్లి కోసం...

ఏనుగుల మంద కనిపిస్తే వెనక్కి చూడకుండా పరుగందుకుంటారు. కాని ఛత్తీస్‌ఘడ్‌లోని మోహన్‌పూర్ గ్రామానికి చెందిన ఏడేళ్ల కాంతి మాత్రం పరుగందుకోలేదు. ఏనుగుల మంద బారి నుంచి తన మూడేళ్ల చెల్లిని కాపాడుకోవడానికి ధైర్య సాహసాలను చూపింది. గ్రామస్తులు తలోదిక్కు పారిపోయినా భయపడకుండా ఇంట్లోకి దూరి చెల్లెలిని సురక్షితంగా బయటకు తీసుకొని వచ్చింది. గ్రామ ప్రజలు ఎవరూ చేయలేని సాహసాన్ని కాంతి చేసి చూపింది.



సేతు మాలిక్

మొసలిని భయపెట్టాడు

మొసలిని చూస్తే ముచ్చెమటలు పడతాయి. కానీ ఒడిషా రాష్ట్రంలోని కేంద్రపాద జిల్లాకు చెందిన 15 ఏళ్ల సేతు మాలిక్ కర్రతో మొసలిని బాది తన అంకుల్‌ను రక్షించాడు. గత ఏడాది ఫిబ్రవరి 20న సేతు మాలిక్ తన అంకుల్ వినోద్ మాలిక్‌తో కలిసి దగ్గరలో ఉన్న చెరువుకు వెళ్లాడు. వినోద్ మాలిక్ చేతులు శుభ్రం చేసుకోవడానికి దిగగానే మొసలి చేతిని అందుకుంది. వెంటనే సేతు మాలిక్ ఒక కర్ర తీసుకుని మొసలిని బాదడం మొదలుపెట్టాడు. సేతుమాలిక్ దెబ్బలకు మొసలి వదిలేసింది. అలా సాహస బాలల పురస్కారానికి ఎంపికయ్యాడు.



కాంతి

స్నేహితురాలిని కాపాడి..

సముద్రపు అలలు ఎగిసిపడిపోతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ బీచ్‌లో ఆనందంగా ఆడుకుంటున్నారు. ఇంతలో ఒక రాకాసి అల ఒక అమ్మాయిని సముద్రంలోకి తీసుకెళ్లిపోయింది. అందరూ నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. కానీ తన స్నేహితురాలిని కాపాడటానికి ధైర్యంగా సముద్రంలోకి వెళ్లింది పదిహేనేళ్ల నితిషా నేగి. స్నేహితురాలిని బలంగా ఒడ్డుకు తోసింది. స్నేహితురాలిని కాపాడగలిగింది కానీ నితిషా మాత్రం ఒడ్డుకు చేరుకోలేకపోయింది. నితిషా నేగి ఫుట్‌బాల్ క్రీడాకారిణి. పసిఫిక్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా టోర్నమెంట్ ఆడటానికి ఆస్ట్రేలియాకు వెళ్లింది. అక్కడి అడిలైడ్ బీచ్‌లో జరిగిన విషాద సంఘటనలో ప్రాణాలు కోల్పోయింది. కానీ తను చూపించిన ధైర్యసాహసాలకు సాహసబాలల పురస్కారానికి ఎంపికయింది.



నితిషా నేగి

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటూ...



అద్రికా గోయల్ కార్తీక్ గోయల్

ప్రాణాలకు తెగించి...

ఆందోళనలతో ఆ ప్రాంతమంతా అట్టుడుకుతోంది. కర్ఫ్యూ విధించారు. అందరూ తలుపులు మూసుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కానీ ఇద్దరు అన్నాచెల్లెలు మాత్రం దాడుల్లో గాయపడిన వారికి ఆహారం, మంచి నీళ్లు సరఫరా చేశారు. వైద్యం అందేలా చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కార్తీక్ గోయల్, అద్రికా గోయల్‌ల సాహసగాథ ఇది. మోరెనాలో ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చారు. ఆందోళనకారులు ఆ రోజు ఛత్తీస్‌గఢ్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి చేశారు. నిరసనకారులు ప్రయాణికులను రైలు నుంచి కిందకు దిగనివ్వలేదు. రైలు ఆగిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే కార్తీక్ నివాసం ఉంది. ప్రయాణికుల పరిస్థితిని గమనించిన కార్తీక్, అద్రికాలు ఇంట్లో నుంచి ఆహారాన్ని, నీళ్లను తెచ్చి అందించారు. ఆ సమయంలో నిరసనకారులు రైలుపై రాళ్లు రువ్వుతున్నారు. అయినా అన్నాచెల్లెలు లెక్కచేయలేదు. వాళ్లు చూపిన ధైర్యసాహసాలకు బాలశక్తి పురస్కారం (బ్రేవరీ) అందుకున్నారు.

గణతంత్ర దినోత్సవం విశేషాలు తెలుసా?

పిల్లలూ..! జనవరి 26 మనకెంతో ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే 1950 జనవరి 26న మన రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

* మనకు స్వాతంత్రం 1947 ఆగస్టు 15న వచ్చినప్పటికి మనకంటూ కొత్త రాజ్యాంగం వచ్చేంత వరకూ బ్రిటీష్ కాలంలో రూపొందించిన భారతీయ చట్టం-1935 ప్రకారమే మన దేశ పాలన సాగింది. డాక్టర్. బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన ముసాయిదా కమిటీ భారత రాజ్యాంగాన్ని రచించింది.
* డ్రాఫ్టింగ్ కమిటీ రాజ్యాంగం నమూనా ప్రతిని 1947 నవంబర్ 4న మన పార్లమెంట్‌కు సమర్పించింది. అయితే పూర్తిస్థాయి రాజ్యాంగం కాపీ మాత్రం 1950 జనవరి 24న సిద్ధమైంది. ఆ రోజున రాజ్యాంగం రెండు ప్రతుల మీద పార్లమెంట్ సభ్యులు సంతకాలు చేశారు. రాజ్యాంగం రచనకు పట్టిన కాలం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు.
* మన రాజ్యాంగానికి ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరుంది. మన రాజ్యాంగ పుస్తకాన్ని ఒక్కరోజులో చదివేయడం సాధ్యంకాదు.
* మన రాజ్యాంగాన్ని మొదట ప్రింట్ చేయలేదు. చక్కగా చేతితో రాశారు. రాజ్యాంగం ఒరిజినల్ కాపీలు రెండున్నాయి. ఇవి హిందీ, ఇంగ్లీషు భాషలో ఉంటాయి. ఇవి ఇప్పటికీ పార్లమెంట్‌లో భద్రంగా ఉన్నాయి.

1950 జనవరి 26 ఉదయం 10:18 నిమిషాల నుంచి మన రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

* ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి ఎర్రకోటపై మన జాతీయ జెండాను ఎగురవేస్తారు. ఆ తరువాత దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
* అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులు, పౌరులకు రాష్ట్రపతి ఈ రోజు సాహస అవార్డులు ప్రదానం చేస్తారు. సాహసవంతులైన పిల్లలకు జాతీయ సాహస బాలల అవార్డులనూ అందజేస్తారు.
* దేశవ్యాప్తంగా ఈ రోజున జెండా ఎగరేసి మన జాతీయగీతం జనగణమన ఆలపిస్తారు. జైహింద్, మహాత్ములు ఇచ్చిన నినాదాలు చేస్తారు. జాతీయగీతాన్ని 52 సెకన్లలో పాడుతారు. స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులను, రాజ్యాంగం రూపొందించిన బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు.
* స్వతంత్ర భారతదేశ స్ఫూర్తిని గణతంత్ర దినోత్సవం ప్రతిబింబిస్తుంది. అందుకు సంకేతంగా నేవీ, మిలిటరీ సైనికులు '21 గన్ సెల్యూట్'తో గౌరవ వందనం చేస్తారు.
* మన గణతంత్ర వేడుకలను చూసేందుకు వివిధ దేశాల అధినేతలు, ప్రధానులను అతిథులుగా ఆహ్వానిస్తారు. ప్రపంచదేశాలతో మంచి సంబంధాలు, శాంతి నెలకొల్పేందుకు ఈ సంప్రదాయం ఎంతో ఉపయోగపడుతుంది.
* రిపబ్లిక్ డేను మూడు రోజులు జరుపుకుంటారు. మూడోరోజున సైనికుల కవాతుతో ఈ వేడుకలు ముగుస్తాయి.

డైలీ సుడోకు - 435

	2		3					
7				1	4		8	
6								
1	8			4			5	
2			1		5			6
	9			8			2	3
								2
	1		4	5				9
					7		1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 434 సమాధానం

7	9	3	8	5	4	1	2	6
5	1	2	7	6	3	9	8	4
4	8	6	1	9	2	5	3	7
3	2	5	6	7	8	4	1	9
9	6	8	4	1	5	2	7	3
1	7	4	3	2	9	6	5	8
2	4	7	9	3	1	8	6	5
6	5	9	2	8	7	3	4	1
8	3	1	5	4	6	7	9	2

స్వరాలు పలికే పియానో

ఎలా పనిచేస్తుంది?

సంగీత పరికరాలైన వీణ, వయొలిన్, తబలా గురించి తెలిసే ఉంటుంది. చేతితో పియానో మీద సంగీతాన్ని పలికించవచ్చు. మరి పియానో ఎలా పనిచేస్తుందో తెలుసుకుందామా...



* పియానో ఒక అద్భుతమైన సంగీత సాధనం. అన్ని ఆర్కెస్ట్రా పరికరాలకు సంబంధించిన ధ్వనులనూ పియానో చక్కగా ఒలికిస్తుంది.
* అరచేతిలో ఇమిడిపోయే చిన్నసైజుతో మొదలుకొని, పెద్దటేబులంత సైజులో ఉండే పియానోలు కూడా ఉంటాయి. గడిచిన 100 ఏళ్లలో సుమారు 5 వేల రకాలకు పైగా పియానోలు మార్కెట్లోకి వచ్చాయి. మరీ చిన్నగానూ, మరీ పెద్దగానూ కాకుండా మధ్యస్థంగా ఉండే పియానోలో సుమారు 230 తీగలు (తంత్రులు) ఉంటాయి.
* పెద్ద పెద్ద పియానోల్లో సంగీతాన్ని పలికించేందుకు ఉపయోగపడే వివిధ భాగాలను కలపతో తయారు చేస్తారు. ఒక్కో పియానోలో నిర్దిష్ట రూపంలో చెక్కిన వేలాది కలప ముక్కలను ఒకదానితో మరొకదాన్ని క్రమపద్ధతిలో అతికిస్తారు.
* చెక్కముక్కలతోనే కాకుండా రాగి, ఇనుము, ఉక్కు, కాగితం, జంతువుల చర్మం.. ఇలా అనేక రకాల పదార్థాలను పియానో తయారీలో ఉపయోగిస్తారు.
* సరైన రాగాలు పలికించేందుకు, శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించేందుకు పియానోలను అప్పుడప్పుడు ట్యూన్ చేయాల్సి ఉంటుంది.
* సాధారణంగా కొత్త పియానోను రుతువు మారినప్పుడల్లా ఒకసారి చొప్పున ఏడాదికి మొత్తం 4 సార్లు ట్యూన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక తరువాత నుంచి కనీసం ఏడాదికి రెండు సార్లయినా పియానోకు ట్యూన్ చేసుకోవడం తప్పనిసరి.

గుడ్డులోంచి కోడి పిల్ల

చేసేయండి!



కావలసిన వస్తువులు:

ఊలుదారపు ఉండలు, టాల్కమ్ పౌడర్, పసుపు రంగు పొడి, నారింజ, కాగితపు సంచి, నలుపు రంగు కాగితాలు, కోడిగుడ్డు డొల్ల, గట్టి అట్టముక్క, జిగురు.

తయారీ విధానం:

* రెండు ఊలుదారపు ఉండలు తీసుకొని, వాటిని కాగితపు సంచిలో వేయండి. ఆ కాగితపు సంచిలో పసుపు పొడి, టాల్కమ్ పౌడర్ కూడా పోయండి.
* కాగితపు సంచిని మూసి, బాగా కదపండి. దాంతో తెల్లని ఊలుదారపు ఉండలు పసుపుగా మారతాయి లేదా నేరుగా పసుపు రంగు ఊలుదారపు ఉండల్నే తీసుకోవచ్చు.
* సగం గుడ్డు డొల్ల తీసుకోండి. దానిలో పసుపురంగులో ఉన్న ఊలుదారపు ఉండలను ఒకదానిపై ఒకటి ఉంచండి. పై ఉండ కింది ఉండ కంటే కాస్త చిన్నదా ఉండేలా చూసుకోండి.
* నల్లని కాగితాన్ని పంచ్ చేసి రెండు గుండ్రని కాగితపు ముక్కల్ని చిన్న ఉండపై కళ్లలాగా అతికించండి.
* నారింజ రంగు కాగితం నుంచి కోడిపిల్ల ముక్కు ఆకారాన్ని కత్తిరించండి.
* గుడ్డు పగలగొట్టుకొని వస్తున్న కోడి పిల్ల రెడీ. ఈ మొత్తం గుడ్డును గట్టి అట్టముక్కపై జాగ్రత్తగా అతికించండి. గుడ్డులోని కోడిపిల్లను షోకేస్‌లో పెట్టి మీ ఫ్రెండ్స్‌కు చూపించండి.

కథ



బాధితురాలి మీదే రాళ్లేస్తారా?

- గాయని చిన్మయి శ్రీపాద



భారతీయ సమాజంలో బాధితురాలికి సత్వర న్యాయం అందడం అంత సులువుకాదని నేపథ్యగాయని చిన్మయి శ్రీపాద ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని బహిర్గతం చేసినందువల్లే తమిళ నాడు డబ్బింగ్ యూనియన్ బహిష్కరించిందని ఆమె వ్యాఖ్యానించారు. బాధితురాలినైన తనకు సినిమా అవకాశాలు లేకుండా చేయడం, తప్పుచేసిన వైరముత్తు మాత్రం గొప్పవ్యక్తిగా చలామణి అవుతూ, సన్మానాలు, సత్కారాలు పొందడం సమాజంలో వేళ్లూనుకొనున్న పితృస్వామ్యభావజాలానికి నిదర్శనమని అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ వేదికగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఆ కార్యక్రమంలో భాగంగా “మీటూ” ఉద్యమంపై జరిగిన చర్చాగోష్ఠిలో చిన్మయి శ్రీపాద పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ '..“ఒక బాధితురాలికి న్యాయం జరగాలంటే ఆమె చనిపోతేనో, మర్డర్‌కు గురైతేనో మాత్రమే సమాజం సీరియస్‌గా పట్టించుకుంటుంది. అవి రెండూ కాకుండా, నాకు అన్యాయం జరిగిందంటూ ఒక మహిళ నోరువిప్పితే, తనకు అవమానాలు, అవహేళనలు, వేధింపులే దక్కుతాయి. ప్రస్తుతం అవన్నీ నేను అనుభవిస్తున్నాను. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు నన్ను తీవ్రంగా దూషిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే, ‘నాతో పడుకోవడానికి ఎంత తీసుకుంటావు’ అని పిచ్చి పిచ్చి మెసేజ్‌లతో కొంత మంది వేధిస్తున్నారు. నన్ను చెడుగా ట్రోల్ చేసేవారందరికీ నాదొకటే ప్రశ్న, ‘మీకు అక్కా, చెల్లి, అమ్మ లేరా’ అని. మరికొందరైతే నన్ను వ్యభిచారిణితో పోలుస్తూ దూషిస్తున్నారు కూడా. బాధితురాలిమీదే రాళ్లేస్తారా? ఇదెక్కడి న్యాయం. అమ్మాయిల వస్త్రధారణ సరిగ్గాలేనందువల్లే వేధింపులు పెరుగుతున్నాయని వ్యాఖ్యానిస్తున్న వారూ లేకపోలేదు. తప్పు చేస్తున్నదేమో అబ్బాయిలు అయితే, ప్రవర్తన మార్చుకోమని ఆడవాళ్లకు నీతులు బోధిస్తామెందుకో నాకర్థం కాదు” అన్నారు చిన్మయి.

అబ్బాయిలపై అఘాయిత్యాలు...

“సినిమాలో హీరో ‘ఆడవాళ్లంటే అబల కాదురా’ వంటి స్టీరియోటైప్ డైలాగులు చెబుతుంటే చప్పట్లు కొట్టే జనం నిజ జీవితంలో ఒక అమ్మాయి ధైర్యంగా తనకు జరిగిన అవమానాన్ని వ్యక్తంచేస్తే మాత్రం ఎందుకు అభినందించరు! ఇప్పటివరకు నేను నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఐదు రాష్ట్ర పురస్కారాలు అందుకున్నాను. తెలుగు, తమిళం తదితర భాషల్లో గాయనిగా పేరు సంపాదించుకున్నాను. అలాంటి నేను మరో ప్రముఖుడిపై ఆరోపణలు చేయడం ద్వారా వార్తల్లో నిలవాలని ఎందుకు అనుకుంటాను! దీనిపై విజ్ఞులైన వారంతా ఆలోచించాలి. లైంగిక వేధింపులు సినిమా పరిశ్రమలోనే కాదు, కార్పొరేట్ ఆఫీసుల్లో, పనిప్రదేశాల్లో, కుటుంబం నుంచి కూడా ఎదుర్కొంటున్నవారెందరో. కేవలం అమ్మాయిలపైనే కాదు, చిన్నవయసు అబ్బాయిలపైనా అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ అకృత్యాలపై బాధ్యతగల వ్యక్తులందరూ స్పందించాలి. రాజకీయ పలుకుబడితో చాలామంది దోషులు తప్పించుకుంటున్నారు! ఇటీవల వైరముత్తు పుస్తకావిష్కరణ సభకు తమిళనాడు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఒక నేరారోపణలో ఉన్న వ్యక్తికి సంబంధించిన సభ, సమావేశాలకు అధికారంలో ఉన్నవారు హాజరవడం వల్ల ప్రజల్లోకి ఎలాంటి సంకేతాలను తీసుకెళతాయో నాయకులు ఆలోచించాలి” అన్నారు ఆమె.


నా భర్త సపోర్టుతోనే...


“ప్రస్తుతం తమిళ సినీపరిశ్రమ నుంచి అవకాశాలు పూర్తిగా తగ్గాయి. తెలుగు, కన్నడ తదితర భాషల నుంచి గాయనిగా అవకాశాలు వస్తున్నాయి. నేను చేస్తున్న “మీటూ” పోరాటంలో నా కుటుంబ సభ్యుల సహకారం ప్రత్యేకమైంది. ముఖ్యంగా నా భర్త రాహుల్ రవీంద్ర సపోర్టు వల్లే, ఇలా ధైర్యంగా పలు వేదికలపై మాట్లాడగలుగుతున్నాను. ఆయన్ని చాలా మంది మగవాళ్లు ఆదర్శంగా తీసుకోవాలి. తెలుగు సినిమా పరిశ్రమలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ వంటివి ఏర్పాటుచేశారు. కానీ కోలీవుడ్ తదితర చోట్ల అలాంటి కమిటీలు లేవు” అని చెప్పారు చిన్మయి.











అయిదు కొత్త సీన్ల ఫన్



"ఒకప్పుడు సినిమా బాగా ఆడితే.. 50 రోజులు, వంద రోజుల వేడుకలు జరిపేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండు వారాల్లో 50 కోట్ల గ్రాస్, షేర్, 100 కోట్ల గ్రాస్, షేర్‌లను బట్టే విజయోత్సవం చేసుకోవాలి. అందుకే గ్రాస్ పేరుతో జ్ఞాపికలను ఇవ్వాలనుకుంటున్నాం. ఈ సినిమాతోనే దానికి నాంది పలుకుతున్నాం" అని దిల్ రాజు అన్నారు. ఆయన సమర్పణలో శిరీశ్, లక్ష్మణ్ నిర్మాతలుగా వెంకటేశ్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ నటీనటులుగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'ఎఫ్2' చిత్రం సంక్రాంతికి విడుదలై వంద కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దిల్ రాజు మాట్లాడుతూ "ఎడిటింగ్ రూమ్‌లో కొన్ని సన్నివేశాలు తొలగించాం. ఇటీవల ప్రేక్షకుల మధ్యలో కూర్చొని సినిమా చూస్తుంటే ఎడిట్ చేసిన సీన్లు కూడా ఉంటే మరింత వినోదం పంచుతాయనిపించింది. అందుకే శనివారం నుంచి 5 సన్నివేశాలను జోడిస్తున్నాం" అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ "సినిమా సక్సెస్ చూస్తుంటే డ్రీమ్ రన్‌లా అనిపిస్తుంది. శనివారం కొత్త సన్నివేశాలతో మరింత వినోదాన్ని పంచుతుంది. ఈ సక్సెస్ నా ఒక్కడితోనే సాధ్యం కాలేదు. టీమ్ అందరి కృషి. హీరోలిద్దరూ నన్ను నమ్మి సపోర్ట్ చేశారు. ప్రతి ఆర్టిస్ట్‌లోని కిక్ తీసుకుని షూటింగ్ చేశా. పదేళ్ల క్రితం వెంకటేశ్‌గారు వదిలేసిన ఆయన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను మళ్లీ ఈ సినిమాలో చూపించారు. ఇప్పుడు అదే కిక్‌ను సక్సెస్ రూపంలో ప్రేక్షకులు మాకిచ్చారు" అని చెప్పారు. "నా వల్లే సినిమా ఆడుతుందనుకోవడం పొరపాటు. నేను మూడు సినిమాలు అంగీకరిస్తే మూడింటిలోనూ తమన్నానే కనిపిస్తుంది. కానీ తమన్నాను మూడు రకాల కోణాల్లో చూపించడం దర్శకుడికే సాధ్యమవుతుంది. అందుకే సినిమా సక్సెస్ ఒక్కరి కృషితో సాధ్యం కాదని చెబుతున్నా. ఈ కథ విన్నప్పుడు ఎంత ఎగ్జైట్ అయ్యానో.. అంతే ఎగ్జైటెడ్‌గా పని చేశా. ఇప్పుడు అదే ఎగ్జైట్‌మెంట్‌తో సక్సెస్‌ని ఆస్వాదిస్తున్నా" అని తమన్నా అన్నారు.

కృష్ణ దంపతులకు అంకితం

కృష్ణ, విజయనిర్మల దంపతులకు తాను రాసిన '86 సంవత్సరాల తెలుగు సినిమా' పుస్తకాన్ని అంకితమిచ్చారు కె. ధర్మారావు. హీరో కృష్ణ నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో "అద్భుతమైన విషయాలతో కూడిన పుస్తకాన్ని తెలుగు సినిమాకు బహూకరిస్తున్నట్టుగా భావిస్తున్నాం. మాకు ఈ పుస్తకాన్ని అంకితం చేసినందుకు రచయితకు కృతజ్ఞతలు" అని కృష్ణ, విజయనిర్మల అన్నారు.



"తెలుగు సినిమా అభిమానిగా 14 ఏళ్లు కృషి చేసి, నేనే సేకరించిన సమాచారంతో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చా. దర్శకరత్న దాసరిగారు నాలుగేళ్లు ఇందులో విషయాలను విని ప్రశంసించారు" అని కె. ధర్మారావు అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు రేలంగి నరసింహారావు, వి.కె. నరేశ్, రాధా ప్రశాంతి, వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.











విదేశాలకు మరిన్ని ఇండిగో విమాన సర్వీసులు

న్యూఢిల్లీ: విదేశాలకు నడిపే విమాన సర్వీసులను మరింత విస్తరించాలని దేశీయ విమానయాన సంస్థ ఇండిగో నిర్ణయించింది. కంపెనీ కొత్త సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన రోనొజాయ్ దత్తా ఉద్యోగులకు ఈ విషయం తెలియజేశారు. దేశీయ విమానయాన మార్కెట్లో ప్రస్తుతం ఇండిగోదే అగ్రస్థానం. కంపెనీ ఇప్పటికే కొన్ని విదేశీ గమ్య స్థానాలకు విమాన సర్వీసులు నడుపుతోంది. 'మన దేశం నుంచి విదేశాలకు రాకపోకలు సాగించే విమాన ప్రయాణికుల్లో 61 శాతం మంది విదేశీ విమాన యాన సంస్థల ద్వారానే ప్రయాణిస్తున్నారు. ఇందులో దేశీయ విమానయాన సంస్థల వాటా ప్రస్తుతం కేవలం ఆరు శాతం మాత్రమే'అని దత్తా చెప్పారు.

పారిశ్రామిక పద్మాలు వీరే

ఎల్ అండ్ టీ వ్యవస్థాపక చైర్మన్ అనిల్ కుమార్ మణిభాయ్ (ఎఎం) నాయక్‌కు ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించింది. దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు చేసిన కృషికి గుర్తింపుగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాయక్‌కు ఈ అవార్డు ప్రకటించారు. ఈ సంవత్సరం మొత్తం నలుగురికి పద్మ విభూషణ్ అవార్డులు ప్రకటించగా వారిలో నాయక్ ఒకరు. ఎల్ అండ్ టీలో సామాన్య ఉద్యోగిగా చేరి ఆ సంస్థను దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో నాయక్ కీలక పాత్ర పోషించారు. అమెరికాకు చెందిన జాన్ చాంబర్స్ (సిస్కో మాజీ చైర్మన్)కు కూడా పారిశ్రామిక, వాణిజ్య విభాగంలో ఈ సంవత్సరం పద్మ భూషణ్ అవార్డు ప్రకటించారు. ఢిల్లీకి చెందిన పారిశ్రామికవేత్త (ఎండీహెచ్ మసాలా అధినేత) ఎండీ పాల్ గులాటీకి పద్మ భూషణ్ అవార్డు లభించింది. అడోబ్ ఇంక్ చైర్మన్, సీఈఓ శంతను నారాయణ్‌కు పద్మశ్రీ పురస్కారం దక్కింది.


ఏఎం నాయక్


జాన్ చాంబర్స్


ఎండీ పాల్ గులాటీ



శంతను నారాయణ్

స్లీప్‌వెల్ బ్రాండ్‌తో మ్యాట్రెసెస్, పిల్లోస్, బెడ్‌షీట్స్‌ను విక్రయిస్తున్న షీలా గ్రూప్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,000 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేయాలని భావిస్తోంది. శుక్రవారంనాడిక్కడ మార్కెట్లోకి సరికొత్త శ్రేణి హోమ్ కంఫర్ట్ ఉత్పత్తులను విడుదల చేసిన సందర్భంగా కంపెనీ బిజినెస్ హెడ్ భూషణ్ జి పాఠక్ ఈ విషయం చెప్పారు.

ఆర్థిక కష్టాల్లో ఎస్సెల్ గ్రూప్

కుప్పకూలిన జీ, డిష్ టీవీ షేర్లు

ఎస్సెల్ ఇన్‌ఫ్రా నష్టాలే రూ.4,000 కోట్లు



ముంబై : సుభాష్ చంద్ర నాయకత్వంలోని ఎస్సెల్ గ్రూప్ తీవ్ర ఆర్థిక కష్టాల్లో చిక్కుకుంది. దీంతో శుక్రవారం బీఎస్ఈలో ఈ గ్రూప్‌లోని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీఈఈ) కంపెనీ షేర్లు 26.43 శాతం, డిష్ టీవీ కంపెనీల షేర్లు 32.74 శాతం నష్టపోయాయి. ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర కూడా తమ గ్రూప్ కంపెనీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న విషయం నిజమేనని అంగీకరించారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. అయితే ఎస్సెల్ గ్రూప్ అప్పుల భారం ఎంత ఉందనే విషయాన్ని వెల్లడించలేదు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంక్షోభం తర్వాత ఇన్‌ఫ్రా కంపెనీలు నిధులు సమీకరించడం మరింత కష్టంగా మారిందన్నారు. అయినా గత ఏడాది డిసెంబరు వరకు చెల్లించాల్సిన అన్ని అప్పులు చెల్లించేశామన్నారు. 'మంచి ఉద్దేశాలతో పని చేసినా అనుకున్న అంచనాలు అందుకోలేకపోయా. ఇందుకు మాకు నిధులు సమకూర్చిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు క్షమాపణ చెబుతున్నా' అని సుభాష్ చంద్ర తన లేఖలో పేర్కొన్నారు.

కష్టాలు ఇందుకే..

ఇన్‌ఫ్రా రంగంలో దూకుడుగా పెట్టుబడులు పెట్టడం, వీడియోకాన్ గ్రూప్ డీ2హెచ్ వ్యాపారాన్ని కొనుగోలు చేయడం తమ గ్రూప్ కొంప ముంచాయని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎస్సెల్ ఇన్‌ఫ్రా కంపెనీ నష్టాలే రూ.4,000 కోట్ల నుంచి రూ.5,000 కోట్ల వరకు ఉండొచ్చని లేఖలో పేర్కొన్నారు. దీన్ని అవకాశంగా చేసుకుని కొన్ని దుష్టశక్తులు దుష్ప్రచారంతో తమ గ్రూప్ కంపెనీల షేర్లను పడగొడుతున్నట్టు ఆరోపించారు. అయితే ఎస్సెల్ గ్రూప్ కంపెనీలు ఏవైనా బకాయిల చెల్లింపుల్లో విఫలమయ్యాయా? లేదా? అనే విషయాన్ని సుభాష్ చంద్ర వెల్లడించలేదు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఉన్నఫళంగా అప్పులు చెల్లించమని ఒత్తిడి చేయవద్దని రుణదాతలను కోరారు. అలా చేస్తే తమతో పాటు రుణదాతలూ నష్టపోతారని హెచ్చరించారు.

షేర్ల వ్యవహారంలో ఏం జరిగింది?

రిలయన్స్, సెబీకి ఏపీ హైకోర్టు ప్రశ్న.. వచ్చే నెల 8వ తేదీకి విచారణ వాయిదా

అమరావతి (ఆంధ్రజ్యోతి): షేర్ల విక్రయాల్లో రూ.2,700 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రిలయన్స్ సంస్థ తగిన వివరాలతో నివేదిక దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రథమ ధర్మాసనం ఆదేశించింది. ఒంగోలుకు చెందిన టి గంగాధర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ మేరకు 2000 సంవత్సరంలో రిలయన్స్ సంస్థ ఒక్కో షేరు రూ.30 చొప్పున 34 డమ్మీ కంపెనీలకు విక్రయించింది. అదే షేరును యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు రూ.330 చొప్పున కట్టబెట్టింది. తద్వారా ఎంతోమంది నష్టపోయారని, ఈ వ్యవహారంలో రూ.2,700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కూడా దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఈ అంశం మరుగున పడిపోవటంతో గంగాధర్ 2010, జనవరిలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా సెబీ నివేదిక వివరాలు కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఈ కేసు వివరాలు కోరారు. దీంతో 'ఈ వ్యవహారంలో ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నందున మళ్లీ మీ లేఖపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు' అంటూ కేంద్రం వివరణ ఇచ్చింది. ఇదే సమయంలో ఈ అంశాన్ని సెటిల్‌మెంట్ చేస్తున్నట్లు 2014లో రిలయన్స్ లేఖ రాసిందని సెబీ తెలిపింది. దీంతో గంగాధర్ గత ఏడాది ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించడంతో పాటు షేర్ల రూపంలో అక్రమార్కుల పరమైన సొమ్మును వెనక్కి రప్పించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. శుక్రవారం ఈ కేసు విచారణ ఏపీ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలోని ప్రథమ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది శ్రీకాంత్ మాట్లాడుతూ... ఫైళ్లు కనిపించకుండాపోయాయని చెబుతున్న సెబీ.. మరో వైపు రిలయన్స్ సెటిల్ చేస్తోందని ఎలా చెబుతుందని వాదించారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. దీంతో ఈ వ్యవహారంలో అసలేం జరిగిందో వివరణ ఇవ్వాలని ధర్మాసనం రిలయన్స్‌ను, సెబీని, కేంద్రాన్ని ఆదేశించింది. వారం రోజుల సమయం కావాలని రిలయన్స్ తరఫున హాజరైన న్యాయవాదులు, రెండు వారాల గడువు కావాలని సెబీ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. దీంతో వచ్చే ఫిబ్రవరి 8వ తేదీకి కేసు ధర్మాసనం వాయిదా వేసింది.

ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ

భారత్ త్వరలోనే చేరుకుంటుంది: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఐదో స్థానానికి చేరుకోబోతోందని ప్రధాని మోదీ అన్నారు. దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపర్చేందుకు తమ ప్రభుత్వం రోజువారీగా చర్యలు తీసుకుంటోందన్నారు. భారత్-దక్షిణాఫ్రికా వాణిజ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా భారత్ వేగంగా వృద్ధి చెందుతోంది. మున్ముందు ప్రభుత్వం చేపట్టబోయే సంస్కరణలతో వృద్ధి వేగం మరింత పుంజుకోనుంది. భవిష్యత్ తరం మౌలిక సదుపాయాలతో నవ భారత్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని అన్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియాతో పాటు గడిచిన కొనేళ్లలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుతం భారత్ 2.6 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ప్రపంచంలోని ఆరో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, బ్రిటన్‌లు వరుసగా మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఏడాది భారత్ బ్రిటన్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి చేరుకొనే అవకాశం ఉంది.

మరికొన్నేళ్లు 7-7.5 శాతమే..

మరికొన్నేళ్లపాటు దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 నుంచి 7.5 శాతం శ్రేణిలోనే నమోదు కావచ్చని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) అంచనా వేసింది. అంతేకాదు, వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించుకోగలిగితే వృద్ధి రేటు ఒక శాతం మేర పెరుగుతుందని ఈ మండలి పేర్కొంది. ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రధాన మంత్రికి ఆర్థిక సంబంధిత సలహాలిచ్చేందుకు ఏర్పాటైన స్వతంత్ర మండలి ఇది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19) జీడీపీ వృద్ధి 7.2 శాతంగా నమోదుకావచ్చని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) అంచనా వేసింది.

235 మార్గాల్లో 'ఉడాన్' విమాన సేవలు

న్యూఢిల్లీ: ఉడాన్ పథకం కింద 235 మార్గాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 18 మార్గాల్లో సీప్లేన్‌లు సేవలు అందిస్తాయి. కొత్తగా మంజూరు చేసిన మార్గాల వల్ల ఇంత వరకూ విమానాలు రాకపోకలు లేని 16 విమానాశ్రయాలకు, వాటర్ ఎరోడ్రోమ్‌లకు కనెక్టివిటీ లభిస్తుందని విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. వార్షిక ప్రాతిపదికన 235 మార్గాల్లో 69.30 లక్షల సీట్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మూడో విడతలో మార్గాలను సొంతం చేసుకున్న కంపెనీల్లో స్పైస్‌జెట్, ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్, ఎయిరిండియా అనుబంధ సంస్థ అలయన్స్ ఎయిర్‌లు, టర్బో ఏవియేషన్‌లు తదితరాలు ఉన్నాయి.

ఉన్నత విద్యకు యూకే, ఆస్ట్రేలియా బెస్ట్



న్యూఢిల్లీ: భారత్‌లోని తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం అమెరికా, యూకే, ఆస్ట్రేలియా దేశాలను ఎంచుకుంటున్నారని హెచ్ఎస్‌బీసీ నివేదిక వెల్లడించింది. పిల్లల అంతర్జాతీయ విద్య కోసం ఈ మూడు దేశాల పట్ల తల్లిదండ్రులు అత్యంత మక్కువ చూపిస్తున్నారని తెలిపింది. అమెరికాను 52 శాతం మంది తల్లిదండ్రులు ఎంచుకోగా ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా (46 శాతం), యూకే (44 శాతం) ఉన్నాయని నివేదిక పేర్కొంది. వీటి తర్వాత విద్యాభ్యాసానికి కెనడా, జర్మనీ, సింగపూర్, న్యూజిలాండ్, జపాన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాల పట్ల మక్కువ చూపిస్తున్నారని తెలిపింది. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తే అంతర్జాతీయంగా వర్క్ ఎక్స్‌పీరియన్స్ సహా భాషలో పట్టు లభిస్తుందని తల్లిదండ్రులు భావిస్తున్నారని హెచ్ఎస్‌బీసీ ఇండియా రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ హెడ్ రామకృష్ణన్ వెల్లడించారు. కాగా అమెరికా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లో విద్య కోసం పెద్ద మొత్తంలో వెచ్చించాల్సి వస్తోందని భారత్‌లోని తల్లిదండ్రులు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో ఈ దేశాల్లోని తల్లిదండ్రులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయటం గమనార్హమని ఆయన చెప్పారు. ఆస్ట్రేలియా, కెనడా, మెయిన్‌లాండ్ చైనా, ఫ్రాన్స్, హాంకాంగ్, భారత్, ఇండోనేషియా, మలేషియా, మెక్సికో, సింగపూర్, తైవాన్, టర్కీ, యూఏఈ, యూకే, యూఎస్ దేశాల్లోని 10,478 మంది తల్లిదండ్రులు, 1,507 మంది విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి నివేదికను సిద్ధం చేసినట్లు రామకృష్ణన్ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఎస్‌టీవీ-269

హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రీపెయిడ్ మొబైల్ కస్టమర్ల కోసం ఎస్‌టీవీ-269ను అందుబాటులోకి తెచ్చింది. ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఇది అందుబాటులో ఉంటుంది. 269 ఎస్‌టీవీతో రీచార్జ్ చేసుకుంటే.. 2600 నిమిషాల ఉచిత వాయిస్ కాల్స్ (ఏ నెట్‌వర్క్‌కైనా)తోపాటు రోజుకు 2.6 జీబీ డేటా, 260 ఎస్ఎంఎస్‌లు (ఏ నెట్‌వర్క్‌కైనా) లభిస్తాయి. ఈ ఎస్‌టీవీ కాలపరిమితి 26 రోజులు.

గోద్రెజ్ నుంచి నీమ్ అగర్‌బత్తి

హైదరాబాద్: అనేక రకాల వ్యాధులకు కారణమయ్యే దోమలను ఇంటి నుంచి తరిమివేసే గుడ్‌నైట్ నేచురల్స్ నీమ్ అగర్‌బత్తీని గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ కంపెనీ మార్కెట్లోకి తెచ్చింది. ఇందులో వంద శాతం సహజ సిద్ధమైన ముడిపదార్థాలున్నాయని కంపెనీ పేర్కొంది. వేప, పసుపు కలిపి ఈ అగర్‌బత్తీలను కంపెనీ తయారు చేసింది. 10 అగర్ బత్తీలు కలిగిన ప్యాక్‌ను కంపెనీ రూ.15కు అందిస్తోంది. ఒక్కో అగర్ బత్తీ మూడు గంటలపాటు వెలుగుతుంది. ఈ పొగతో ఇంట్లోని దోమలు బయటకు వెళ్లిపోతాయని కంపెనీ తెలిపింది.

17 % తగ్గిన మారుతీ లాభం

డిసెంబరు త్రైమాసికంలో రూ.1,489 కోట్లు.. 8 శాతం పడిపోయిన షేరు

న్యూఢిల్లీ : దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) వరుసగా రెండో త్రైమాసికంలోనూ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మారుతీ నికర లాభం 17.21 శాతం తగ్గి రూ.1,489.30 కోట్లుగా నమోదైంది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.1,799 కోట్లుగా ఉంది. ఐదేళ్ల తర్వాత మారుతీ సుజుకీ త్రైమాసిక లాభాలు ఈ స్థాయిలో తగ్గటం ఇదే మొదటిసారి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 9.8 శాతం క్షీణించి రూ.2,240.4 కోట్లుగా నమోదైన సంగతి తెలిసిందే. పండగ సీజన్‌లో అంచనాలకు తగ్గట్టుగా అమ్మకాలు లేకపోవటం, కమోడిటీ ధరలు గరిష్ఠ స్థాయికి చేరటం, విదేశీ మారక రేట్లలో ఆటుపోట్లు డిసెంబరు త్రైమాసికంలో మారుతీ పనితీరుపై ప్రభావం చూపించాయి.

కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రాబడి 5.41 శాతం వృద్ధితో రూ.19,528.10 కోట్ల నుంచి రూ.20,585.60 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కార్ల విక్రయాలు స్వల్పంగా 0.6 శాతం తగ్గి 4,28,643 యూనిట్లుగా ఉన్నట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది. డిసెంబరు త్రైమాసికంలో పలు అంశాలు పనితీరుపై ప్రభావం చూపించాయని, దీంతో అంచనాలకు తగ్గట్టుగా ఫలితాలను ప్రకటించలేకపోయినట్లు ఎంఎస్ఐ తెలిపింది.

ఐదేళ్ల తర్వాత ఇప్పుడే..

మారుతీ సుజుకీ 2013-14 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో నికర లాభం 35.46 శాతం తగ్గింది. ఆ తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఈ స్థాయిలో నికర లాభం తగ్గటం ఇదే తొలిసారని కంపెనీ తెలిపింది. మార్కెట్ పరిస్థితులు బలహీనంగా ఉండటం పనితీరుపై ప్రభావం చూపించిందని ఎంఎస్ఐ పేర్కొంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ప్యాసింజర్ వాహన మార్కెట్ 8-10 శాతం వృద్ధి సాధిస్తుందని ఆటోమొబైల్ పరిశ్రమ సమాఖ్య సియామ్ అంచనా వేయగా.. తొలి మూడు త్రైమాసికాల్లో పరిశ్రమ కేవలం 4.4 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసింది.

రూ.15,739 కోట్ల మార్కెట్ క్యాప్ హరీ..

మారుతీ సుజుకీ ఇండియా ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా లేకపోవటంతో స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు 8 శాతానికి పైగా పడిపోయింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక దశలో 8.77 శాతం నష్టపోయి రూ.6,420 స్థాయిని చేరుకుంది. ఇది 52 వారాల కనిష్ఠ స్థాయి. చివరకు 7.4 శాతం నష్టంతో రూ.6,516.35 వద్ద క్లోజైంది. శుక్రవారం నాడు బీఎస్ఈ 30 బ్లూచిప్ షేర్లలో అత్యంత భారీగా నష్టపోయిన స్టాకుల్లో మారుతీ సుజుకీ ఒకటి.

కాగా ఎన్ఎస్ఈలో కూడా మారుతీ సుజుకీ షేరు 8.10 శాతం నష్టపోయి రూ.6,469.90 వద్ద స్థిర పడింది. షేరు పతనంతో బీఎస్ఈలో మారుతీ సుజుకీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,739.06 హరించుకుపోయి రూ.1,96,845.94 కోట్లకు చేరింది.



లాభాల స్వీకరణ

169 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ ముగింపు

ముంబై : స్టాక్ మార్కెట్ సూచీలు గరిష్ఠ స్థాయిలకు చేరిన నేపథ్యంలో ద్వితీయార్ధంలో సాగిన లాభాల స్వీకరణ మార్కెట్‌ను భారీ నష్టం బాట పట్టించింది. దీనికి తోడు దేశీయ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీ అత్యంత నిరుత్సాహపూరితమైన ఫలితాలు ప్రకటించడంతో ఆ షేరు 7.5 శాతం మేరకు నష్టపోవడం కూడా సూచీల ప్రారంభ లాభాలను తుడిచిపెట్టింది. యెస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, టీసీఎస్ షేర్ల మద్దతుతో సాధించిన లాభాలన్నీ ఆవిరైపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 500 పాయింట్ల పరిధిలోను, నిఫ్టీ 175 పాయింట్ల పరిధిలోను ఊగిసలాడాయి. ఉదయం వేళలో సెన్సెక్స్ 36474.48 పాయింట్లు, నిఫ్టీ 10931.70 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. కాని చివరికి సెన్సెక్స్ 169.56 పాయింట్ల భారీ నష్టంతో 36025.54 పాయింట్లు, నిఫ్టీ 69.25 పాయింట్ల నష్టంతో 10780.55 పాయింట్ల ముగిశాయి. వారం మొత్తంలో సెన్సెక్స్ 361 పాయింట్లు, నిఫ్టీ 126 పాయింట్లు నష్టపోయాయి. ఆసియా దేశాల షేర్లు పాజిటివ్‌గానే ముగిసినా అమెరికా, చైనా వాణిజ్య చర్చలపై అంతర్జాతీయ మార్కెట్లు అప్రమత్తతతో కూడిన ఆశావహ వైఖరి నెలకొందని విశ్లేషకులంటున్నారు. మారుతీ నికర లాభం భారీగా క్షీణించిందన్న వార్తలతో సెంటిమెంట్ తీవ్రంగాప్రభావితం అయిందని బ్రోకరేజీ వర్గాలన్నాయి. ఎంపిక చేసిన ఐటీ, ఫార్మా షేర్లు తప్ప అన్ని రంగాలూ తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయని ఈక్విటీ పరిశోధన సంస్థ ఆషికా గ్రూప్ ప్రెసిడెంట్ పారస్ బోత్రా అన్నారు. స్థూల మార్కెట్ ధోరణికి అనుగుణంగానే స్మాల్‌క్యాప్ సూచీ 1.58 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 1.20 శాతం నష్టపోయాయి.

- సెన్సెక్స్‌లో భారీగా క్షీణించిన షేర్లలో మారుతీ ప్రథమ స్థానంలో నిలవగా హీరో మోటోకార్ప్, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, మహీంద్రా, టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ షేర్లు కూడా 4 శాతానికి పైబడిన నష్టంతో ముగిశాయి.

యెస్ బ్యాంక్ 3 శాతం లాభం

యెస్ బ్యాంక్ కొత్త సారథిగా రవ్‌నీత్ సింగ్ గిల్‌ను ఎంపిక చేయడంతో ఆ షేరు 10 శాతం వరకు లాభపడింది. కాని చివరిలో లాభాల స్వీకారంతో 3 శాతం లాభానికే పరిమితమైంది. ఒక దశలో 10.49 శాతం లాభంతో రూ.239.30 పాయింట్లను తాకిన ఈ షేరు చివరికి 2.71 శాతం లాభంతో రూ.219.65 వద్ద ముగిసింది.

- హెచ్‌సీఎల్ టెక్, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్ కూడా 2.71 శాతం మేరకు లాభపడ్డాయి.
- రియల్టీ ఇండెక్స్ గరిష్ఠంగా 4.09 శాతం, ఆటో 3.14 శాతం నష్టపోయాయి. నష్టపోయిన ఇతర విభాగాల్లో మెటల్, యంత్రపరికరాలు, పీఎస్‌యూ, ఇన్‌ఫ్రా, బ్యాంకెక్స్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్ ఉన్నాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్, గ్యాస్ సూచీలు మాత్రమే పాజిటివ్‌గా ముగిశాయి.

భారీగా తగ్గిన ఇండియన్ బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్.. డిసెంబరు త్రైమాసికంలో నికర లాభం భారీగా తగ్గింది. మొండి బకాయిలు పెరిగిపోవటంతో మూడో త్రైమాసికంలో నికర లాభం రూ.303.06 కోట్ల నుంచి రూ.152.26 కోట్లకు తగ్గింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రాబడులు మాత్రం రూ.4,903.07 కోట్ల నుంచి రూ.5,269.10 కోట్లకు పెరిగాయి. కాగా బ్యాంకు స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 6.27 శాతం నుంచి 7.46 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు కూడా 3.3 శాతం నుంచి 4.42 శాతానికి పెరిగాయి. తృతీయ త్రైమాసికంలో మొండి పద్దుల కోసం రూ.973.88 కోట్లను కేటాయించినట్లు ఇండియన్ బ్యాంక్ వెల్లడించింది.

నెల్లూరు జిల్లాలో నాట్కో పురుగు మందుల ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఔషధాల తయారీ కంపెనీ నాట్కో ఫార్మా పంట పొలాల్లో చీడపీడలను నివారించే పురుగు మందుల ఉత్పత్తి రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం ఆంధ్ర ప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్‌లో మూల రసాయనాల(టెక్నికల్)తోపాటు వాటి నుంచి ఉత్పత్తి చేసే తుది పురుగు మందుల్ని (ఫార్ములేషన్స్) తయారు చేస్తారు. రూ.100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ ఈ సంవత్సరాంతానికల్లా ఉత్పత్తి ప్రారంభిస్తుందని కంపెనీ తెలిపింది. ఔషధ రసాయనాల అభివృద్ధి రంగంలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలు, వ్యవసాయ పురుగు మందుల అభివృద్ధికీ కలిసి వస్తాయని నాట్కో ఫార్మా భావిస్తోంది.

ఇమామీ చేతికి జర్మనీ బ్రాండ్

కోల్‌కతా: జర్మనీలోని ప్రముఖ పర్సనల్ కేర్ బ్రాండ్ 'క్రీమ్21'ను ఇమామీ సొంతం చేసుకుంది. దాదాపు 1.1-1.2 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.78 కోట్లు) ఈ బ్రాండ్‌ను ఇమామీ కొనుగోలు చేసింది. ఇంత మొత్తం చెల్లించి ఒక విదేశీ బ్రాండ్‌ను ఇమామీ కొనుగోలు చేయడం ఇదే ప్రథమం. ఈ బ్రాండ్ ఉత్పత్తులను త్వరలో భారత్‌లో ప్రవేశపెట్టే వీలుంది. అంతర్గత నిధులతో దీన్ని కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది.

ఐపీపీబీ 1.25 లక్షల శాఖలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 1.25 లక్షల ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీ బీ) శాఖలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ (డీఓపీ) ప్రారంభించింది. త్వరలోనే ఈ శాఖల సంఖ్య 1.50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు ఒకటిన ఐపీపీబీని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దీని ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రతి పౌరునికి దగ్గర చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మూడు లక్షల మంది పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్‌ల ద్వారా బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నారు.

ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు చుక్కెదురు

దివాలా చట్టానికి అనుకూలంగా 'సుప్రీం' తీర్పు

ముంబై : ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల రుణాలు ఎగవేసే పారిశ్రామికవేత్తలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వీరి నుంచి బకాయిల వసూలు కోసం మోదీ సర్కార్ 2016లో తీసుకొచ్చిన దివాలా చట్టాని (ఐబీసీ)కి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఇద్దరు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. ఎన్‌సీఎల్‌టీకి చేరిన తమ కంపెనీల ఆస్తుల కొనుగోలు కోసం ప్రమోటర్లు పోటీపడడాన్ని నిషేధించే నిబంధననూ సుప్రీంకోర్టు సమర్థించింది. దీంతో కావాలని రుణాలు ఎగ్గొట్టిన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తల నుంచి బ్యాంకులకు రావలసిన వేల కోట్ల రూపాయల బకాయిలు వసూలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. రుణాలు చెల్లించక పోవడంతో బ్యాంకులు ఇప్పటికే అనేక కంపెనీలను ఎన్‌సీఎల్‌టీకి లాగాయి. అక్కడ కూడా కేసులు ఎటూ తేలకుండా పారిశ్రామికవేత్తలు రకరకాల పన్నాగాలు పన్నుతున్నారు. వాస్తవానికి దివాలా చట్టం ప్రకారం ఎన్‌సీఎల్‌టీకి వచ్చిన కేసులు 270 రోజుల్లో పరిష్కారం కావాలి. అయితే ఎస్సార్ స్టీల్ వంటి కేసులు 500 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు. సుప్రీం కోర్టు తాజా తీర్పుతో ఈ కేసులు వేగంగా పరిష్కారమయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎల్లకాలం తప్పించుకోలేరు : జైట్లీ

సుప్రీం కోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ హర్షం వ్యక్తం చేశారు. 'సుప్రీం కోర్టు తీర్పు ఆహ్వానించదగిన పరిణామం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వ్యక్తులు వాటిని ఎగవేసి ఇక ఎక్కువ కాలం తప్పించుకు తిరగలేరు' అని ట్వీట్ చేశారు.

ఎయిర్‌ఏషియా పండగల ఆఫర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమాన ప్రయాణికులకు ఎయిర్‌ఏషియా పండగల ఆఫర్‌ను ప్రకటించింది. దేశీయ ప్రయాణానికి రూ.899, అంతర్జాతీయ గమ్యస్థానాలకు రూ.2,399 చార్జీలను నిర్ణయించింది. ముందుగా బుక్ చేసుకుని తక్కువ ధరకు ప్రయాణించడానికి వీలుగా ఈ ఆఫర్‌ను ప్రకటించినట్లు కంపెనీ తెలిపింది. సాధారణంగా పండుగలకు 6-8 నెలల ముందే ఎక్కడకు వెళ్లాలనే దాన్ని ప్రయాణికులు నిర్ణయించుకుంటారని, టికెట్లను ముందుగా బుక్ చేసుకునే సంస్కృతి దేశంలో పెరుగుతోందని ఎయిర్‌ఏషియా ఎండీ, సీఈఓ సునీల్ భాస్కరన్ తెలిపారు. ఆఫర్ కింద జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకూ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. 2019, ఆగస్టు 1 నుంచి 2020, ఫిబ్రవరి 3 వరకూ ప్రయాణించే వారికి ఈ ఆఫర్ వర్తిస్తుంది.

ఎల్ అండ్ టీ రాబడి రూ.35,709 కోట్లు

ముంబై : లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ రాబడులు 24.22 శాతం వృద్ధి చెంది రూ.35,708.87 కోట్లకు చేరుకున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో మొత్తం రాబడులు రూ.28,745 కోట్లుగా ఉన్నాయి. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 26.19 శాతం పెరిగి రూ.2,041.62 కోట్లకు చేరుకుందని ఎల్ అండ్ టీ తెలిపింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.1,617.88 కోట్లుగా ఉంది. సర్వీస్ వ్యాపారంతో పాటు ప్రాజెక్టుల వ్యాపారాన్ని సమర్థవంతంగా నిర్వహించటంతో మెరుగైన ఫలితాలను రాబట్టుకోగలిగినట్లు కంపెనీ పేర్కొంది. త్రైమాసిక కాలంలో గ్రూప్ స్థాయిలో కొత్తగా రూ.42,233 కోట్ల ఆర్డర్లను అందుకున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ రెవెన్యూలు 32 శాతం వృద్ధి చెంది రూ.11,476 కోట్లకు చేరుకున్నాయని ఎల్ అండ్ టీ వెల్లడించింది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,380	33,260	33,350	33,100	32,390
క్రితం ముగింపు	33,380	33,300	-	33,150	32,360
22 క్యారెట్లు	30,910	30,850	30,680	30,710	30,920
క్రితం ముగింపు	30,910	30,850	-	30,710	30,890
వెండి (కిలో)	39,900	40,200	39,800	40,000	42,200
క్రితం ముగింపు	39,900	40,300	-	40,000	42,100

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60 | నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	402	చిత్తూరు	423
వరంగల్	404	చెన్నై	430
విజయవాడ	417	నమక్కల్	420
గోదావరి	417	బెంగళూరు	420
విశాఖపట్నం	417	ముంబై	457

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	79	విజయవాడ	80
కరీంనగర్	80	గుంటూరు	81
వరంగల్	79	ఒంగోలు	82
మహబూబ్‌నగర్	79	చిత్తూరు	88
కర్నూలు	79	నెల్లూరు	88
విశాఖపట్నం	77	అనంతపురం	80
గోదావరి	78		

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .63(.63)780
ADITYA SPIN. 5.41(5.69)75
AGRO TECH FO 579.2(605.4)819
AISHWARYA TE 2.85(2.99)2135
ALPHAGEO (I) 465.2(470.05)469
ALU FLUORIDE 102.15(112.5)21181
AMAR RAJA BA 764.65(775.35)10080
ANDHRA BANK 26.65(27)27759
ANDHRA CEMEN 4.87(5.1)7941
ANDHRA PETRO 58.7(59.75)70031
ANJANI PORTL 115.55(119.75)442
ASTRA MICRO 79.65(80.4)9806
AUROB.PHARMA 783.4(787.8)292875
AVANTEL LTD 222.1(222)2384
AVANTI FEEDS 349.4(358.7)17206
B.N.RATHI SE 24.75(25.05)450
BALAJI AMINE 461.45(480.3)6340
BAMBINO AGRO 178.85(183)641
BARTRONICSIN 6.61(6.74)2954
BCG 2.96(3.03)30228
BHAGIRA.CHEM 431.35(430)3274
BHAGYA INL 34.25(34.8)1751
BHARATFIN 944.95(944.1)9454
BNR UDYOG 17.67(18.03)5
CAMBRIDGE 43.1(45.4)3982
CCHHL 6.97(7.29)3312
CCL PRODUCTS 269.55(273.75)673
CELESTIAL 7.35(7.55)3391
CIL SECURITS 14.9(15.15)3000
COROM INTER 440.05(443)3553
CUBEX TUBING 14.2(14.62)1001
CYBERMATE 1.88(1.96)75203
CYIENT 597.35(591.95)5868
DANLAW TECH. 90.65(94.5)2188
DECAN CEMENT 391(391)500
DIAMONPOWER 1.45(1.5)6
DIVI'S LAB. 1493(1494.85)16539
DIVYA.GRANIT 98.7(102.9)2786
DQ ENT 7.05(7.14)100
DR.REDDY'S 2668.9(2666.2)13546
EMPEE SUGARS 1.4(1.47)2079
EVEREST ORG. 146.3(127.15)62333
FACOR ALLOYS 2.21(2.15)70564
FIRSTOBJ 8.71(9.16)600
GATI LTD. 75.4(76.4)55181
GAYATRI BIO 2.44(2.56)1
GAYATRI PROJ 167.25(166.4)743
GENNEX LAB 3.25(3.49)236260
GMR INFRASTR 15.65(15.95)576316
GODAVARI DRU 21.35(22.05)412
GOLDSTONE EN 13.25(13.7)2770
GRANULES (I) 95.1(96)207823
GVK POWERINF 6.91(6.87)267680
HBL P SYS 25.95(26.7)15178
HERITGFOOD 504.4(515.85)1292
INCAP LTD. 40(38.85)201
IPAPPM 421.4(432.65)3499
IVRCL LTD .94(.96)61763
KAKATIYA CEM 186.85(188.35)12132
KALLAM 17.35(16.95)7425
KAVERI SEED 591.25(578)46369
KCP LTD 86.2(86.35)4201
KERNEX MICRO 25.6(25.65)2991
KNR CONST 210.45(210.55)2815
KREBS BIOCHM 117.45(112.1)355
LOKESH MACH 44.05(44.15)220
LOTUS CHOC 22.85(23.25)1637
MADHUCON PRJ 6.29(6.73)8058
MOLD-TEK TEC 48.6(50.25)9432
MOSCHIP SEMI 21.55(21.4)18513
MSR INDIA 10.12(10.58)4002
N C L IND. 124.35(126.3)1214
NACLIND 27.25(27.5)5428
NCC 81.6(83.9)569131
NEHA INTER. 4.12(4.3)39554
NETTLINX LTD 45.2(44.65)6798
NEULAND LAB. 493.45(504.95)92
NIHAR INFO 10.85(11.4)1850
NILE LTD. 343.35(348.3)2982
NTL 1.3(1.26)1000
OIL COUNTRY 13.6(14)1829
OLECTRA 222.8(238.1)9134
PADMALAYA TE 2.12(2.23)1126
PALRED 38(37.85)149
PANYAM CEMEN 11.59(11.92)654
PENNAR STEEL 36(37)17026
PFL INFOTECH 8.33(8.49)100
PITTIENG 55.65(55.85)4601
POKARNA LTD 164.45(172.75)3165
PRAJAY ENGS. 8.18(8.5)3278
PREMIER EXPL 255.15(252.8)14858
PRSMJOHNSN 76.25(79.4)22525
RAIN 114.65(119.45)192456
RAJ PACKAGIN 26.5(28.4)4303
REG.CERAMIC 4.04(4.25)686
RESTILE CER. 4.2(3.82)2473
SAGAR CEM. 612.1(644)320
SAMKRG PIST. 186.65(182.75)3351
SAMPRE NUTRI 42.45(40.45)1
SANGHI IND. 57.8(57.5)7321
SATVAH.ISPAT 9.02(9.11)6923
SAVEN TECHNO 28(28.3)3030
SIBAR AUTO 29(29.45)47
SMPL .37(.38)6220
SMS PHARMACE 69.75(71.95)1559
SREE RAYALA 152.55(152.05)2604
STEEL EXCH 12.95(13.25)3480
SUJANA INDUS .3(.3)6666
SURANATP 4.19(4.05)100
SURYACHAKRA .27(.28)49926
SURYAMBA SP 66.3(67)18
SURYLAK.COTT 42(40.2)2183
SUVEN LIFE S 193.4(202.1)58670
TAJ GVK HOTL 179.55(182.45)689
TANLA 31.7(32.85)68319
TRANSCORP IN 24.5(25.5)17634
TRANSGENE BI 5.7(5.81)6841
TRANSPORT CO 289.45(290.3)1701
USHER AGRO 2.27(2.38)20001
VICEROY HOTE 3.83(3.83)31866
VIJAY TEXTIL 39(40.25)2200
VIMTA LABS 257.9(265.4)7652
VIRAT CRANE 31(32.5)747
VIRINCHI 73.05(77.4)28067
VISAKA IND. 375.15(393.6)6533
VISTA PHARMA 26.45(27.2)2311
VST INDUS. 3201.3(3208.5)32
WATERBASE 151.25(153.1)62811
XLENERGY 1(1.03)2000
ZEN TECH 83.4(85.55)7958
ZENOTECH 30.2(32.4)6719

ఎన్ఎస్ఈ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 602(601.75)12774
AARTIIND 1547.5(1557.3)41073
ABAN 69.75(71.55)392720
ABB 1254.6(1258.35)34335
ABFRL 200.4(202.95)450004
ABGSHIP 1.85(1.9)45068
ACC 1375(1419.7)533516
ADANIENT 137.35(142.55)3297651
ADANIPORTS 373.85(380.95)4760625
ADANIPOWER 49.15(52.1)14778257
ADANITRANS 207.9(202.95)448644
AEGISCHEM 196.95(194.8)80747
AHLUCONT 280.8(290.15)7368
AIAENG 1612.1(1627.55)24094
AJANTPHARM 1126.85(1164.65)250199
AKZOINDIA 1725.1(1725.2)2441
ALBK 43.4(43.15)2882673
ALLCARGO 106.8(107.45)50105
ALOKTEXT 3.75(3.75)2468194
AMARAJABAT 766.65(776.4)195143
AMBUJACEM 202.35(211.2)2945463
ANANTRAJ 33.1(34.15)269514
ANDHRABANK 26.55(26.95)825825
APARINDS 615.4(615.55)893
APLLTD 589.7(588.55)35773
APOLLOHOSP 1292.3(1314.65)571327
APOLLOTYRE 210.75(216.8)2218748
ARVIND 86.75(89.55)1792348
ASHIANA 112.2(113)18986
ASHOKA 123.55(120.95)48586
ASHOKLEY 82.6(84.8)24874754
ASIANPAINT 1372.15(1401.85)1613548
ASTRAL 1030.15(1055.35)39464
ASTRAZEN 1600.15(1612.35)11093
ATUL 3472.65(3526.7)62966
AUROPHARMA 786.15(788.8)1464004
AXISBANK 669.75(663.65)6628922
BAJAJ-AUTO 2626.35(2651.65)304062
BAJAJCON 344.55(355.55)43130
BAJAJELEC 454.65(459.05)72027
BAJAJFINSV 6321.55(6407.3)92525
BAJAJHIND 8.3(8.7)1651186
BAJAJHLDNG 2861.8(2939.8)11730
BALKRISIND 829.25(847.5)467349
BALLARPUR 3.75(3.95)1222508
BALMLAWRIE 189.15(185.7)49683
BALRAMCHIN 103.1(106.3)1327533
BANKBARODA 110.2(113)8760153
BANKINDIA 94.45(97.3)7123775
BASF 1370.15(1407.9)8434
BATAINDIA 1124.2(1152.85)479782
BBTC 1213.95(1209.35)156750
BEML 848.6(870.75)1442737
BERGEPAINT 313.95(322.75)1022976
BFUTILITIE 204.05(205)547579
BGRENERGY 54.45(55.85)30363
BHARATFIN 944.05(947.75)168096
BHARATFORG 479.6(475.8)1453797
BHARTIARTL 307.5(301.65)5443641
BHEL 66.4(69.05)7134722
BIOCON 664.7(670.1)8429182
BIRLACORPN 504.4(523.3)58672
BLISSGVS 156.25(159.65)1022656
BLUEDART 2996.8(2992.2)71297
BLUESTARCO 607.4(607.4)211230
BOMDYEING 112.3(116.75)665464
BOSCHLTD 18526.25(19155.4)19282
BPCL 357.45(353.95)1934416
BRFL 8.5(8.65)49139
BRIGADE 206.55(211.65)60972
CADILAHC 343.7(346.1)784074
CANBK 254.35(262.3)4039492
CARERATING 989.1(1007.55)23297
CASTEXTECH 1.05(1.05)318682
CASTROLIND 164.25(162.9)1577961
CCL 270.45(273.85)12936
CEATLTD 1188.9(1219.75)294685
CENTRALBK 32.7(32.5)227198
CENTURYPLY 166.15(167.95)109964
CENTURYTEX 836.6(871.3)779079
CERA 2510(2576.65)4171
CESC 688.3(685.45)736784
CHAMBLFERT 163(166.55)163994
CHENNPETRO 256.75(262.9)442051
CHOLAFIN 1147.85(1159.45)202546
CIPLA 507.65(500.7)1193442
CLNINDIA 396.25(396.15)11400
COALINDIA 220.95(223.85)3432012
COLPAL 1288.3(1321.9)786966
COROMANDEL 440.3(443.95)98745
CORPBANK 26.55(27)113175
COX&KINGS 154.3(159.7)69673
CRISIL 1646.45(1647.65)3679
CUB 188.8(190.05)821492
CUMMINSIND 830.6(824.7)845339
CYIENT 599.55(592.05)63624
DABUR 430(430.4)1819072
DBCORP 174.55(178.1)36847
DBREALTY 26.3(27.05)94644
DCBBANK 180.4(181.85)1074193
DCMSHRIRAM 315.05(327.65)50561
DEEPAKFERT 113.1(106.1)5067761
DELTACORP 231.8(236.3)547790
DEN 71.45(71.45)981560
DENABANK 12.65(12.85)851561
DHANUKA 415.05(403.55)10332
DHFL 209.1(207.65)26135632
DISHTV 22.4(33.55)106916496
DIVISLAB 1495.35(1493.25)195017
DLF 158(177.75)20781142
DREDGECORP 407.5(420.25)242530
DRREDDY 2672.4(2668.45)609282
DYNAMATECH 1398.15(1440)509
ECLERX 1055.25(1071.3)2275
EDELWEISS 158.8(151.75)3581020
EICHERMOT 20049.95(20115.6)67189
EIDPARRY 200.1(202.75)106170
EIHOTEL 181.3(179.9)64908
ELECTCAST 21.05(21.35)138843
ELGIEQUIP 250.95(250.1)16874
EMAMILTD 418.95(418.8)81317
ENGINERSIN 112.3(117.2)1488229
EROSMEDIA 79.5(80.65)393166
ESCORTS 703.05(715.55)1767197
ESSDEE 15.75(16.35)34249
ESSELPACK 96.15(116.9)946512
EVEREADY 212.3(217.35)81835
EXIDEIND 230.15(233.2)2131066
FCONSUMER 39.6(40.05)1232268
FDC 160.3(164.6)28581
FEDERALBNK 86.5(88.9)9564881
FINCABLES 424.45(423.45)25653
FINPIPE 530.05(530.5)124072
FLFL 420.85(413.45)44641
FORTIS 135.4(136.35)524340
FSL 47.95(48.9)1467054
GAIL 334.9(333.6)3615927
GATI 75.35(76.4)365494
GDL 97.25(100)252605
GEPIL 801.25(812.7)24236
GESHIP 289.9(291.05)23991
GET&D 288.05(295.7)35008
GILLETTE 6496.9(6499.3)1989
GLAXO 1402.4(1406.25)9285
GLENMARK 646.9(649.75)273361
GLOBOFFS 13.8(13.35)8806
GMDCLTD 85.05(84.7)75714
GMRINFRA 15.65(15.95)9927876
GODFRYPHLP 945.8(958.25)150511
GODREJCP 780.3(790.6)1154910
GODREJIND 516.7(522.45)211745
GODREJPROP 745.3(742.45)175930
GPPL 88.95(87.75)100175
GRANULES 94.7(96.3)1947917
GREAVESCOT 118.1(120.35)118596
GREENPLY 131.05(134.25)24968
GRINDWELL 567.8(569.95)19863
GRUH 227.1(223.2)1146126
GSFC 97.75(105.35)6346019
GSKCONS 7290.6(7255.35)11819
GSPL 181.3(179.7)236507
GUJFLUORO 879.95(887.05)117446
GULFOILLUB 856.75(855.55)5028
GVKPIL 6.9(6.95)1026416
HATHWAY 31.9(31.9)976232
HAVELLS 708.15(702.6)1994088
HCC 13.1(13.25)4625266
HCL-INSYS 20.4(20.95)552774
HCLTECH 969.4(946.45)2155004
HDFC 1977.8(1971.1)2240491
HDFCBANK 2096(2102.25)2815559
HDIL 27.65(27.45)5014896
HEIDELBERG 148.15(148.7)195090
HEROMOTOCO 2670.15(2790.2)775065
HEXAWARE 324(326.35)1193798
HFCL 21.9(22.3)2104293
HIMATSEIDE 211.95(212.5)28200
HINDALCO 204.45(205.05)4381964
HINDCOPPER 46.25(47.2)441874
HINDPETRO 241.8(243.1)4234919
HINDUNILVR 1756.8(1759.5)1131790
HINDZINC 250.4(257.95)1090204
HMT 16.95(17.75)6395
HMVL 118.5(119.95)5793
HONAUT 21932.1(21797.9)489
HOTELEELA 14.55(14.9)176555
HSIL 236.45(234.55)60386
HTMEDIA 40.1(41.85)114803
IBREALEST 81.75(84.05)1563847
IBULHSGFIN 744.5(773.5)5757364
ICICIBANK 357.2(364.8)22978238
ICRA 3051.35(3092.25)712
IDBI 54.9(56.05)2843142
IDEA 32.85(34.05)23369945
IDFC 40.8(42.45)6941009
IFBIND 841.65(863.25)5513
IFCI 13.7(13.95)2265098
IGARASHI 519.25(525.15)3194
IIFL 439.6(448.6)229810
IL&FSTRANS 9.05(9.35)318766
INDHOTEL 133.5(135.65)666303
INDIACEM 80.75(83.7)3796314
INDIANB 238.4(255.95)5812134
INDOCO 182.15(202.95)43722
INDUSINDBK 1484.9(1490.3)1738412
INEOSSTYRO 655.65(661.4)1703
INFRATEL 279.75(263)11828569
INFY 730.35(732)5543112
INGERRAND 589.7(596.55)11353
INOXLEISUR 251.75(248.05)283829
INOXWIND 69.1(71.6)82688
INTELLECT 206.85(212.35)267177
IOB 14(13.9)1605622
IOC 137.75(136.8)6255229
IPAPPM 424.5(432.1)36532
IPCALAB 779.95(784.35)92588
IRB 148.95(143.35)2458901
ITC 279.2(278.9)8897906
J&KBANK 39.1(39.1)2346898
JAGRAN 104.15(107.45)66831
JAICORPLTD 103.05(106.7)433920
JBCHEPHARM 308.25(318)26406
JBFIND 19.95(20)32763
JCHAC 1772(1780.05)391
JETAIRWAYS 253.05(265.85)6740359
JINDALPOLY 249.7(249.45)18212
JINDALSTEL 137.4(141.65)9029891
JISLJALEQS 59.25(60.6)13278519
JKCEMENT 710.1(716.95)44200
JKIL 115.25(116.95)50839
JKLAKSHMI 291.95(293.8)123730
JKTYRE 95.9(95.5)330621
JMFINANCIL 82.65(83.3)192592
JPASSOCIAT 6.65(6.75)15530644
JPINFRATEC 3.5(3.5)1709824
JPPOWER 1.95(1.95)1399544
JSWENERGY 66.8(67.8)403212
JSWHL 2690.75(2648.7)4974
JUBILANT 707.5(723.2)189633
JUBLFOOD 1197.85(1179.65)2819854
JUSTDIAL 476.85(482.55)1624251
JYOTHYLAB 178.35(179.9)509088
KALPATPOWR 371.75(375.6)24513
KANSAINER 449.05(454.4)67376
KEC 247.7(253)195797
KESORAMIND 77.2(78.5)125220
KIRLOSENG 188.15(180.4)101046
KITEX 102.9(104.95)26497
KOLTEPATIL 261.65(265.25)203626
KOTAKBANK 1266.15(1267.75)1441296
KPIT 112.4(128.95)17465748
KRBL 359.4(353.15)288909
KSCL 590.35(576.75)1159204
KSK 1.4(1.45)792217
KTKBANK 117.45(120.7)1549920
KWALITY 6.9(7)1177737
L&TFH 134.65(137.5)5569523
LAKSHVILAS 68.5(69.35)233490
LAOPALA 214.65(215.5)4901
LAXMIMACH 5403.1(5461.35)1488
LICHSGFIN 453.05(469.6)1484734
LT 1285.45(1295.35)3136788
LUPIN 865.05(868.4)1345215
M&M 683.5(697.3)3421228
M&MFIN 416.9(422.25)2237094
MAGMA 103.2(102.6)50873
MAHINDCIE 232.25(231.8)194520
MAHLIFE 410.7(414.35)39542
MANAPPURAM 98.85(99.05)1700957
MANPASAND 78.55(80.5)177098
MARICO 369.9(373.95)1340306
MARKSANS 26.55(27.1)588764
MARUTI 6513.4(7040.6)3062762
MAYURUNIQ 370.85(371)9032
MCLEODRUSS 102.85(106.55)61519
MERCK 3213.7(3306.2)14781
MHRIL 205.05(205.7)32408
MINDACORP 145.65(147.15)48663
MINDTREE 886.1(910.4)2686280
MMTC 27.1(27.9)508498
MOIL 158.75(160.95)76021
MONSANTO 2538.35(2542.7)1298
MOTHERSUMI 150.8(154.05)3434367
MOTILALOFS 646.2(643.3)81313
MPHASIS 920.9(921.25)561635
MRF 63920.95(64902.75)3105
MRPL 68.5(69.65)613706
MTNL 14.25(14.7)926291
MUTHOOTFIN 534.5(541.1)417368
NATCOPHARM 674.65(680.55)120708
NATIONALUM 60.55(61.85)4271326
NAUKRI 1691.05(1715.6)206606
NAVKARCORP 46.5(48)126749
NCC 81.7(83.85)6704875
NETWORK18 36.6(37.25)244245
NHPC 25(25.3)2218123
NIITTECH 1294.7(1300.7)1201212
NITINFIRE 1.6(1.55)20176
NLCINDIA 68(67.65)137760
NMDC 90.5(90.1)2936155
NTPC 138.3(140.05)4552697
OBEROIRLTY 457.3(471.7)638118
OFSS 3708(3796.4)18300
OIL 171.85(170)1337495
OMAXE 211.9(212.95)271269
ONGC 142(141.7)3871762
ORIENTBANK 93.7(93.45)3138818
ORIENTCEM 71.8(75.55)54099
ORISSAMINE 795.5(832.35)5849
PAGEIND 22758.2(23172.95)51149
PARSVNATH 6.7(6.8)97182
PCJEWELLER 75.95(76.75)8640033
PEL 2299.2(2307.75)372935
PERSISTENT 561.95(551.9)580614
PETRONET 227.05(226.3)1735213
PFC 103.2(104.75)4554861
PFIZER 2762.65(2682.55)103684
PFS 15.9(16.2)327111
PGHH 9928.85(9921.3)808
PHOENIXLTD 602.9(615.2)101729
PIDILITIND 1129.8(1109.35)1102595
PIIND 850.85(853.2)30145
PNB 76.6(78.1)19763289
POWERGRID 185.85(186.75)2175999
PRAJIND 121.3(131.75)3833174
PRESTIGE 206.25(213.95)99342
PRSMJOHNSN 76.25(79.25)86743
PTC 85.7(85.45)1192474
PUNJLLOYD 3.2(3.35)517121
PURVA 73.05(75.15)76906
PVR 1561.8(1600.4)451491
RADICO 420.8(427.95)1045999
RAIN 114.85(120.25)854025
RAJESHEXPO 584.55(574)274953
RALLIS 162.3(163.9)214453
RAMCOCEM 579.25(599.7)407804
RAMCOSYS 245.05(240)79989
RATNAMANI 885.25(890.45)15164
RAYMOND 774.4(796.15)944678
RCF 61.95(62.2)832301
RCOM 12.45(12.85)27002942
RECLTD 120.7(122.5)5955399
REDINGTON 69.25(73.75)334298
RELAXO 720.6(723.1)16813
RELCAPITAL 209.25(212.55)4595655
RELIANCE 1246(1247.45)8550836
RELINFRA 270.7(282.15)3347714
RENUKA 10.55(10.65)351022
REPCOHOME 408.7(407.95)841623
RIIL 323.45(327)100087
RKFORGE 501.15(488.75)62276
RNAVAL 12.1(12.55)903019
ROLTA 6.35(6.65)288678
RPOWER 28.05(28.85)12002432
RTNPOWER 3.6(3.6)2005243
RUCHISOYA 7.35(7)817462
SADBHAV 199.3(200.05)451925
SADBHIN 92.65(92.35)2124
SAIL 47.25(48.25)9383714
SANOFI 6277.95(6403.45)16531
SBIN 285.4(288.05)11121223
SCHAEFFLER 5345.3(5401.95)8118
SCHNEIDER 90.85(92.35)29543
SCI 42.05(42.75)124020
SHARDACROP 305.55(303.35)43917
SHILPAMED 391.6(405.7)25162
SHK 169.4(170.75)8114
SHOPERSTOP 517(519.8)9315
SHREECEM 15723.2(16170.55)34071
SHRIRAMCIT 1742.65(1723.85)2588
SIEMENS 1029.75(1027.95)213256
SIMPLEXINF 167.8(168.5)69186
SINTEX 10.9(11.1)2637467
SITINET 8.65(9.2)140701
SJVN 25.8(25.8)311349
SKFINDIA 1926.75(1924.85)9188
SMLISUZU 601.7(611.15)5432
SNOWMAN 32.8(32.7)97370
SOBHA 490.15(502.5)96375
SOMANYCERA 344.1(350.25)20895
SONATSOFTW 318.3(321)116743
SOUTHBANK 13.45(13.8)13275228
SPARC 167.95(171.95)746036
SREINFRA 30.25(31.1)5478948
SRF 2076.35(2094.9)379924
SRTRANSFIN 1120.15(1114.55)1191243
STAR 518.6(530.85)1048270
STCINDIA 116.95(121.7)72408
SUNDARMFIN 1453.1(1450.7)158813
SUNDRMFAST 520.05(524.55)34054
SUNPHARMA 422.4(423)8720973
SUNTV 505.85(527)3808529
SUPREMEIND 997.9(1045.85)87015
SUVEN 194.15(202.5)393294
SUZLON 5.05(5.15)12922568
SWANENERGY 97.95(100.5)182604
SYMPHONY 1206.5(1230.45)139602
SYNDIBANK 34.9(35.55)3223568
SYNGENE 588.85(588.9)98010
TAKE 143.4(148.45)95152
TATACHEM 682.45(689.2)489577
TATACOFFEE 92.6(93.8)353360
TATACOMM 493.15(521.6)994637
TATAELXSI 912.8(933.3)798253
TATAGLOBAL 207.05(210.8)1723705
TATAMOTORS 173.25(175.4)12136892
TATAMTRDVR 90.45(92.75)3230496
TATAPOWER 73.95(74.55)3724093
TATASPONGE 695.9(713.05)48066
TATASTEEL 452.9(460.75)4157967
TATASTLBSL 32.7(33.5)313581
TBZ 61.4(63)33890
TCS 1920.8(1901.55)2327080
TECHM 729.05(727.75)2528541
TEXRAIL 55.65(56.4)348965
THERMAX 1130.55(1114.95)87351
THOMASCOOK 220.9(221.2)70689
TIDEWATER 5233.55(5302.45)495
TIMKEN 550.85(556.4)6797
TITAN 978(969.65)1985833
TNPL 230(230.1)24665
TORNTPHARM 1861.65(1889.05)156709
TORNTPOWER 251.4(258.5)1071678
TREEHOUSE 4.35(4.55)16157
TRIDENT 65.65(66.4)655221
TRITURBINE 106.55(109.15)49462
TTKPRESTIG 7754.85(7848.9)2280
TTML 3.85(3.9)586506
TV18BRDCST 32.55(34.05)6016400
TVSMOTOR 496.1(521.75)2404333
TVSSRICHAK 2361.45(2390.1)1398
TVTODAY 345.45(361.55)24741
UBL 1427.8(1448.3)423833
UCOBANK 19.15(19.7)347742
UFLEX 255.2(260.05)27972
ULTRACEMCO 3510.8(3790.7)1593195
UNICHEMLAB 204.55(205.15)18847
UNIONBANK 79.45(82.5)9353149
UNITECH 1.7(1.75)2450732
UPL 753.1(747.35)1770239
VAIBHAVGBL 685.35(701.35)12324
VAKRANGEE 43.2(44.7)9052094
VEDL 194.7(193.5)6437316
VIDEOIND 2.95(2.9)258586
VIJAYABANK 43.7(45)1797187
VINATIORGA 1567.25(1580.95)8510
VIPIND 478.25(481.05)218866
VOLTAS 532.45(538.7)750228
VRLLOG 259.55(260.85)26586
VSTIND 3201.2(3203.8)1686
VTL 1070(1073.05)5094
WABAG 295.25(292.1)170894
WABCOINDIA 6262.5(6459.75)4494
WELCORP 105.25(111)700055
WELSPUNIND 57.3(59.15)582461
WHIRLPOOL 1458.45(1480.5)26937
WIPRO 353.45(351.75)5236553
WOCKPHARMA 478.9(483.6)766588
WONDERLA 285(272.65)193429
ZEEL 318.4(433.85)74261004
ZEELEARN 27.35(33.8)1220306
ZYDUSWELL 1301.4(1305.35)4086





ఇబ్రహీంపట్నం వైపు పెరిగిన

రియల్ బూమ్

ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనతో పెరిగిన జోరు.. జాతీయ రహదారుల వెంట ఎకరా రూ.6 కోట్లు !

పశ్చిమ కృష్ణాలో ర్యాపిడ్ గ్రోత్ ఏరియా. ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనతో ఇప్పుడు నవ్యాంధ్ర రాజధాని అమరావతికి ముఖ ద్వారంగా నిలవబోతున్న ప్రాంతం. అదే ఇబ్రహీంపట్నం. ఈ ప్రాంతంలో నెలకొన్న స్థిరాస్తి జోరుపై ఈ వారం ప్రత్యేక కథనం..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇబ్రహీంపట్నం. విజయవాడకు దగ్గరగా, రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో కృష్ణానది ఈవల ఉన్న ప్రాంతం. ఇక్కడ ఐకానిక్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శంకుస్థాపన చేసి, వెంటనే పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఒక్కసారిగా ఈ ప్రాంతంలో రియల్ బూమ్ ఏర్పడింది. ఐదేళ్ల క్రితం నాటి రియల్టీ జోష్ మళ్లీ కనిపిస్తోంది. ఈ వంతెన శంకుస్థాపనతో ఇప్పటి వరకు ఈ ప్రాంత రియల్టీ రంగం ఎదుర్కొన్న స్తబ్దత వీడింది.

భారీగా ధరలు

విజయవాడ శివారు భవానీపురం నుంచి గొల్లపూడి, గుంటుపల్లి, రాయనపాడు, సూరాయపాలెంల వరకు ఉన్న ప్రాంతం ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో ఈ ప్రాంతంలో జాతీయ రహదారి వెంట ఎకరం రూ.6 కోట్ల వరకు పలుకుతోంది. జాతీయ రహదారి వెంబడి నుంచి రెండు కిలోమీటర్ల లోపలకు



వెళ్ళే కొద్దీ ఎకరం కోటి నుంచి రూ. 2 కోట్లు పలుకుతోంది. ఇంకా లోపలకు వెళితే ఎకరం రూ.50 లక్షల చొప్పున దొరుకుతుంది.

మినీ సెక్రటేరియట్‌గా గొల్లపూడి

గొల్లపూడి నుంచి చూస్తే విజయవాడతో సమాంతరంగా కార్పొరేట్ హాస్పిటల్స్, ఫార్మాలాబ్‌లు కొలువుదీరాయి. రెస్టారెంట్స్, మాల్స్‌వంటి వాటితోపాటు కాంక్రీట్ జంగిల్ మాదిరిగా భారీ అపార్ట్‌మెంట్స్ నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వ కమిషనరేట్లు, డైరెక్టరేట్ కార్యాలయాలు పెద్ద ఎత్తున గొల్లపూడి ప్రాంతలో కేంద్రీకృతం అయ్యాయి. దీంతో ఈ ప్రాంతాన్ని మినీ సెక్రటేరియట్‌గా పిలుస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరటంతో ఉద్యోగులు ఈ ప్రాంతంలోనే నివసించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీరి కోసం ఇప్పటికే కొన్ని అపార్ట్‌మెంట్లు వెలిశాయి. ఇంకా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. గొల్లపూడి మీదుగా 65వ నెంబర్ జాతీయ రహదారి రాయనపాడు, సూరాయపాలెం, గుంటుపల్లిలను కలుపుతూ ఇబ్రహీంపట్నం మీదుగా నందిగామ, కోదాడల మీదుగా హైదరాబాద్‌కు వెళుతుంది. దీంతో గొల్లపూడి, రాయనపాడు, గుంటుపల్లి ప్రాంతాల్లో జాతీయ రహదారి సమీపంలో అనేక భారీ అపార్ట్‌మెంట్లు నిర్మాణంలో ఉన్నాయి.

రాయనపాడు స్టేషన్

గొల్లపూడి-ఇబ్రహీంపట్నం మధ్య ఉన్న రాయనపాడు రైల్వేస్టేషన్‌ను అధికారులు ఇటీవలే శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. దాదాపుగా 26 రైళ్లు ప్రస్తుతం ఇక్కడ ఆగి రాకపోకలు సాగిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచి విజయవాడ మీదుగా విశాఖపట్నం-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే రైళ్లూ రాయనపాడులో ఆగనున్నాయి. దీంతో రాయనపాడు ప్రాంతానికి రాకపోకలు భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే ఆర్టీసీ ఇక్కడి నుంచి ప్రత్యేక ంగా బస్సులు నడుపుతోంది. ఈ ప్రాంత రియల్టీ అభివృద్ధికి పరోక్షంగా ఈ అంశాలన్నీ తోడ్పడుతున్నాయి. గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు కమర్షియల్‌గా ప్రాంతంగా అభివృద్ధి చెందడమూ ఇందుకు కలిసొస్తోంది. ఇప్పుడు ఈ ప్రాంతంలో మాల్స్, కాలేజీలు, వ్యాపార కాంప్లెక్స్‌లు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయి. ఇవన్నీ ఈ ప్రాంత రియల్టీకి కలిసివస్తున్నాయి.

రూపుమారుతోంది..

భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణాలతో ఇబ్రహీంపట్నం రూపు మారిపోతోంది. ఈ ప్రాంతం ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. ఇబ్రహీంపట్నం రింగ్ దగ్గర నుంచి కొద్ది దూరంలోనే కృష్ణా తీరాన పవిత్ర సంగమం ఉంది. ప్రస్తుతం ఇది మంచి పర్యాటక ప్రాంతంగా మారింది. ఇదే పవిత్ర సంగమం దగ్గర ఐకానిక్ బ్రిడ్జికి శంకుస్థాపన జరిగింది. ఈ బ్రిడ్జి కృష్ణానది మీదుగా అమరావతి నగరానికి చేరుకుంటుంది. దీనివల్ల ఇబ్రహీంపట్నం ప్రాంతానికి మహర్దశ పట్టుకుంది. బడా డెవలపర్లు, రియల్ వ్యాపారులు ఇప్పుడు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వెంచర్లు ప్రారంభిస్తున్నారు.



అమరావతి రియల్టీకి ఎన్నికల భయం

తాత్కాలిక 'విరామం' తప్పదనే అంచనాలు

(ఆంధ్రజ్యోతి, అమరావతి)

నవ్యాంధ్ర రాజధాని అమరావతి స్థిరాస్తి రంగానికి ఎన్నికల భయం పట్టుకుంది. దీంతో ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు ఈ ప్రాంత రియల్టీలో పెద్దగా జోరు ఉండక పోవచ్చని భావిస్తున్నారు. అయితే దీనిపై పరిశ్రమవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు రియల్టర్లు, రాజధాని రైతులు ఇది మరింత ఊపందుకుంటుందని భావిస్తుంటే, మరికొందరు మాత్రం 2019 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాబోయే మూడు నాలుగు నెలలు స్తబ్ధత తప్పకపోవచ్చని భావిస్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, సార్వత్రిక ఎన్నికల ఫలితాల వచ్చే వరకు రాజధాని ప్రాంత స్థిరాస్తి రంగంలో పెట్టుబడి పెట్టేందుకు చాలా మంది వెనకాడుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నాలుగు నెలల్లో అమరావతి ప్రాంత రియల్టీ రంగంలో పెద్దగా కదలిక ఉండదని భావిస్తున్నారు.

ఊపందుకున్న నిర్మాణాలు

రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రస్తుతం సుమారు రూ.40,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రహదారులు, మౌలిక వసతులతోపాటు గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల నివాసం కోసం 3,840 అపార్ట్‌మెంట్లతో నిర్మిస్తున్న 61 టవర్లు, సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, జుడీషియల్ కాంప్లెక్స్, ఐకానిక్ వంతెన, అమరావతి సెంట్రల్ పార్క్ ఇందులో ముఖ్యమైనవి. ఇందులో కొన్ని హౌసింగ్ టవర్ల నిర్మాణం వచ్చే నెలలో పూర్తి కానుంది. హైకోర్టు తాత్కాలిక నిర్వహణ కోసం నిర్మిస్తున్న జుడిషియల్ కాంప్లెక్స్‌కు వచ్చే నెల 3వ ప్రారంభోత్సవం జరగనుంది. ఆ వెంటనే అందులోనుంచే హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభమవుతాయి.

పెరిగిన ధరలు

జుడీషియల్ కాంప్లెక్స్ నిర్మాణంతో రాజధానికి వచ్చే కక్షిదారులు, న్యాయవాదులు, ఉద్యోగులు, ఇతరుల సంఖ్య పెరగనుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పలువురు న్యాయవాదులు, ఉద్యోగులు, రాజధాని గ్రామాల్లోనే స్థిరనివాసాల కోసం ప్లాట్ల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో గత నెల నుంచి అన్ని రాజధాని గ్రామాల్లో ప్లాట్ల ధరలు చదరపు గజానికి సుమారు రూ.2,000 నుంచి రూ.4,000 వరకూ పెరిగాయి. అంతకు ముందుతో పోల్చితే ప్లాట్ల కోసం ఎంక్వైరీలూ అధికమయ్యాయి. అమరావతి అభివృద్ధి వేగం పుంజుకునే కొద్దీ ధరలు ఇంకా పెరుగుతాయని కొందరు రియల్టర్ల అంచనా.

నాడు 30 లక్షలు.. నేడు కోటిన్నర

అనంతపురంలో భూమి ధర ఐదింతలు

అనంతపురం (ఆంధ్రజ్యోతి)

అనంతపురం నగరంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధికి అనుగుణంగా నగరంతోపాటు, పలు మున్సిపాలిటీల పరిధిలో భూముల ధరలు భారీగా పెరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని సంపన్నులు అనంతపురం నగరంలో స్థలాలు, ఇళ్లు కొనడానికి ముందుకు రావడమే ఇందుకు ప్రధాన కారణం.

భారీగా పెరిగిన ధర

గత నాలుగేళ్లలో ఎన్నడూలేని విధంగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి.నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సెంటు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతోంది. అదే నగర శివారు ప్రాంతంలోని బెంగళూరు, హైదరాబాదు రహదారిని ఆనుకుని ఉన్న శ్రీనగర్ కాలనీలో నాలుగేళ్ల క్రితం ఎకరా రూ.30 నుంచి రూ.50 లక్షలు పలికేది. ఇప్పుడు అదే ప్రాంతంలో ఎకరా రూ.కోటిన్నర పలుకుతోంది. అయినా అక్కడ స్థలం దొరకడం కష్టంగా మారింది. అనంతపురానికి చుట్టుపక్కల భారీగా వెంచర్లు వెలిశాయి. నగరానికి 10 కిలోమీటర్ల దూ రంలో ఉన్న వెంచర్లలోనూ ఐదుసెంట్ల ప్లాటు రూ.20 లక్షలు పలుకుతోంది. అనంతపురం నుంచి గుత్తి వైపునకు 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఎకరా భూమి ధర రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షలు పలుకుతోంది. అనంతపురం నుంచి బెంగళూరువైపు ఎకరా రూ.కోటికి పైమాటే. అనంతపురం నుంచి చెన్నైకు వెళ్లే జాతీయ రహదారి వైపునా ఎకరా భూమి రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలు ధర పలుకుతోంది. అనంతపురం నుంచి కడప రోడ్డు మార్గంలో ఎకరా భూమి ధర రూ.70 లక్షలు పైమాటే. ఇక అనంతపురం నుంచి బళ్లారి వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా సిటీకి 6 కిలోమీటర్ల లోపు సెంటు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు పలుకుతోంది. నగర శివార్లలో సెంటు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు పలుకుతోంది.

2004కు ముందు అనంతపురం నగరంలోని ధరలకు, ఇప్పటి ధరలకూ పోల్చి చూస్తే మూడింతలు పెరిగింది. పెనుకొండ మండలం యర్రమంచి దగ్గర కియా కార్ల కంపెనీ ఏర్పాటు చేయడంతో దానికి సమీపంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా రూ.కోటి దాకా పలుకుతోంది. హిందూపురంలోనూ ఇదే పరిస్థితి. రాష్ట్ర విభజనకు ముందు నగరంలో ప్రతి నెలా సగటున 450 నుంచి 500 భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. 2015లోనూ ఇదే పరిస్థితి. ఇప్పుడు నెలకు 1,200 నుంచి 1,300 రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి.

ప్రకృతికి దగ్గరగా 'గ్రీన్ ఫీల్డ్స్' లగ్జరీ అపార్ట్‌మెంట్స్

తాడిగడపలో నిర్మాణం

రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పెరిగాయి. స్థానికులతోపాటు, బయటి వ్యక్తులూ ఇప్పుడు ఈ ప్రాంతంలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులైతే లగ్జరీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లను ఎంచుకుంటున్నారు. కానూరు సమీపంలోని తాడిగడపలోనూ ఈ ధోరణి కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎస్ అండ్ ఎస్ గ్రీన్ ప్రాజెక్ట్స్' కంపెనీ, తాడిగడపలో 'ఎస్ అండ్ ఎస్ గ్రీన్ ఫీల్డ్స్' పేరుతో కొత్త ప్రాజెక్టు చేపట్టింది. మొత్తం 2.5 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 35 శాతం స్థలంలో మూడు బ్లాకులుగా జీ+7 ఫ్లోర్లతో కంపెనీ లగ్జరీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం 186 లగ్జరీ ఫ్లాట్లు ఉంటాయి. వాస్తుకు అనుగుణంగా, కరెంట్ వినియోగాన్ని పొదుపు చేసేలా వినూత్న శైలిలో 'గ్రీన్ ఫీల్డ్స్' ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాజెక్ట్‌నూ కంపెనీ 'ఫోర్ పాయింట్ హోమ్' అనే కాన్సెప్ట్‌తో నిర్మిస్తోంది. స్వేచ్ఛగా గాలి, వెలుతురు ప్రసరించడంతో పాటు నీటి పొదుపు, మంచి ఆరోగ్యానికి దోహదం చేసేలా నివాస గృహాల నిర్మాణం ఈ కాన్సెప్ట్ ప్రత్యేకత. ఇంకా దివ్యాంగులు కూడా ఫ్లాట్లకు తేలికగా చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మొత్తం ప్రాజెక్ట్ స్థలంలో 35 శాతం విస్తీర్ణంలో మాత్రమే నిర్మాణాలు చేపట్టి, మిగతా 65 శాతం ఖాళీ ప్రదేశం పచ్చదనం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గ్రీన్ ఫీల్డ్స్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు

- 2.5 ఎకరాల్లో 35 శాతం విస్తీర్ణంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం.
- గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.
- కనకదుర్గ ఆలయం నుంచి 14 కిలోమీటర్లు.
- జీ+7 ఫ్లోర్లతో మూడు బ్లాకులుగా నిర్మాణం.
- 1,215-1,800 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంతో 186 లగ్జరీ డబుల్, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ల నిర్మాణం.
- ప్రతి బ్లాక్‌కు ఎంట్రెన్స్ లాంజ్.
- ప్రతి ఫ్లోర్‌కు ప్రత్యేక లిఫ్ట్ లాబీ సౌకర్యం.
- సెల్లార్ పార్కింగ్ సౌకర్యం.
- వాక్‌వేస్, వాకింగ్ పాథ్, ప్లే ఏరియాలు, లాండ్‌స్కేపింగ్.
- 10,000 ఎస్ఎఫ్‌టీలో ప్రత్యేకంగా క్లబ్‌హౌజ్
- 24 గంటలూ సెక్యూరిటీ
- కరెంట్ పోతే విద్యుత్ సరఫరా కోసం ప్రత్యామ్నాయంగా డీజిల్ జనరేటర్ ఏర్పాటు.
- 60 అడుగుల లోతు నుంచి పునాదుల నిర్మాణం.

దూరదృష్టితో పెట్టుబడి

భవిష్యత్తుకు భరోసా



(హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

స్థిరాస్తుల కొనుగోలులో దూరదృష్టి చాలా ముఖ్యం. లేకపోతే ఎంత ధర పెట్టి కొన్నా ఆ ఆస్తుల ధరల్లో ఎదుగూబొదుగూ ఉండదు. రియల్ బూమ్ నేపథ్యంలో ఎక్కడబడితే అక్కడ భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేయకూడదు. డిమాండు ఉండే ప్రాంతాల్లోనే పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపాలి. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంతో పాటు, విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాల్లో ధరలు ఒక్కో చోట ఒక్కోలా ధరలు ఉన్నాయి. మీరు ఉన్న ప్రాంతానికి దగ్గరగా ఉందని చూడకుండా ప్రస్తుత, భవిష్యత్తు అభివృద్ధిని బేరీజు వేసుకొని భూములు లేదా ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయాలి. కొన్న స్థలానికి లేదా ఇంటికి భవిష్యత్తులో మంచి ధర రావాలంటే? అభివృద్ధి చెందడానికి ఆస్కారమున్న ప్రాంతాన్నే ఎంచుకోవాలి. ముఖ్యంగా స్థిరాస్తులు కొనే ప్రాంతం పాఠశాలలు, ఆసుపత్రులు, సినిమా థియేటర్లు వంటి సౌకర్యాలకు చేరువలో ఉండేలా చూసుకోవాలి.

సొంతింటి విషయానికొస్తే మనకేం కావాలనే దానిపై ముందే స్పష్టమైన అవగాహన ఉండాలి. చూడటానికి ఇల్లు ఎలా ఉంది? అందులోని సదుపాయాలు, చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న మౌలిక వసతుల గురించి ఆలోచించారు. అలాగని ఇవన్నీ ఉన్నంత మాత్రాన మంచి ఇల్లు అని అనుకోలేం. ఇల్లు కొనే ముందు వీటితో పాటూ ఇంకొన్ని అంశాల్ని పరిశీలించాలి.

ప్రాంతాన్ని బట్టి డిమాండు

ఇళ్లు, స్థలాల రేట్లు అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా పెరగవు. స్థలం కొన్న ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందితేనే, ఫ్లాట్ల రేట్లు పెరుగుతాయి. కొనేటప్పుడే మంచి ప్రాంతాన్ని ఎంచుకుంటే అక్కడ అభివృద్ధి వేగవంతంగా జరుగుతుంది. ఇంటి విలువకూ రెండు, మూడేళ్లకే రెక్కలొస్తాయి. అక్కడి అభివృద్ధి చూసి చాలా మంది, ఆ ఇళ్లను కొనడానికి ముందుకొచ్చే అవకాశం ఉంది. ఇల్లు కొనే ప్రతి ఒక్కరూ తమ సౌకర్యాల్నే చూసుకోకూడదు. భవిష్యత్తు అవసరాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. కారు, బైక్ ఉన్నప్పటికీ ప్రజా రవాణా వ్యవస్థా ముఖ్యమే.


ఇతర అంశాలు

ప్రస్తుతం హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడు పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణగా మారింది. రాజధాని అమరావతి ఏర్పాటుతో గుంటూరు జిల్లా తుళ్లూరు, మంగళగిరి ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలంటాయి. స్థానికులతోపాటు దేశ, విదేశాల్లోని ప్రవాస భారతీయులూ ఈ ప్రాంతం రియల్టీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.

ధర నిర్ణయించే అంశాలు

ఇంటి విలువ రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం నివసించడానికి ఇంట్లో, చుట్టు పక్కల అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయా? భవిష్యత్తులో అమ్మితే మంచి ధర వస్తుందా? లేదా? అనే రెండు విషయాలు చూడాలి. ఇంటికి చేరువలో షాపింగ్ మాల్ లేదా దుకాణాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా సదుపాయాలు వంటివి ఉన్నాయా? లేవా? అనే విషయాలు చూడాలి. చుట్టుపక్కల ఉండే పొరుగు కూడా ముఖ్యమే. వాళ్లు స్నేహపూర్వకంగా ఉంటేనే ప్రశాంతంగా నివసించొచ్చు. కొత్తగా పెళ్లయిన జంటలకు స్కూల్ అవసరం ఉండకపోవచ్చు. కాకపోతే ఇల్లు అమ్మాలనుకున్నప్పుడు మాత్రం ఇదే అంశం కీలకమని గుర్తుంచుకోండి. ప్రజా రవాణా వ్యవస్థ, పోస్టల్ సదుపాయాలు వంటివి కూడా ప్రధానమైనవే. వీటన్నింటినీతో పాటు ప్రభుత్వ పరంగా అనుమతులు, మౌలిక వసతులు కూడా ముఖ్యమే.





ఎన్నికల్లో సాంకేతికత అవసరం: కోవింద్

న్యూఢిల్లీ, జనవరి 25: దేశ ఎన్నికల భారీతనాన్ని దృష్టిలో పెట్టుకుని.. టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు జరిగిన ఎన్నికలపై ఓటర్లకు విశ్వసనీయత ఉందన్నారు. ఈవీఎంల విశ్వసనీయతపై ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

10 శాతం కోటా భేష్

గాంధీజీ కల నెరవేర్చారు.. రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి పరోక్ష ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 25: ఆర్థిక బలహీనవర్గాల వారికి 10% కోటాను కల్పిస్తూ చేసిన రాజ్యాంగ సవరణను రాష్ట్రపతి పరోక్షంగా మెచ్చుకున్నారు. "అందరికీ సమానావకాశాలు రావాలన్నది గాంధీజీ కల. బలహీనులు కూడా తమ గళం వినిపించగలిగేలా భారతావని రూపుదిద్దుకోవాలి. ఎక్కువ కులాలు-తక్కువ కులాలు అనేభేదం ఉండరాదనీ, మహిళలూ మగవారితో సమానవకాశాలు సాధించాలనీ ఆయన అభిలషించారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ ఈ మధ్య చేసిన రాజ్యాంగ సవరణ ఆయన కలలను నెరవేర్చే దిశగా తీసుకున్న చర్య" అని ఆయన 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతి నుద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబరు 2 మహాత్ముడి 150వ జయంతి అనీ, బాపూజీ ఆశయాలకు బద్ధులమవుదామనీ ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రధానంగా త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల గురించి ప్రస్తావించారు. "మరో కొద్ది నెలల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఓ రకంగా 1940-50ల్లో ఎలాగైతే తొలి అడుగులు వేసే పరిస్థితుల్లో ఉన్నామో ఇపుడు అదే రీతిలో మలి అడుగుల్ని విచక్షణతో వేయాల్సిన స్థితిలో ఉన్నాం. ఓటు అనేది మన ప్రజాస్వామ్య సిద్ధాంతాలు నెరవేర్చుకోడానికి వచ్చే ఒక అవకాశం. ఈసారి మరీ కీలకం. ఎందుకంటే 21వ శతాబ్దిలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఓటు వెయ్యడానికిది మొదటి అవకాశం. ఓటుహక్కు వినియోగించుకోండి. ఒక శతాబ్దిలో ఒకసారి వచ్చే అవకాశంగా దీన్ని భావించండి" అని పిలుపునిచ్చారు.



గణతంత్ర వేడుకల ముఖ్యఅతిథి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా దంపతులకు భారత ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. తొలిసారి భారత గడ్డపై అడుగుపెట్టిన ఆయన్ను రాష్ట్రపతి భవన్‌లో గార్డ్ ఆఫ్ ఆనర్‌తో సత్కరించింది. నెల్సన్ మండేలా తర్వాత గణతంత్ర అతిథిగా భారత్‌కు విచ్చేసిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు ఈయనే.

భారతరత్న నానాజీ దేశ్‌ముఖ్

సమాజమే ఆలయం.. సంక్షేమమే ఆశయం



- గ్రామాల స్వయం సమృద్ధికి కృషి
- 500గ్రామాల్లో సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమం
- ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్‌లో క్రియాశీలం

న్యూఢిల్లీ, జనవరి 25: నానాజీ దేశ్‌ముఖ్.. ఈయనెవరనేది తెలిసినవారు ఈ తరంలో తక్కువే! కానీ నిన్నటి తరం వారిని అడిగితే.. ఆయన 'భారత రత్న'మేనని ప్రశంసిస్తారు. గ్రామాల అభివృద్ధే భావి భారత వికాసానికి నాంది అని నమ్మినా.. ఆ దిశగా జీవిత పర్యంతం కృషిచేసిన వారు అతికొద్దిమందే. వారిలో నానాజీ దేశ్‌ముఖ్ ముందు వరుసలో ఉంటారు. గ్రామాల స్వయం సమృద్ధిని గట్టిగా కాంక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి.. విద్య, వైద్య సౌకర్యాల కల్పన కోసం పనిచేశారు. దేశంలో మొట్టమొదటి సరస్వతి శిశుమందిర్‌ను ఆయనే స్థాపించారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని పెంపొందించేందుకు దేశమంతా శిశుమందిర్‌లను విస్తరింపజేశారు. 60-70ఏళ్లు దాటిన వారు ఎన్నికల్లో పోటీ చేయడం గానీ.. రాజకీయాల్లో కొనసాగడం కానీ చేయొద్దనేవారు. ఎంపీగా గెలిచి రాజకీయాల్లో ఓ వెలుగు వెలుగుతున్న రోజుల్లో ఆయన దానికి కట్టుబడ్డారు. చెప్పినట్లుగానే 70ఏళ్ల వయసులోపే రాజకీయాల నుంచి విరమించుకున్నారు. సామాజిక కార్యకర్తగా నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపించిన నానాజీ అసలు పేరు చండికాదాస్ అమృత్‌రావు దేశ్‌ముఖ్. 1916 అక్టోబరు 11న మహారాష్ట్రలోని పర్భని జిల్లాలోని కడోలిలో జన్మించారు. చిన్నప్పటి నుంచే బాగా చదువు కోవాలని తపించారు. చదువుకు డబ్బుల కోసం కూరగాయలు అమ్మారు. రాజస్థాన్‌లోని సికర్ పట్టణ రావురాజా స్కాలర్‌షిప్ ఇవ్వడంతో అక్కడే హై స్కూల్ విద్యను అభ్యసించారు. స్థానిక బిర్లా కళాశాల (ప్రస్తుతం బిట్స్ పిలాని)లో కాలేజీ విద్యను అభ్యసించారు. బాల గంగాధర తిలక్‌లోని జాతీయ భావ స్ఫూర్తి ఆయనను ముందుకు నడిపించింది. కేశవ్ బలరాం హెగ్డేవార్ స్ఫూర్తితో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. ఆగ్రాలో సంఘ్ ప్రచారక్‌గా పనిచేశారు. అక్కడే తొలిసాగా సంఘ్ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్‌ను కలిశారు. గోరఖ్‌పూర్‌లో ప్రచారక్‌గా పనిచేసి సంఘ్ సిద్ధాంతాన్ని వేళ్లూనుకునేలా చేశారు. ఆయన కృషితో గోరఖ్‌పూర్ చుట్టుపక్కల 250 సంఘ్ శాఖలు వెలిశాయి. ఈ క్రమంలో 1950లో గోరఖ్‌పూర్‌లోనే దేశంలో మొట్టమొదటి సరస్వతి శిశుమందిర్‌ను ప్రారంభించారు. అప్పట్లో ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక స్వదేశ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం నానాజీ భారతీయ జనసంఘ్‌లో చేరారు. పార్టీ తరఫున యూపీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 1974లో ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పట్లో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు.. దానికి జన్‌సంఘ్ మద్దతివ్వడం వెనుక నానాజీ ప్రత్యేక చొరవ చూపారు. చరణ్‌సింగ్, రాం మనోహర్ లోహియాతో ఆయనకు సన్నిహితసంబంధాలు ఉండేవి. తదనంతర రోజుల్లో వినోభాబావే ఆధ్వరంలో నడిచిన భూదాన్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనతో కలిసి జైలు జీవితం కూడా గడిపారు. 1977లో యూపీలోని బలరాంపూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందారు. ఎంపీగా రెండేళ్లపాటు కొనసాగారు. 1980లో క్రియాశీలక రాజకీయాల నుంచి పూర్తిగా విరమించుకొని సామాజిక సేవకే అంకితమయ్యారు. 1999లో ఎన్డీయే ప్రభుత్వం నానాజీని రాజ్యసభకు నామినేట్ చేసింది. రాజకీయాల నుంచి తప్పుకొన్నాక.. దీనదయాళ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు సేవలందించారు. యూపీ, మధ్యప్రదేశ్‌లోని 500 గ్రామాల్లో సామాజిక పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వయం సమృద్ధిపై అక్కడి ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. 'హర్ హాత్‌కో దేంగే కామ్.. హర్ ఖేత్‌కో దేంగే పానీ' నినాదంతో యూపీలోని గోండా, మహారాష్ట్రలోని బీడ్‌లో కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత యూపీ, మధ్యప్రదేశ్ సరిహద్దుల్లోని చిత్రకూట్‌లోనే స్థిరపడ్డారు. అక్కడే మొట్టమొదటి రూరల్ వర్సిటీ అయిన చిత్రకూట్ గ్రామోదయ్ విశ్వవిద్యాలయను స్థాపించారు. 2010 ఫిబ్రవరి 27న 93 ఏళ్ల వయసులో చిత్రకూట్‌లోనే కన్నుమూశారు.

భారతరత్న భూపేన్ హాజారికా



సమ్మోహన రాగం... భూపేన్!

ఆ స్వరం ఎంత గంభీరమో... అంత మధురం! ఆ పాట ఎంత లలితమో... అంత నిగూఢం! ఆ భావం స్వరజనీనం, సర్వ మానవ హితం! ఇది అసోం కవి గాయక సంగీత దర్శక నాయకుడు భూపేన్ హజారికాకు మాత్రమే ప్రత్యేకం! ఆయనకు 'భారత రత్న' ఇవ్వడం ఈశాన్య భారతానికే గౌరవం! సామరస్యాన్ని కాంక్షించిన ఆయన పాటకు ఘనమైన పట్టాభిషేకం!

సంప్రదాయ అసోం టోపీతో, నిత్యం చెరగని చిరునవ్వు... భూపేన్ పేరు వినగానే గుర్తుకొచ్చేవి ఇవే! కళా ప్రపంచానికి ఆయన 'సుధాకాంత'గా సుపరిచితుడు. భూపేన్ 1926 సెప్టెంబరు 8వ తేదీన జన్మించారు. పదిమంది సంతానంలో ఆయన మొదటివాడు. గువహతి పాఠశాలతో మొదలైన ఆయన చదువు... బెనరాస్ హిందూ యూనివర్సిటీని దాటి, కొలంబియా యూనివర్సిటీ (న్యూయార్క్)దాకా సాగింది. భూపేన్ పదేళ్ల వయసు నుంచే కలం ఝళిపించడం మొదలుపెట్టారు. పదకొండో ఏట మొట్టమొదటిసారిగా ఆకాశవాణి స్టూడియోలో అడుగుపెట్టారు. తాను రచించిన పాటను, తానే స్వరపరిచి, ఆలపించారు. పదమూడేళ్ల వయసులో 'ఇంద్రమాలతి' అనే సినిమా కోసం భూపేన్ పాట పాడారు.

భూపేన్ హజారికా కలం, గళం స్వప్నలోకాలు, కాల్పనిక ప్రపంచంలో మాత్రమే విహరించేవి కావు! ఆయన అక్షరాలు మానత్వం, సర్వమానవ సమానత్వం, సామరసత ప్రతిఫలిస్తాయి. అసోమీ గ్రామీణ సంగీతం వింటూ పెరిగిన భూపేన్... తన పదంలోనూ జానపదాన్ని మిళితం చేశారు. ఆయన పాటలు ప్రజల హృదయాల్లోకి చొచ్చుకుపోయాయి. ఈశాన్య రాష్ట్రాలతోపాటు... పశ్చిమ బెంగాల్, పొరుగునే ఉన్న బంగ్లాదేశ్‌లోనూ ఆయన గీతాలు సుప్రసిద్ధంగా వినిపించాయి. చైనాతో భారత సమరంలో మన జవాన్ల వీరమరణంపై సంవేదనకు గురయ్యారు. 'వారు మరణిస్తుంటే... నేనెందుకు బతికి ఉన్నానో' అంటూ 'కత జవానోర్ మృత్యుహోల్' అంటూ ఆలపించిన గేయం దేశభక్తుల చేత కన్నీరు పెట్టించింది. "బ్రహ్మపుత్ర తీరం నుంచి వచ్చిన దేశ దిమ్మరిని నేను! మిసిసిపీ నుంచి వోల్గా ప్రవాహం చూశాను. ఆస్ట్రియా మీదుగా పారిస్ అందాలకు కట్టుబడిపోయాను' అంటూ... ఈ అసోమీ ముద్దుబిడ్డడు విశ్వమానవుడు అయ్యాడు. మనుషులున్నది మానవత్వం కోసమే అని చాటిచెప్పే భూపేన్ గీతం 'మానుష్ మనుషెర్ జోనో' బంగ్లాదేశ్‌లో ఇంటింటా వినిపిస్తుంది. ఆకాశవాణిలో కొన్నాళ్లు పనిచేసిన భూపేన్... 1949లో మాస్ కమ్యూనికేషన్స్‌లో పీహెచ్‌డీ చేసేందుకు కొలంబియా యూనివర్సిటీ (న్యూయార్క్)లో చేరారు. అక్కడ ప్రియంవదా పటేల్‌తో జరిగిన పరిచయం ప్రేమగా మారి వివాహ బంధానికి దారితీసింది. 1953లో అమెరికా నుంచి తిరిగి వచ్చిన భూపేన్... కొన్నాళ్లపాటు గువహతి యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేశారు. ఆ తర్వాత గీత-సంగీత ప్రపంచమే తన పథమని భావిస్తూ ముంబై చేరుకున్నారు. అక్కడ 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్'తో భాగస్వామి అయ్యారు. దర్శకుడిగా తన తొలి చిత్రంలో లతా మంగేష్కర్‌తో పాట పాడించాలని నిర్ణయించుకుని... ఆమె చేత ఒప్పించారు. చిత్రమేమిటంటే... లతా మంగేష్కర్‌తో పరిచయమే... పరోక్షంగా ఆయన విడాకులకు కారణమైంది. ప్రియంవదా పటేల్‌కు దూరమైన తర్వాత ఆయన కల్పనా లాజ్మిని వివాహమాడారు.


ఘనమైన కీర్తి...

అసోమీతోపాటు రుడాలీ, మిల్ గయా మంజిల్ ముఝే, సాజ్, దమన్, గజగామిని తదితర హిందీ చిత్రాల రూపకల్పనలో భూపేన్ భాగస్వామి అయ్యారు. మూడుసార్లు జాతీయ ఉత్తమ దర్శకుడిగా పురస్కారం అందుకున్నారు. 'డాన్' పేరిట స్టార్ టీవీలో ప్రసారమైన టెలీ సీరియల్ రూపొందించింది ఆయనే. అలాగే... ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక వైభవంపై 'గ్లిమ్సెస్ ఆఫ్ మిస్టీ ఈస్ట్' అనే మరో డాక్యుమెంటరీని కూడా ఆయన నిర్మించారు. 1967లో ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యే అయ్యారు. సుమారు 1500 గీతాలు రచించారు. 15 పుస్తకాలు రాశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, 'దాదాసాహెబ్ ఫాల్కే' అందుకున్నారు.తన 85వ ఏట 2011 నవంబరు 5న ముంబైలో తుదిశ్వాస విడిచారు.

హుడాపై సీబీఐ దాడి

భూసేకరణ, కేటాయింపుల్లో అవినీతిపై 20 ప్రాంతాల్లో విస్తృత సోదాలు.. కేసు నమోదు

- అదనపు ముఖ్యకార్యదర్శి, బిల్డర్లపై కూడా
- రాజకీయ దురుద్దేశపూరితమన్న భూపిందర్



న్యూఢిల్లీ, జనవరి 25: హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్‌సింగ్ హుడాపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2009లో గుడ్‌గావ్ పరిసర ప్రాంతాల్లో 1417 ఎకరాల భూసేకరణ, వాటి అభివృద్ధి, కేటాయింపుల క్రమంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు రావడంతో... సుప్రీంకోర్టు ఆదేశం మేరకు సీబీఐ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయం రోహ్‌తక్‌లోని భూపిందర్ నివాసంతోపాటు ఢిల్లీ, గుడ్‌గావ్‌లలో 20 ప్రాంతాల్లో సోదాలు చేసింది. అనంతరం ఆయనను నిందితునిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆయనతోపాటు రాష్ట్ర అదనపు ముఖ్యకార్యదర్శి త్రిలోక్‌చంద్, డీఎల్ఎఫ్, ఎమ్మార్ ఎంజీఎఫ్, బుజ్ హోటల్స్, అన్సాల్స్ తదితర 15 నిర్మాణసంస్థలపైనా కేసు పెట్టింది. ఈ నెల 28న ఉప ఎన్నిక జరిగే జింద్ అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం భూపిందర్ ప్రసంగించాల్సి ఉండగా... కొన్ని గంటల ముందుగా ఈ పరిణామం చోటుచేసుకుంది. దీంతో, ఆయనకు బదులుగా కుమారుడు దీపేందర్‌సింగ్ వెళ్లారు. వచ్చే అక్టోబరులో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండడంతో భూపిందర్‌పై సీబీఐ కేసు రాజకీయంగా చర్చనీయాంశమైంది. తన గొంతు నొక్కేందుకు రాజకీయ దురుద్దేశంతోనే కేసులు పెడుతున్నారని భూపిందర్ ఆరోపించారు. కేంద్రంలో తమ ప్రభుత్వం వచ్చాక సీబీఐ అధికారులు వీటికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

ఇదీ నేపథ్యం..

గుడ్‌గావ్‌లో అభివృద్ధి చేసిన స్థలం చౌకగా ప్రజలకు, ముఖ్యంగా ఆర్థికంగా బలహీనవర్గాల వారికి అందుబాటులో ఉంచడం కోసం 1417 ఎకరాలు సేకరించడానికి హరియాణా పట్టణాభివృద్ధి సంస్థ(హుడా) 2009లో నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం 2010లో మరో 850.10 ఎకరాల కోసం ఇంకో నోటిఫికేషన్ విడుదల విడుదల చేసింది. కానీ, అసలు లక్ష్యం నెరవేరలేదని దర్యాప్తులో తేలింది. భూపిందర్, అప్పటి హుడా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ త్రిలోక్‌చంద్‌లతో బిల్డర్లు కుమ్మక్కై మార్కెట్ కంటే తక్కువ ధరకే దాదాపు 95శాతం భూమిని దక్కించుకున్నారు. దీంతో, ఆ భూములు ఇచ్చిన రైతులు హైకోర్టు ఆశ్రయించగా... భూసేకరణ నోటిఫికేషన్‌ను కోర్టు కొట్టేసింది. ఈ తీర్పును భూపిందర్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. 1417 ఎకరాలు తీసుకుని కేవలం 87 ఎకరాలకే 2011లో పరిహారం ఇచ్చారని ఆ భూముల అసలు యజమానులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం కోరగా... సీబీఐతో దర్యాప్తు చేయించడానికి ఎలాంటి అభ్యంతరమూ లేదని ప్రస్తుత మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియచేసింది. దీంతో, 2017 నవంబరు 1న సీబీఐ దర్యాప్తుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక భూపిందర్‌పై ఇతర అంశాల్లో సీబీఐ ఇప్పటికే మూడు కేసులు, పోలీసులు ఓ కేసు నమోదు చేశారు.

ఉగ్రవాదులపై సాటి లేని పోరుకు కీర్తిచక్ర

తుషార్ గౌబా, విజయ్ కుమార్‌లకు ప్రకటించిన రక్షణ శాఖ.. 9 మందికి శౌర్య చక్ర ప్రకటన



విజయ్‌కుమార్



తుషార్ గౌబా

అశోక్ చక్ర: లాన్స్ నాయక్ నాజిర్ అహ్మద్ వని (మరణానంతరం)

కీర్తి చక్ర: మేజర్ తుషార్ గౌబా, అశ్వభటుడు విజయ్ కుమార్ (మరణానంతరం)

న్యూఢిల్లీ, జనవరి 25: గత ఏడాది మే నెలలో ఒకరోజు! జమ్మూ కశ్మీరులోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ. పైనుంచి ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరుపుతున్నారు. వాటిని ఏమాత్రం లెక్క చేయకుండా, తన ప్రాణాలను కూడా పణంగా పెట్టి ఓ సైనికుడు 20 మీటర్లు కొండపైకి పాక్కుంటూ వెళ్లాడు. ఉగ్రవాదుల సమీపానికి చేరాడు. తన చేతిలోని హ్యాండ్ గ్రనేడ్‌ను విసిరాడు. ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టాడు. ఆయనే.. జాట్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ తుషార్ గౌబా! ఉగ్రవాదులతో పోరులో సాటిలేని ధైర్య సాహసాలు ప్రకటించిన ఆయనను రక్షణ శాఖ శాంతి సమయంలో దేశంలోనే రెండో అత్యున్నత శౌర్య పురస్కారమైన కీర్తిచక్రకు ఎంపిక చేసింది. ఆయనతో పాటు 22 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన అశ్వభటుడు విజయ్ కుమార్‌కు కూడా కీర్తిచక్రను ప్రకటించింది. అయితే, విజయ్ కుమార్‌కు మరణానంతరం ఈ పురస్కారం దక్కింది. గత ఏడాది ఆగస్టు 2-3 తేదీల్లో బారాముల్లా జిల్లాలో జరిగిన ఆపరేషన్ విజయ్ దర్పులో విజయ్ కుమార్ పాల్గొన్నారు. విచక్షణరహితంగా జరుపుతున్న ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడ్డారు. అయినా, లెక్క చేయకుండా ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టారు. అయినా, వెనుదిరగలేదు. ముఖాముఖి పోరులో మరో ఉగ్రవాదిని మట్టుబెట్టడానికి ముందుకు ఉరికారు. ఆ పోరాటంలో అసువులు బాశారు. విధి నిర్వహణలో భాగంగా తిరుగులేని ధైర్య సాహసాలు ప్రదర్శించినందుకు ఆయనకు కీర్తి చక్ర ప్రకటించినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఇక, మరో తొమ్మిదిమంది సైనికులకు శాంతి సమయంలో మూడో అత్యున్నత శౌర్య పురస్కారమైన శౌర్య చక్ర ప్రకటించింది. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ సహా 19 మంది సీనియర్ ఆర్మీ అధికారులను పరమ విశిష్ట సేవా మెడల్‌కు ఎంపిక చేసింది. శౌర్య పతకాలతో సంబంధం లేకుండా శాంతి సమయంలో ప్రకటించే అత్యున్నత మిలటరీ మెడల్ ఇది. వీరిలో 15 మంది లెఫ్టినెంట్ జనరల్స్, ముగ్గురు మేజర్ జనరల్స్ ఉన్నారు.

చెల్లిదీ నాదీ ఒకే తీరు

ప్రియాంకను ఎన్నేళ్లుగానో అడుగుతున్నా.. పిల్లలు చిన్నవారు కావడంవల్లే రాలేదు

- బీజేపీ దూషణలు నాకు 'బహుమతి'
- 'ఒడిసా డైలాగ్'లో రాహుల్ వ్యాఖ్యలు

భువనేశ్వర్, జనవరి 25: ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కాంగ్రెస్‌ను 'డోన్ట్‌కేర్' అన్నందుకే ప్రియాంకా గాంధీని రంగంలోకి దించారా? కుటుంబ బంధాన్ని బలోపేతం చేస్తూ వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లోకి వస్తున్నారా? బీజేపీ దూషణలను దీవెనలుగా భావిస్తున్నారా? మోదీపై 'ద్వేషం' ఉందా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! వీటన్నింటికీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సవివరంగా స్పందించారు. 'ది ఒడిసా డైలాగ్' పేరిట శుక్రవారం భువనేశ్వర్ టౌన్‌హాల్‌లో వివిధ రంగాలకు చెందిన వారితో రాహుల్ భేటీ అయ్యారు. వివిధ అంశాలపై స్పందించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రియాంక ఇప్పుడే ఎందుకంటే...

ప్రియాంక ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం ఈ పది రోజుల్లో ఆకస్మికంగా ప్లాన్ చేసింది కాదు! పార్టీలోకి రావాలని చాలా ఏళ్లుగా ఆమెను అడుగుతూనే ఉన్నాను. ఇద్దరు చిన్న పిల్లలు ఉండటం అనే ఏకైక కారణంతో వాయిదావేస్తూ వచ్చింది. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లయ్యారు.

అది నరకప్రాయం...

నానమ్మ ఇందిరాగాంధీ, నాన్న రాజీవ్‌గాంధీల హత్యలు చాలా విషాదాన్ని నింపాయి. ఆ సమయంలో నరకంలో ఉన్నంత బాధ అనుభవించాం.



మా ఇద్దరి ఆలోచనలు ఒకటే...

నా ఆలోచనలు, ప్రియాంక ఆలోచనలు దాదాపుగా ఒక్కటే! మమ్మల్ని వేర్వేరు గదుల్లో కూర్చోబెట్టి వివిధ అంశాలపై ప్రశ్నిస్తే ... 80 శాతం సమాధానాలు ఒకేలా ఉంటాయి. మేమిద్దరం చాలా విషయాలపై మాట్లాడుకుంటాం. ఒకరి కోసం ఒకరు సర్దుబాటు చేసుకోవాలని భావిస్తాం.

మోదీపై ద్వేషం లేదు

ప్రధాని మోదీపై ఎలాంటి ద్వేషభావం లేదు. ఉన్నదంతా వివిధ అంశాలపై బేధాభిప్రాయాలు మాత్రమే! ఆయా అంశాలపై ఆయనతో గట్టిగా పోరాడతాను. మోదీని గద్దె దించడం నా లక్ష్యం. ఆయన నన్ను దూషించినప్పుడల్లా ఒక ఆలింగనం ఇవ్వాలని అనిపిస్తుంది. ఆరెస్సెస్, బీజేపీ తిట్లను సైతం దీవెనలుగానే భావిస్తాను. కాంగ్రెస్ అందరి అభిప్రాయాలు వింటుంది. కానీ.. మోదీ అలా కాదు. అన్నీ తనకే తెలుసునని అనుకుంటారు.

ఆరెస్సెస్ చొరబాటు

బీజేపీకి మాతృక ఆరెస్సెస్. దేశంలోని ప్రతి సంస్థలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. తాను మినహా మరో సంస్థ ఉండొద్దని భావిస్తుంది. మంత్రులందరినీ ఆరెస్సెస్ కంట్రోల్ చేస్తోంది. మొట్టమొదటిసారిగా సుప్రీంకోర్టు జడ్జిలు మీడియా ముందుకు వచ్చారు. తమపని తాము చేసుకోనివ్వడంలేదని ఆక్రోశించారు. ఆరెస్సెస్ ముద్రను మీరు ఇక్కడ చూడొచ్చు. బాబాయ్ కుమారుడు వరుణ్ కాంగ్రెస్‌లోకి వస్తున్నాడనే వార్తలు వినలేదు. ఆ విషయం నాకు తెలియదు.

వ్యవసాయం అన్ని రంగాల్లా కాదు. ఇది దేశానికి వెన్నెముక. దీనిని మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. రైతుల్లో నిరాశా నిస్పృహలు నెలకొన్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి. ఉద్యోగాల కల్పన కేంద్రం బాధ్యత. ఒక్కటంటే ఒక్క రాష్ట్రం కూడా ఉద్యోగాలు సృష్టించలేదు. విద్య ప్రైవేటు చేతుల్లో ఉంది. ఉపాధికీ, చదువుకూ సంబంధం లేకుండా పోయింది. ఉద్యోగాలు లేకుండా 9% వృద్ధి సాధించి ఏం లాభం? ఉద్యోగాలు ఎలా సృష్టించాలో చైనా నుంచి నేర్చుకోవాలి. అక్కడ రోజుకు 15వేల కొత్త ఉద్యోగాలు సృష్టిస్తున్నారు.



ఫొటోగ్రాఫర్‌కు సాయం

రాహుల్ భువనేశ్వర్ వచ్చిన సమయంలో ఒక ఫొటోగ్రాఫర్ కింద పడిపోయారు. రాహుల్ వెంటనే స్పందిస్తూ.. ఆ ఫొటోగ్రాఫర్‌కు చెయ్యందించారు. గతంలో ఒక పోలీసు పడిపోయినా మోదీ పట్టించుకోకుండా ప్రసంగం కొనసాగించారు. ఈ రెండు ఘటనలను పోల్చుతూ సోషల్‌మీడియాలో కామెంట్లు వైరల్ అయ్యాయి.

కొత్త రిజర్వేషన్లపై త్వరలో జీవో

- విధివిధానాలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- బీసీలకు ఉన్న నిబంధనలే వర్తింప చేసే అవకాశం

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక బలహీన వర్గాల వారికి కొత్తగా ప్రతిపాదించిన 10 శాతం రిజర్వేషన్లపై త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయి. రెండుమూడు రోజుల్లో జీవో జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. కేంద్రం ప్రతిపాదించిన ఈ రిజర్వేషన్లలో సబ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పదిలో ఐదు శాతం కాపు, తెలగ, ఒంటరి, బలిజ తదితర కులాలకు కేటాయించాలని, మిగిలిన ఐదు శాతం ఇతర అగ్రవర్ణ పేదలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా కల్పించిన రిజర్వేషన్లకు సంబంధించిన విధివిధానాలను రూపొందించుకొనే స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వాలకే కేంద్రం వదిలివేసింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు విధివిధానాలు ఖరారు చేసి ఉత్తర్వులు జారీ చేశాయి. వాటిని అధ్యయనం చేసి ఇక్కడ కూడా జీవో జారీ చేయాలని నిర్ణయించారు. దీని కోసం అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా చట్టం తేవాల్సిన అవసరంగానీ, లేదా కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణను ఆమోదించాల్సిన అవసరంగానీ లేదని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. 'కొన్ని రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఆమోదం సరిపోతుంది. అందుకే కేంద్రం నోటిఫికేషన్ కూడా జారీ చేయగలిగింది. ఆ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఇక్కడ నిబంధనలు, మార్గదర్శక సూత్రాలు రూపొందించుకొని జీవో జారీ చేస్తే సరిపోతుంది. ఆ దిశగా న్యాయశాఖకు ఆదేశాలు జారీ చేశాం' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 8 లక్షల రూపాయల ఆదాయానికి లోపు ఉన్నవారంతా కొత్త రిజర్వేషన్లకు అర్హులని కేంద్రం నిర్ణయించింది. ఇందులో మార్పుచేర్పులు చేసే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చారు. బీసీ వర్గాలకు ఉన్న నిబంధనలనే కొత్త రిజర్వేషన్లకు వర్తింప చేసే ఆలోచనలో ప్రభుత్వ వర్గాలు ఉన్నాయి. ఏడాదికి రూ.ఆరు లక్షలలోపు ఆదాయం ఉన్న వారికి బీసీ రిజర్వేషన్లు ప్రస్తుతం వర్తిస్తున్నాయి. బీసీల్లో క్రీమీ లేయర్ నిబంధనలు పాటిస్తున్నారు. అవే నిబంధనలు ఈ రిజర్వేషన్లకు కూడా వర్తింప చేయడం సమంజసమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇక్కడ జీవో జారీ అయితే ఇప్పటి నుంచి ఉద్యోగాల భర్తీ కోసం జారీ చేసే నియామక నోటిఫికేషన్లలో ఈ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో సీట్ల భర్తీకి కూడా ఈ రిజర్వేషన్లు అమలవుతాయి.

8 తర్వాత ఎప్పుడైనా సమ్మె!

- వెల్లడించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు.. ఎండీ, ఛైర్మన్‌కు నోటీసులు



వర్ల రామయ్యకు సమ్మె నోటీసు ఇస్తున్న నేతలు

విజయవాడ, జనవరి 25: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంస్థ పరిరక్షణకు చట్టవ్యతిరేకమైన అక్రమ రవాణాను నియంత్రించాలని కోరుతూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) రాష్ట్ర కమిటీ నేతలు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. విజయవాడ బస్టాండ్‌లో ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య, ఎండీ సురేంద్రబాబుకు ఈ నోటీసును అందజేశారు. కార్మికులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 8వతేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మె చేపడతామని ఛైర్మన్, ఎండీలకు యూనియన్ నేతలు తెలిపారు. అనంతరం, యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 2017, ఏప్రిల్ 1 నాటి పే, డీఏపై 54% ఫిట్‌మెంట్ ఇప్పిస్తూ వేతన సవరణ చేయాలని, 2017, మార్చి 23న ఇచ్చిన పేస్కేల్ ప్రతిపాదనల్లోని అంశాలు పరిష్కరించాలన్నారు. ఆర్‌పీఎస్-2013లో మిగిలిన 80% బకాయిలను ఒకే విడతలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



విశాఖలో భారీ జాతీయ పతాకం

జాతీయ ఓటర్ల దినోత్సవం, 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశాఖలో స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్స్ ఆధ్వర్యంలో 'జెండా ఊంఛా రహే హమారా' కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 వేల చ.అ. భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని జాతీయతను చాటారు. మంత్రి గంటా శ్రీనివాసరావు నిర్వాహకులను అభినందించారు.

- సిరిపురం (విశాఖపట్నం)

ఉజ్వల భారతాన్ని నిర్మించాలి: నరసింహన్


- రాష్ట్ర ప్రజలకు గవర్నర్ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఉజ్వల భారతాన్ని నిర్మించుకోవాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ గవర్నర్ శుక్రవారం సందేశమిచ్చారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. నిరంతర కృషి, సంక్షేమ పథకాల అమలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలవారికి సమంగా అందాలన్నారు.

దేశ ప్రజల ముందు కీలక బాధ్యత

- రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు గణతంత్ర శుభాకాంక్షలు



అమరావతి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): "ఎందరో మహనీయుల కృషి, పోరాటాల ఫలితంగానే భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, గణతంత్ర ప్రజాస్వామ్య రాజ్యంగా అవతరించింది" అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, శుక్రవారం రాత్రి ఆయన సందేశానిచ్చారు. 'ఏపీ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించాక జరుపుకుంటున్న ఐదవ గణతంత్ర వేడుక ఇది. ఈ ఏడాది మరో ప్రత్యేక కూడా ఉంది. 17వ లోక్‌సభకు జరగనున్న ఎన్నికలు జాతి భవితను నిర్దేశించే ఎన్నికలు కానున్నాయి. అయితే ప్రజల ఆశలు, లక్ష్యాలకు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచిన నేపథ్యంలో అందరి ఆకాంక్షలు నెరవేర్చే వారికే పట్టం కట్టాల్సిన కీలక బాధ్యతను ఈ గణతంత్రం ప్రజల ముందు ఉంచిందని' సీఎం అభిప్రాయపడ్డారు. 'ప్రజాస్వామ్యానికి ఎప్పటికప్పుడు పెనుసవాళ్లు ఎదురవుతున్నా, దేశ ప్రజలు వాటిని ఎంతో సంయమనంతో, సమిష్టి భావనతో ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ప్రజాస్వామానికి మరో రూపంలో ప్రమాదం ఎదురైంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉండాల్సిన సమాఖ్య భావన కన్పించకుండా పోతోందని' చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఆరంభ ఆటంకాలను అధిగమించి అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ఇటు అమరావతి నగర నిర్మాణం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. మరో పక్క పోలవరం ప్రాజెక్టు శరవేగంగా పూర్తి చేసుకుంటున్నాం. ఆగ్నేయాసియాకు ముఖ ద్వారంగా మలిచే క్రమంలో 'సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్‌'గా బ్రాండింగ్ చేసుకోగలిగాం. అమరావతి గురించి ఇప్పుడు ప్రపంచంలో చర్చ మొదలైంది. దేశం గర్వించే నగరంగా కొత్త రాజధానిని నిర్మించుకుంటున్నాం. మంత్రి లోకేశ్ బృందం పర్యటనలో పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజాలు ఏపీ వైపు చూసేలా చేయగలగడంలో విజయం సాధించడం ఈ గణతంత్ర దినోత్సవాన ఒక శుభసూచకమని' అభివర్ణించారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి దేశ అత్యున్నత 'భారతరత్న' పురస్కారం లభించడం సముచితమని సీఎం చంద్రబాబు చెప్పారు. అలాగే నానాజీ దేశ్‌ముఖ్, భూపెన్ హజారికాలకు మరణానంతరం భారత రత్న పురస్కారాలు దక్కడం సంతోషకమన్నారు. ఇద్దరు తెలుగు ప్రముఖులు సినీగీత రచయిత సిరివెన్నల సీతారామశాస్త్రి, చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారికలకు పద్మ పురస్కారాలు దక్కడం అభినందనీయమన్నారు. ఎన్ని పర్యాయాలు, ఎన్ని అభ్యర్థనలు చేసినా స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడంలో కేంద్రంలో అధికారంలో ఉండే ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

సేవకు సత్కారం

- ఇద్దరికి రాష్ట్రపతి మెడల్స్.. 15 మందికి పోలీసు పతకాలు
- ఏపీ పోలీసులకు పురస్కారాలు.. రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీసులకు వివిధ విభాగాల్లో రాష్ట్రపతి అవార్డులు లభించాయి. ఏటా గణతంత్ర దినోత్సవం(జనవరి 26) సందర్భంగా విశేష సేవ చేసిన వారికి, అపూర్వ ప్రతిభ కనబరిచిన పోలీసులకు పురస్కారాలు ఇవ్వడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా పలువురు పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు వరించాయి. అవార్డులు పొందిన వారి జాబితాను శుక్రవారం కేంద్ర హోం శాఖ ప్రకటించింది. రాష్ట్రం నుంచి ఇద్దరికి రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు, 15 మందికి ప్రతిభావంతమైన సేవకు పోలీసు పతకాలు, ముగ్గురికి సంస్కరణ సేవా పతకాలు లభించాయి. దేశవ్యాప్తంగా 855 పోలీసు సిబ్బందికి పతకాలు అందించగా.. వీరిలో ముగ్గురికి రాష్ట్రపతి పోలీసు శౌర్య పతకాలు, 146 మందికి పోలీసు శౌర్య పతకాలు, 74 మందికి విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకాలు, 632 మందికి ప్రతిభావంతమైన సేవకు పతకాలను ప్రకటించారు.

విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకం

- అడ్డాల వెంకటరత్నం, ఎస్పీ, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, పోరంకి
- కింజరాపు వెంకట రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీ, విశాఖపట్టణం

ప్రతిభావంతమైన సేవకు పోలీసు పతకం

- ఎస్ హరికృష్ణ, ఎస్పీ, ఇంటెలిజెన్స్, విజయవాడ
- వరుపుల సత్తిరాజు, డీఎస్పీ(ఏఆర్), రాజమహేంద్రవరం
- కొత్తపల్లి సామ్ వినోద్ కుమార్, డీఎస్పీ(ఎస్సీ, ఎస్టీ సెల్), కర్నూలు
- కల్లా జనార్ధన్ నాయుడు, డీఎస్పీ, ఇంటెలిజెన్స్, తిరుపతి
- పాలేటి మోహన్ ప్రసాద్, అడిషనల్ కమాండెంట్, ఏపీఎస్పీ, విశాఖపట్నం
- పెనుముడి కిరణ్ కుమార్, అస్సాల్ట్ కమాండర్, గ్రేహౌండ్స్, హైదరాబాద్
- వెన్నపూస వేణుగోపాల్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్, విజయవాడ
- బండారు రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్(పోలీస్ ట్రైనింగ్ కాలేజీ), ఒంగోలు
- మంత్రిప్రగడ వెంకట గణేశ్, ఇన్‌స్పెక్టర్, ఏసీబీ, విశాఖపట్నం
- నటేశం గుణశేఖర్, ఎస్సై, రోడ్డు భద్రత పెట్రోలింగ్, బంగారుపాళ్యం
- షేక్ ముక్తాక్ అహ్మద్ బాషా, ఏఆర్ ఎస్సై, హైదరాబాద్
- గంగవరపు వెంకట రామారావు, హెడ్ కానిస్టేబుల్, విశాఖపట్నం
- గోపిశెట్టి సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్, ఆర్మ్‌డ్ రిజర్వు, విజయవాడ సిటీ
- ఇంజారపు వీరవెంకట సత్యసాయి ప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఐబీ, పోరంకి
- భోగాది వెంకటేశ్వరరావు, రైల్వే పీసీ, విజయవాడ

విశిష్ట సంస్కరణ సేవా పతకం

- వేమూరి వెంకట కోటి వీర దుర్గాప్రసాద్, హెడ్ వార్డర్, సబ్ జైల్, సత్తెనపల్లి.

ప్రతిభావంతమైన సంస్కరణ సేవా పతకం

- పుట్టి గంగసాయిరాం ప్రకాశ్, సుపరింటిండెంట్, కేంద్ర కారాగారం, రాజమహేంద్రవరం
- గెడ్డం జయవర్ధన్, ఐజీ, ఏపీ సంస్కరణ సర్వీసు, విజయవాడ

విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకం (కేంద్రీయ విభాగంలో)

- ప్రకాశ్‌రావు నెడ్నూరికర్, అసిస్టెంట్ డైరెక్టర్, విజయవాడ(కేంద్ర హోం శాఖ)

ప్రతిభావంతమైన సేవకు పోలీసు పతకం (కేంద్రీయ విభాగంలో)

- మొదలవలస నాయుడు పోలు, ఇన్‌స్పెక్టర్, గన్నవరం, కృష్ణా జిల్లా(సీఆర్‌పీఎఫ్)
- రాము గొల్ల, హెడ్‌కానిస్టేబుల్, సీబీఐ ఏసీబీ, విశాఖపట్నం(సీబీఐ)
- జాహిద్ ఖాన్, కమాండెంట్, 10వ బెటాలియన్, గుంటూరు(ఎన్‌డీఆర్ఎఫ్)
- టీ మదన్ మోహన్ రెడ్డి, బీఎస్ఎఫ్.


30న మంత్రిమండలి సమావేశం

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశం ఈ నెల 30న ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో నిర్వహించనున్నట్లు సీఎస్ అనిల్ చంద్ర పునేఠ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండడంతో సభలో ప్రవేశపెట్టాల్సిన అంశాలపై మంత్రిమండలి సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం తర్వాత సభను వాయిదావేసి, తిరిగి 4వ తేదీ నుంచి సమావేశాలు కొనసాగించనున్నట్లు సీఎస్ తెలిపారు.

మోదీది నమ్మక ద్రోహం

'కొన్ని రాజకీయాలు మాట్లాడాలి. 2014లో మీరు గెలిపించారు. ప్రధాని మోదీపై ఆశలు పెట్టుకున్నాం. కానీ అండగా ఉంటానని ఆయన నమ్మక ద్రోహం చేశారు. కడప స్టీలు ప్లాంటు ఇవ్వకపోవడంతో రాయలసీమ ఉక్కు ఫ్యాక్టరీ మనమే ప్రారంభిస్తున్నాం. మీ అందరి కోసం.. రాష్ట్ర హక్కుల కోసం నేను పోరాడుతుంటే.. పులి వెందుల మోదీ, హైదరాబాద్ మోదీ, ఢిల్లీ మోదీలు ఇబ్బందులు పెడుతున్నారు. గద్దల్లా రాష్ట్రంపై వాలారు. ఇప్పటి వరకు రూ.1.16 లక్షల కోట్లు కేంద్రం నుంచి రావలసి ఉంది. జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.4 వేల కోట్లు బకాయిలున్నాయి. మోదీపై మనం పోరాటం చేస్తుంటే కోడికత్తి పార్టీ రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేయడం లేదు. కేసుల మాఫీ కోసం జగన్ కేంద్రంతో కలిసిపోయారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే తొలి సంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసమేనని కాంగ్రెస్ చెప్పడంతో ఆ పార్టీతో కలిసి పనిచేస్తున్నాం. కొందరు మతం, కులం పేరు తీసుకొస్తారు. వాళ్లు ఉన్నప్పుడు ఏం చేశారో.. నేనేమి చేశానో గట్టిగా అడగండి.. మళ్లీ ఈ పసుపు కుంకుమ కొనసాగించాలి.. టీడీపీ ప్రభుత్వం వస్తే ఇవన్నీ అమలవుతాయని చప్పట్లు కొట్టి ఆశీర్వదించండి. ఒక ప్రభుత్వం నిరంతరాయంగా ఉంటే.. మంచి నాయకుడు ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. నాయకుడు సేవకుడిగా ఉంటేనే ప్రజలు ప్రగతిపథంలో నడుస్తారు. మా చెల్లెమ్మలను గట్టిగా అడుగుతున్నా. మీ భవిష్యత్ బాగుపడాలంటే రానున్న 75 రోజులు కష్టపడేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా..? వైసీపీ అతి తెలివిగా ప్రవర్తిస్తూ తప్పుడు ప్రచారం చేస్తోంది. తన మీడియాలో దుష్ప్రచారం చేస్తోంది. మీరంతా నాకు అండగా ఉంటే వారికి డిపాజిట్లు కూడా రావు.. కుట్రలు, కుతంత్రాలు నమ్మొద్దు. మీ అందరికీ పాదాభివందనం.. నన్ను ఆశీర్వదించండి.'

పది వేల పండగ



విశాఖ సభకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు, అభివాదం చేస్తున్న సీఎం



విశాఖ సభలో చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మీ వాళ్లెవరైనా ఇచ్చారా..?

'మీ అమ్మ.. నాన్న.. మీ భర్త.. ఎవరైనా రూ.20 వేల డబ్బులిచ్చి స్వేచ్ఛ ఇచ్చారా? మీకు ఎప్పుడు ఏ కష్టమొచ్చినా ఆదుకోవడానికి నేనున్నాను. రూ.20 వేలు మీ చేతిలో పెట్టేందుకు రూ.21 వేల కోట్లు కేటాయించాను. ఇంకా ఇస్తాను. ఆర్థికంగా బలపడడంతో మీలో ధైర్యమొచ్చింది. సమాజ సేవతో ఊళ్లలో నాయకురాళ్లుగా ఎదిగారు. ఈ రోజు డబ్బు ఇవ్వడం కాదు.. సంపాదన నేర్పుతున్నాను. ఆత్మగౌరవంతో మీ కుటుంబానికి సాయం చేయవచ్చు.'

వెలుగు ఉద్యోగులకు అన్నీ..

'డ్వాక్రా సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వెలుగు ఉద్యోగుల జీతాలు 30 శాతం పెంచుతున్నాం. వారికి హెల్త్‌కార్డు, ప్రమాదబీమా, మెడికల్ లీవ్‌లు ఇస్తాం. వేతనంపై హెచ్‌ఆర్, ఈపీఎఫ్ మంజూరుచేస్తాం. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఉంది. కేబినెట్ సబ్ కమిటీ సిఫారసుల మేరకు చర్యలు తీసుకుంటాం.'

టీడీపీ గెలిస్తేనే పథకాలు కొనసాగుతాయ్

'మరో 75 రోజుల్లో జరిగే ఎన్నికల్లో మనం గెలిస్తేనే ఈపథకాలు కొనసాగుతాయి. మీగురించి ఆలోచించే వారికోసం మీరు ఆలోచించండి. మన పిల్లలు, వారి భవిష్యత్ కోసం మళ్లీ మనమే రావాలి. రాష్ట్ర విభజన వల్ల ఆదాయం తెలంగాణకు.. అప్పులు మనకు వచ్చాయి. కేంద్రం సహకరించకున్నా ఈ ఐదేళ్లలో నిలదొక్కుకున్నాం. పదేళ్లు కష్టపడితే దేశంలో నంబర్‌వన్ రాజధానిని నిర్మించుకుంటాం. 25 లోక్‌సభ సీట్లు గెలిస్తేనే ఢిల్లీ మన మాట వింటుంది. 150 కంటే ఎక్కువ అసెంబ్లీ స్థానాలు గెలిస్తే పాలనను సునాయాసంగా ముందుకు తీసుకెళ్లగలం.'

ఈసారి మోదీ ఇంటికే..!

- వినయ విధేయతే నాయకత్వ లక్షణం
- జగన్ అహంభావం వల్లే నేతలు దూరం
- తప్పుడు సర్వేలు ఆయనకు అలవాటే
- టీడీపీ నాయకులతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఇంటికి పోయే సమయం వచ్చిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ నినాదం మార్మోగుతోంది. యునైటెడ్ ఇండియా ర్యాలీలతో దేశం హోరెత్తుతోంది. ప్రజావ్యతిరేక పాలనను దేశం భరించదు. మోదీ వ్యతిరేకత ప్రజాస్వామ్య అనివార్యత. బీజేపీ వ్యతిరేకత రాజకీయ అనివార్యత. రైతులు, మహిళలు, యువత వైసీపీకి, బీజేపీకి దూరమయ్యారు. మొన్న జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడింది. ఇప్పుడు సర్వేల్లో మోదీ వ్యతిరేకత స్పష్టమైంది. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, దాని కీలు బొమ్మ పార్టీల ఓటమి తప్పదు' అని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఉండవల్లిలోని తన నివాసం నుంచి టీడీపీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడారు. 'నాయకుడనే వాడికి అహంభావం ఉండకూడదు. ప్రజల పట్ల వినయ విధేయతే నాయకత్వ లక్షణం. ప్రజాభిమానమే ప్రతి నాయకుడికి ప్రాణం. డబ్బుతో దేనినైనా కొంటాననేది జగన్ అహంభావం. ఎన్నికల ముందు దొంగ సర్వేలు ఆయనకు అలవాటే. 2014 ఎన్నికల ముందు కూడా ఇలాగే తప్పుడు సర్వేలు చేయించారు. కానీ టీడీపీ ఘన విజయం సాధించింది. 'చెడు జరగాలి. అభివృద్ధి ఆగిపోవాలి" అనేదే జగన్ ఉద్దేశం. ప్రభుత్వంపై దుష్ప్రచారంలో ఆయన ఘనాపాఠి' అని ధ్వజమెత్తారు.

మరో నాలుగు రెట్ల సంక్షేమం

'రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి గొప్ప చరిత్ర. రాబోయే ఐదేళ్లలో చేసేది మరో చరిత్ర. ఇంతకు నాలుగు రెట్లు పేదలకు సంక్షేమ ఫలాలు ఇస్తాం. ప్రజలకు మరింత మేలు చేసేందుకు ప్రతి టీడీపీ నేతా ప్రతి రోజూ 10 ఓట్లు టీడీపీకి అదనంగా రాబట్టాలి. అభిప్రాయ భేదాలను విడనాడాలి. కలిసికట్టుగా ముందుకు పోవాలి. అధికారంలో ఉన్నాం కాబట్టే ఇన్ని పదవులు ఇవ్వగలిగాం. రాబోయే ఎన్నికల్లో గెలిస్తే మరిన్ని పదవులు, మరింత గుర్తింపు పొందవచ్చు' అని సీఎం పేర్కొన్నారు. జగన్ అహంభావం భరించలేకే వంగవీటి రాధా బయటకు వచ్చారని.. వైసీపీ విధానాలు నచ్చకే ఆ పార్టీని వీడానని ఆదిశేషగిరిరావు కూడా అన్నారని.. అవమానాలు భరించలేకే అనేక మంది ఆ పార్టీకి దూరమయ్యారని చెప్పారు. 'టీడీపీకి 65 లక్షల సైన్యం ఉంది. సంస్థాగతంగా ఇంత బలమైన పార్టీ మరొకటి లేదు. అందరూ కలిసి, తిరుగులేని శక్తిగా టీడీపీని రూపొందించాలి' అని పార్టీ నేతలకు పిలుపిచ్చారు.

అన్నగా నేనున్నా!



కడప సభలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న సీఎం

94 లక్షల సైన్యం నాకు అండ..

'డ్వాక్రా నా మానస పుత్రిక. స్థాపించి.. పోషించి.. ప్రోత్సహించాను. ఇది నా వ్యక్తిగత విజయమే. ఈ వ్యవస్థ రాష్ట్రంలో ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుంది. 23 ఏళ్లలో 94 లక్షల మంది డ్వాక్రా సభ్యులయ్యారు. మరో ఆరు లక్షల మంది చేరితే కోటి మంది సైన్యం నాకు అండగా ఉంది. అప్పట్లో దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన తొలి రాష్ట్రం మనదే. మహిళలకు గ్యాస్ ఇస్తే అడ్డుపడిన వారంతా 1999లో ఓటమిపాలయ్యారు. అక్కలు, చెల్లెళ్లు అండగా ఉన్నంత వరకు నన్నెవరూ ఏమీ చేయలేరు. నాలుగున్నరేళ్లలో ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.10 వేల చొప్పున అందజేశాను. ఇప్పుడు ఇంకో పది వేలు అందించాలని నిర్ణయించాను. దీనికి రూ.9,400 కోట్ల వ్యయమవుతుంది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా చెక్కుల రూపంలో అందజేస్తాం. రాబోయే రెండు నెలల్లో రూ.10 వేలు మీ ఖాతాల్లో జమచేస్తాం. పసుపు-కుంకుమ కింద మొత్తం రూ.21,116 కోట్లు ఇచ్చాను.'

ఇంటికి పెద్ద కొడుకుగా పింఛన్లు

'చరమాంకంలో పిల్లలు సరిగ్గా చూడడం లేదు. అందుకే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తున్నాం. ఇంటికి పెద్ద కొడుకుగా పింఛను మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2వేల వరకు పెంచాను. గతంలో రూ.200 ఇచ్చి 200 సార్లు చెప్పుకొన్నవారున్నారు. రాష్ట్రంలో 55 లక్షల మందికి రెట్టింపు పింఛన్లు ఇచ్చేందుకు రూ.14 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. మా ఇంట్లో ఎవరూ పట్టించుకోవడంలేదన్నవారే.. రెట్టింపు పెన్షన్‌తో నేడు కోడళ్లు బాగా చూసుకుంటున్నారని చెబుతున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

మూడు ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. అమరావతిలోని నేలపాడులో కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాలకు చెందిన డ్వాక్రా సభ్యులు; కడప మున్సిపల్ మైదానంలో రాయలసీమ, నెల్లూరు జిల్లాల డ్వాక్రా మహిళలు; విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల స్వయంసహాయ బృందాలతో జరిగిన ఈ భారీ సమ్మేళనాల్లో ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి డ్వాక్రా సంఘాలకుందన్నారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేందుకే పసుపుకుంకుమ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. దేవుడు దయతలిస్తే ఇది నిరంతరం కొనసాగుతుందని ప్రకటించారు. చెల్లెళ్లంతా ఆనందంగా ఉండాలంటే అన్న అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా.. తప్పుడు విమర్శలు చేస్తున్న వారిని చిత్తుచిత్తుగా ఓడించాలని కోరారు. విమర్శలు చేసేవారు హైదరాబాద్‌లో ఉంటారని.. వారి భరతం పట్టాలన్నారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

కనీసం ఒకరినైనా కనాలి..

'ప్రతి ఒక్కరూ ఒకే బిడ్డను కనాలని గతంలో నేనే చెప్పాను. సంపూర్ణ కుటుంబ నియంత్రణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదే. ఇప్పుడు యువత పరిస్థితి మారింది. కొందరు పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. మరికొందరు పిల్లలను కనడానికి ఇష్టపడడం లేదు. కనీసం ఒకరినైనా కనాలి. మన దేశ విశిష్ట గౌరవం కుటుంబ వ్యవస్థ. పంచాయతీలో పోటీ చేసేందుకు ఇద్దరు పిల్లల లోపే ఉండాలన్న నిబంధనను తొలగించాలని నిర్ణయించాం.'

సంఘాలవారీగా స్మార్ట్ ఫోన్లు

'త్వరలో 1.40 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ ఫోన్లు అందిస్తాం. స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం డ్వాక్రా సంఘాలతోనే ప్రారంభిస్తాం. ముందుగా రాష్ట్ర సమాఖ్య, తర్వాత జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యలు, అనంతరం డ్వాక్రా సంఘాలవారీగా పంపిణీ చేపడతాం. 40 రోజుల్లో ఫోన్ల పంపిణీ జరుగుతుంది. డ్వాక్రా మహిళలు కూడా పారిశ్రామికవేత్తలు కావాలి. 10 లక్షల సంఘాలు 10 లక్షల విజన్ డాక్యుమెంట్లు చేయాలి. మనం చేసే పనులు వినూత్నంగా ఉండాలన్నారు. 94 లక్షల మందితో జవాబుదారీతనంతో పనిచేయిస్తే ఆదాయం వస్తుంది. టెక్నాలజీని విరివిగా వినియోగించుకోవాలి. మండలానికో ఎంఎస్ఎంఈ కేంద్రాలు పెడుతున్నాం. వీటిలో డ్వాక్రా సంఘాలకు ప్రాధాన్యమిస్తాం. మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ చేస్తాం. దేశవిదేశాలకూ ఎగుమతి చేస్తాం. గతంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు 30 శాతం వడ్డీతో ప్రజల్ని పీక్కుతింటున్నప్పుడు తిరగబడాలని పిలుపిచ్చింది నేనే. గతంలో ఐదేళ్ల వైఎస్ ప్రభుత్వంలో మహిళా సంఘాలకు రూ.200 కోట్లు ఇచ్చారు. ఈ నాలుగున్నరేళ్లలో రూ.21 వేల కోట్లు మహిళా సంఘాలకు అందించాం.'

మిమ్మల్ని చూస్తుంటే అభిమానం పొంగుతోంది..

'అన్ని జిల్లాల నుంచి వచ్చిన చెల్లెమ్మలు, అక్కలను చూస్తుంటే అభిమానం పొంగిపోతోంది. ముఖ్యమైన సంఘ నాయకులంతా ఉన్నారు. జిల్లా సమాఖ్యల నాయకురాళ్లు నాకు ఎంతో అభిమానమైనవారు. ఇంత పెద్ద ఎత్తున ఆడబిడ్డలకు అన్నగా ఉండడం ఎంతో గర్వపడుతున్నాను. ఒకరిద్దరు కాదు.. 94 లక్షల మంది అక్కచెల్లెళ్లు ఉండడం నిజంగా ఆనందంగా ఉంది. పసుపు కుంకుమ ఇస్తే మీరు ఆనందంగా ఉన్నారా..? మిమ్మల్ని చూస్తుంటేనే ఆనందంగా ఉన్నారనేది అర్థమవుతోంది. నా జన్మ చరితార్థమైంది. ఏ నాయకుడైనా మీ అభిమానం, మీ ఆదరణ కోసమే పనిచేస్తాడు. మీరు కూడా మేం చేసిన పనుల పట్ల ఆనందంగా ఉంటే అంతకంటే సంతోషం లేదు. మీరు ఆనందంగా ఉండాలంటే.. అన్న అధికారంలో ఉండాలి. గతంలో పసుపు కుంకుమ కింద రూ.8600 కోట్లు, వడ్డీ లేని రుణాల కోసం రూ.2500 కోట్లు.. మొత్తం రూ.11,118 కోట్లు డ్వాక్రా సంఘాలకు అందించాం. ఈ నాలుగున్నరేళ్లలో వడ్డీ లేని రుణాలు రూ.67,500 కోట్లు అందించి చరిత్ర సృష్టించాం.'



అమరావతి సభలో చంద్రబాబు పథకాలకు ఆమోదం తెలుపుతున్న మహిళలు



కడపలో పసుపు కుంకుమ ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళలు

ఆడబిడ్డలకు ఎన్నెన్నో..

'ఆడబిడ్డలకు సైకిళ్లు, శానిటరీ ప్యాడ్స్ ఇస్తున్నాం. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు ప్రతిదానికీ ప్రభుత్వం తరపున సాయం అందిస్తున్నాం. ప్రసవ సమయంలో రూ.ఆరు వేలు ఇస్తున్నాం. ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువెళ్లేందుకు తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్, పౌష్టికాహారం కోసం బాలామృతం, పిల్లల కోసం ఎన్టీఆర్ బేబీ కిట్స్ అందిస్తూ మహిళలను గౌరవిస్తున్నాం. పిల్లల తల్లులకు వందనాలు. చదువు కోసం జ్ఞానభూమి, సైకిళ్లు, విదేశీ విద్య కోసం పది నుంచి రూ.15 లక్షలు, యువతకు నిరుద్యోగ భృతి, సీఎం యువ నేస్తం, ఆదరణ పథకాలు అమలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ వైద్యసేవ కింద అందించే సాయాన్ని రూ.5 లక్షలకు పెంచుతున్నాం. ప్రతి ఆడబిడ్డకు సొంత ఇల్లు ఒక కల. ఇప్పటివరకు మహిళల పేరిట 27 లక్షల ఇళ్లు నిర్మించాం. ఇది ధనిక రాష్ట్రాలకు కూడా సాధ్యం కాలేదు. మిమ్మల్ని నిరంతరం కంటికి రెప్పలా చూసుకుంటే అభివృద్ధిలో నడిపించే బాధ్యత నాదే. చివరకు ప్రకృతి సేద్యంలో కూడా మన మహిళలు ఎంతో ముందంజలో ఉన్నారు.'

మాది ఐక్యపోరాటం

విశాఖపట్నంలో జనసైనికులతో సమావేశమైన పవన్





విశాఖపట్నంలో జనసేన అధ్యక్షుడు పవన్‌తో భేటీ అయిన సీపీఐ, సీపీఎం నేతలు సురవరం, రాఘవులు

మీడియాతో పవన్, సురవరం, రాఘవులు

విశాఖపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): "ప్రజా సమస్యలపై జనసేన, సీపీఐ, సీపీఎంలకు ఒకే రకమైన భావజాలం ఉండడంతో కలిసి పనిచేస్తున్నాం. ప్రజా ఉద్యమాలను రాజకీయ స్థాయికి తీసుకువెళ్లడం, రాబోయే ఎన్నికల్లో ఏ విధంగా కలిసి ముందుకు వెళ్లాలి అన్న అంశాలను సమావేశంలో చర్చించాం. ఫిబ్రవరిలో ఉమ్మడి ప్రణాళిక రూపొందిస్తాం. అప్పుడే సీట్ల సర్దుబాటుపైనా చర్చలు ఉంటాయి" అని జనసేనాని పవన్ కల్యాణ్ తెలిపారు. విశాఖపట్నంలో ఓ ప్రైవేటు రిసార్ట్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వామపక్ష అగ్రశ్రేణి నేతలు, జనసేన నేతలు సమావేశమయ్యారు. పలు అంశాలపై వివరంగా చర్చించారు. అనంతరం పవన్ వామపక్ష నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. "పర్యావరణ కాలుష్యం, మైనింగ్ విధానం, భూసేకరణ చట్టం, జనసేన నిజనిర్ధారణ కమిటీ నివేదిక... తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించాం. ఈవీఎంలపై ఆరోపణలు వస్తున్నందున వాటిపై చర్చకు మేం డిమాండ్ చేస్తున్నాం" అని పవన్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సురవరం సుధాకరరెడ్డి, బీవీ రాఘవులు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. దిగువ తీర్మానాలను సమావేశం ఆమోదించిందని నేతలు మీడియాకు వివరించారు.

తీర్మానాలు:

- రాష్ట్రాభివృద్ధిలో సహజ సంపద, పర్యావరణం దోహదపడతాయి. పర్యావరణహితంగా సహజ వనరుల వినియోగం సాగాలి. చట్టబద్ధ, హేతుబద్ధ మైనింగ్ జరగాలి.
- అక్రమ మైనింగ్‌తో సామాజిక విభేదాలు పెరుగుతున్నాయి. విశాఖ మన్యంలో బాక్సైట్, లాటరైట్ తవ్వకాన్ని వ్యతిరేకిస్తున్నాం. వాటిని వెంటనే నిలిపివేయాలి. బాక్సైట్ తవ్వకాలను నిషేధించాలి. ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జీవో 97 రద్దు చేయాలి.
- భూసేకరణ సమయంలో గిరిజనులు, ఇతరుకు తక్షణమే సహాయ పునరావాస కార్యక్రమాలను అందజేయాలి.
- గిరిజనులను ఇతర ప్రాంతాలకు తరలించేముందు వారితో ముందుగా సంప్రదింపులు చేపట్టాలి.
- వాయు, నీటి, శబ్ద కాలుష్యం తీవ్రమైంది. ఇది మనిషి జీవన ప్రమాణాలను దిగజారుస్తుంది.
- భూసేకరణకు ముందే పరిహారం చెల్లించాలి.
- పరిహారం చెల్లింపులో వ్యత్యాసాల కారణంగా ప్రజల మధ్య విభేదాలు తీవ్రమవుతున్నాయి. కనుక వ్యత్యాసాలు లేకుండా చూడాలి.
- పట్టణాల్లోనూ, నగరాల్లోనూ భూసేకరణ చేపట్టే సమయంలో ప్రభుత్వ భూముల స్వాధీనానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- పోలవరం, వంశధార, అమరావతి ప్రాంతాల్లో గిరిజనులు, రైతులు, మత్స్యకారులను తరలించే సమయంలో 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి.
- రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై జనసేన నిజ నిర్ధారణ కమిటీ పనిచేస్తూనే ఉంటుంది. పోరాటం కొనసాగిస్తుంది.
- కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు చేయడంలో మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భావిస్తున్నారు.
- రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం గట్టిగా పోరాటం చేయాలి. ఇందుకోసం త్వరలోనే కార్యాచరణను సిద్ధం చేయాలి.
- దేశ వ్యాప్తంగా మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో గళమెత్తిన వారి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోంది. అవినీతి పెరిగిపోయింది.
- మహిళలు, దళితులు, ఆదివాసీల హక్కులను కాపాడాలి.

గంటా పక్షి... నమ్మను

- వెన్నుపోటు పొడిపించుకునే బలహీనుడిని కాదు
- కార్యకర్తల సమావేశంలో పవన్ కల్యాణ్

విశాఖపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'మంత్రి గంటా శ్రీనివాసరావును జనసేన పార్టీలోకి ఆహ్వానించేది లేదు. ఆయనపై నాకు కోపం లేదు. అతని ఆలోచన ధోరణి జనసేనకు సరిపడదు. గంటా లాంటి వ్యక్తులు పక్షుల్లా వచ్చి ఎగిరిపోతారు. అలాంటి పక్షులను నమ్మను" అని జనసేనాని పవన్ అన్నారు. విశాఖ జిల్లా పార్టీ కార్యకర్తలతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. 'అవినీతిపరులైన వ్యక్తులు పార్టీలోకి వచ్చినావారు దోచుకున్నదంతా ప్రజలకు పంచిపెట్టి సంస్కారవంతులు కావాలని ఆకాంక్షిస్తా. రాజకీయాలను లోకేశ్, జగన్ వంటి వారు వారసత్వపు హక్కుగా భావిస్తారు. జనసేన మాత్రం సామాజిక బాధ్యతగా పరిగణిస్తుంది. 2019లో పదునైన వ్యూహంతో ఏపీ అసెంబ్లీలోకి జనసేన అడుగు పెడుతుంది. నీతిపరులు, అవినీతిపరులు అని విడదీసుకుంటూ పోతే రాజకీయాలు చేయలేం. రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలంటే ఆ బురదలో దిగక తప్పదు. అందులో కమలంలా జనసేనను వికసింపజేస్తాం. వెన్నుపోటు పొడిపించుకునేంత బలహీనుడిని కాదు' అని పవన్ అన్నారు.

తొలి టెస్ట్-నాలుగో రోజు
ఇంగ్లండ్ X వెస్టిండీస్
రా. 7.30 నుంచి
సోనీ టెన్-1లో...

తొలి టెస్ట్ - మూడో రోజు
ఆస్ట్రేలియా X శ్రీలంక
ఉ. 8.30 నుంచి
సోనీ టెన్-3లో...



హారిక



బచేంద్రి పాల్



శరత్ కమల్



గంభీర్



బజరంగ్ పూనియా



బొంబ్యాలా

ఇక.. పద్మశ్రీ హారిక



సునీల్ ఛెత్రి

- గంభీర్, ఛెత్రి, శరత్ కమల్‌లకు కూడా
- బచేంద్రిపాల్‌కు పద్మభూషణ్
- 8 మంది క్రీడాకారులకు పద్మ పురస్కారాలు

న్యూఢిల్లీ: భారత చెస్ గ్రాండ్‌మాస్టర్, తెలుగు తేజం ద్రోణవల్లి హారికకు ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ పురస్కారం దక్కింది. 70వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం పద్మ అవార్డులను ప్రకటించింది. క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చిన గౌతం గంభీర్, సునీల్ ఛెత్రి, శరత్ కమల్, అజయ్ ఠాకూర్, ప్రశాంతి సింగ్, బొంబ్యాల దేవి, బజరంగ్ పూనియా పద్మశ్రీకి ఎంపికయ్యారు. గుంటూరుకు చెందిన హారిక చిన్ననాటి నుంచే చెస్‌లో ప్రతిభ కనబరుస్తూ అంచెలంచెలుగా గ్రాండ్‌మాస్టర్ హోదాకు చేరుకుంది. అలాగే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ (2012, 2015, 2017)లో కాంస్య పతకాలతో రాణించింది. 2010 ఆసియా గేమ్స్‌లోనూ కాంస్యం అందుకుంది. మరోవైపు 2007-08లోనే హారిక అర్జున అందుకోవడం విశేషం. ఇక తెలుగు నేపథ్యమున్న శరత్ కమల్ ప్రస్తుతం చెన్నైలో నివసిస్తుండగా గతేడాది కామన్వెల్త్ గేమ్స్‌లో ఓ స్వర్ణం, రజతం, కాంస్యంతో మెరిశాడు. ఇక భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి అసమాన ప్రదర్శనతో జట్టును విజయపథంలో నడిపిస్తున్నాడు. అంతేకాకుండా ఇటీవలి ఆసియా కప్‌లో రికార్డు గోల్స్ (67)తో మెస్సీ (65)నే అధిగమించడం తెలిసిందే. తన తల్లిదండ్రులు ఆర్మీలో ఉద్యోగరీత్యా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఉన్న సమయంలో ఛెత్రి జన్మించాడు. గతేడాది అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన గౌతం గంభీర్ 2011 ప్రపంచకప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. ఇక గతేడాది ఆసియా గేమ్స్‌లో స్వర్ణం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం అందుకొని రెజ్లర్ బజరంగ్ పూనియా సత్తా చాటుకున్నాడు. మరోవైపు ప్రముఖ పర్వతారోహకురాలు, 64 ఏళ్ల బచేంద్రిపాల్ మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ అందుకోనుంది.

క్రీడా పద్మాలు

పద్మభూషణ్: బచేంద్రిపాల్ (పర్వతారోహకురాలు)

పద్మశ్రీ: ద్రోణవల్లి హారిక (చెస్), శరత్ కమల్ (టీటీ), గంభీర్ (క్రికెట్), సునీల్ ఛెత్రి (ఫుట్‌బాల్), బజరంగ్ పూనియా (రెజ్లర్), అజయ్ ఠాకూర్ (కబడ్డీ), బొంబ్యాల దేవి (ఆర్చరీ), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్).



నడాల్



జొకోవిచ్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. చాన్నాళ్ల తర్వాత చిరకాల ప్రత్యర్థులు నొవాక్ జొకోవిచ్, రఫెల్ నడాల్ మధ్య ఓ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌ఫైట్‌కు రాడ్ లేవర్ ఎరీనా వేదిక కానుంది. రికార్డుస్థాయిలో ఏడోసారి చాంపియన్‌గా నిలవడమే లక్ష్యంగా జొకో మెల్‌బోర్న్ పార్క్‌లో తుది పోరుకు చేరాడు. సెమీఫైనల్లో ఫ్రెంచ్ సంచలనం లుకాస్ పౌలీని చిత్తుగా ఓడించి వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్‌తో హ్యాట్రిక్ కొట్టేందుకు అడుగు దూరంలో నిలిచాడు. ఆదివారం జరిగే అంతిమ సమరంలో స్పెయిన్ బుల్‌ను ఈ సెర్బియా యోధుడు ఢీకొననున్నాడు.

అదే జోరు సాగనీ...

న్యూజిలాండ్ గడ్డపై రెండో వన్డే సిరీస్ కోసం ఎదురుచూస్తున్న భారత్ మరో పోరుకు సిద్ధమవుతోంది. స్పిన్ జోడీ కుల్దీప్, చాహల్ సుడులు తిరిగే బంతులకు తోడు బ్యాటింగ్‌లోనూ అదరగొట్టిన టీమిండియా తొలి వన్డేను వశం చేసుకోగా.. ఇప్పుడు అదే జోరుతో రెండో మ్యాచ్‌లోనూ నెగ్గాలని భావిస్తోంది. అటు రెండు విభాగాల్లోనూ విఫలమైన ఆతిథ్య కివీస్ మాత్రం తీవ్ర ఒత్తిడిలో బరిలోకి దిగుతోంది.

కివీస్‌తో నేడు రెండో వన్డే ● ఉత్సాహంగా భారత్



స్టార్ స్పోర్ట్స్ 1, 3 లో
ఉదయం 7.30
గంటల నుంచి

మౌంట్ మాంగనూ: ఆస్ట్రేలియా పర్యటనలోని విజయాల జోష్‌ను భారత జట్టు న్యూజిలాండ్‌పైనా కొనసాగిస్తోంది. అదిరిపోయే ఆటతీరుతో ఐదు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్న కోహ్లీ సేన నేడు (శనివారం) రెండో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో విలియమ్సన్ సేన భారత బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తడబడింది. ఆరంభంలో పేసర్ షమి.. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ ధాటికి కివీస్ పరుగులు సాధించడంలో విఫలమైంది. ఇక సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు అదే ఉత్సాహంతో రెండో విజయం కోసం బరిలోకి దిగబోతోంది. జట్టులో దాదాపుగా మార్పులకు అవకాశం లేదు. అలాగే ఇక్కడి బే ఓవల్ మైదానంలో కివీస్ ఆరు మ్యాచ్‌లు ఆడితే మూడు గెలిచి మూడింట్లో ఓడింది. అటు భారత్‌కు ఇక్కడ ఇదే తొలి మ్యాచ్.

మార్పుల్లేకుండానే...!

తొలి వన్డేలో శిఖర్ ధవన్ ఫామ్‌ను అందుకోవడం జట్టుకు సానుకూలాంశం. అయితే చివరి మూడు మ్యాచ్‌ల్లో రోహిత్ ఓ మాదిరి స్కోరుకే అవుటైనా ఒక్కసారి కుదురుకుంటే అతడిని ఆపడం కష్టమే. తొలి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ త్రుటిలో అర్ధ సెంచరీ కోల్పోగా, రాయుడు కూడా కొద్దిసేపే క్రీజులో ఉన్నా దూకుడు కనబరిచాడు. వీరి హవాతో తొలి మ్యాచ్‌లో మిడిలార్డర్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. బౌలింగ్‌లో బుమ్రా లేకున్నా షమి, భువనేశ్వర్ ఆ లోటును కనిపించకుండా రాణించారు. ఇక స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ ఈ మ్యాచ్‌లోనూ కీలకమే. ఐదో బౌలర్ విజయ్ శంకర్, ఆరో బౌలర్ కేదార్ జాదవ్ జట్టుకు ఉపయోగపడుతున్నారు. అయితే పరిస్థితిని బట్టి విజయ్ స్థానంలో జడేజా లేదా ఖలీల్ అహ్మద్‌లలో ఒకరిని ఆడించే అవకాశం లేకపోలేదు.

బ్యాటింగే కీలకం: పటిష్ఠంగా కనిపించిన కివీస్ బ్యాటింగ్ లైనప్ తొలి మ్యాచ్‌లో పేలవ ప్రదర్శన కనబరిచింది. లంకను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన జోష్‌లో బరిలోకి దిగిన ఈ జట్టులో విలియమ్సన్ మినహా అంతా విఫలమయ్యారు. దీంతో కివీస్ 157 స్కోరుకే పరిమితమైంది. ఇప్పుడీ మ్యాచ్‌లో భారత స్పిన్నర్లను సరిగా ఎదుర్కోకపోతే మరోసారి భంగపాటు తప్పదు. అందుకే బ్యాటింగ్‌లో బ్రేస్‌వెల్ స్థానంలో గ్రాండ్‌హోమ్‌ను బరిలోకి దించాలని భావిస్తోంది.

జట్లు: (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, ధవన్, కోహ్లీ (కెప్టెన్), రాయుడు, ధోనీ, కేదార్ జాదవ్, విజయ్ శంకర్, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి, యజ్వేంద్ర చాహల్.

న్యూజిలాండ్: మార్టిన్ గప్తిల్, కొలిన్ మన్రో, కేన్ విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, టామ్ లాథమ్, హెన్రీ నికోల్స్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్/బ్రేస్‌వెల్, మిచెల్ శాన్‌ట్నర్/ఇష్ సోధీ, టిమ్ సౌథీ, ఫెర్గూసన్, బౌల్ట్.

పిచ్, వాతావరణం

371, 326, 319, 298.. ఇటీవల లంకతో ఇక్కడ జరిగిన రెండు వన్డేల్లో నమోదైన స్కోర్లివి. ఈసారి కూడా బ్యాట్స్‌మెన్‌కు అనుకూలించే అవకాశం ఉంది. అలాగే పేసర్లతో పాటు స్పిన్నర్లు కూడా రాణించవచ్చు. మ్యాచ్‌కు వర్షం నుంచి ఎలాంటి అంతరాయం లేదు.

చెలరేగిన విహారి, రహానె

తిరువనంతపురం: ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండో అనధికారిక వన్డేలో భారత్ 'ఎ' 138 పరుగులతో ఘన విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. తొలుత భారత్ 'ఎ'.. విహారి (92), రహానె (91), శ్రేయాస్ అయ్యర్ (65) అర్ధ సెంచరీలతో రాణించడంతో 50 ఓవర్లలో 6 వికెట్లకు 303 పరుగులు చేసింది. ఆ తర్వాత ఇంగ్లండ్ లయన్స్‌ను స్పిన్నర్లు మయాంక్ మార్కండే (3/32), అక్షర్ పటేల్ (2/13) దెబ్బతీయగా 37.4 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది.

భారత జట్టుకు సంప్రదాయ స్వాగతం



రోహిత్


మౌంట్ మాంగనూ: న్యూజిలాండ్‌తో శనివారం జరుగనున్న రెండో వన్డేలో తలపడేందుకు మౌంట్ మాంగనూకి చేరుకున్న భారత క్రికెట్ జట్టుకు బే ఓవల్ స్టేడియంవద్ద సంప్రదాయ స్వాగతం లభించింది. స్థానిక మావోరి తెగ సంప్రదాయ నృత్యమైన పోహిరితో స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన ఫొటోలను బీసీసీఐ, బే ఓవల్ న్యూజిలాండ్ తమ ట్విటర్ ఖాతాల్లో పోస్టు చేశాయి.

హోల్డర్ సెంచరీ

- 506 పరుగుల ఆధిక్యంలో వెస్టిండీస్

బ్రిడ్జ్‌టౌన్: కెప్టెన్ జేసన్ హోల్డర్ (116 నాటౌట్) శతకంతో, షేన్ డౌరిచ్ (70 నాటౌట్) అర్ధ సెంచరీతో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ జట్టు మరింత పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 127/6తో మూడో రోజు ఆట కొనసాగించిన విండీస్ బ్యాట్స్‌మెన్ ఇంగ్లండ్ బౌలర్లను ఆటాడుకున్నారు. కడపటి వార్తలందే సరికి కరేబియన్ జట్టు 6 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. క్రీజ్‌లో హోల్డర్, డౌరిచ్ ఉన్నారు.

దంగల్ ఆశలు సజీవం



గ్రేటర్ నోయిడా: ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో యూపీ దంగల్ జట్టు సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. శుక్రవారం జరిగిన పోరులో యూపీ దంగల్ 44-34 తేడాతో ఎంపీ యోధ జట్టును ఓడించింది. నిర్ణాయక 57 కిలోల విభాగంలో యోధ రెజ్లర్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత పూజా ధండాకు సరిత షాకిచ్చి దంగల్ జట్టుకు విజయాన్ని అందించింది.

రఫా.. కానో్కో

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్
- రేపు నడాల్‌తో అంతిమ సమరం

మెల్‌బోర్న్: టాప్‌సీడ్ జొకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ పంజా విసురుతాడా? జొకో తాజా దూకుడు చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. నిరుడు వింబుల్డన్, యూఎస్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న టాప్‌సీడ్ జొకోవిచ్.. ఈ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్‌లోనూ సత్తాచాటేందుకు మ్యాచ్ దూరంలో ఉన్నాడు. టాప్‌సీడ్ హోదాకు న్యాయం చేస్తూ సెమీఫైనల్లో ఫ్రెంచ్ సంచలనం లుకాస్ పౌలీని చిత్తుచిత్తుగా ఓడించాడు. శుక్రవారం జరిగిన ఏకపక్ష పోరులో ప్రపంచ నంబర్ వన్ జొకో 6-0, 6-2, 6-2తో 28వ సీడ్ పౌలీపై వరుససెట్లలో విజయం సాధించాడు. 'ఈ కోర్టుపై ఆడిన నా అత్యుత్తమ మ్యాచుల్లో ఇది ఒకటి. నా ఆటతీరుపై చాలా సంతోషంగా ఉన్నాను' అని మ్యాచ్ గెలిచాక 31 ఏళ్ల జొకో వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో చివరిసారిగా 2016లో విజేతగా నిలిచిన జొకోవిచ్.. ఆ తర్వాత ఇక్కడ ఫైనల్ చేరడం ఇదే తొలిసారి.

పోటీ లేకుండానే...: గత మ్యాచ్‌లో కెనడా స్టార్ మిలోస్ రవోనిక్‌కు షాకిచ్చి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన లుకాస్ పౌలీ.. జొకో జోరుముందు మాత్రం బేర్‌మన్నాడు. తొలిసెట్‌లో పూర్తిగా తేలిపోయిన పౌలీపై ఆద్యంతం ఆధిపత్యం చూపిన జొకోవిచ్ 83 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. కేవలం ఐదు అనవసర తప్పిదాలు చేసిన జొకో.. 24 విన్నర్లు సంధించి పౌలీని బెంబేలెత్తించాడు. మ్యాచ్ ఆరంభంలోనే పౌలీ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్.. అదే ఊపులో వరుస పాయింట్లతో ముందుకెళ్లాడు. ప్రత్యర్థికి ఒక్క పాయింట్‌కు కూడా అవకాశమివ్వకుండా 21 నిమిషాల్లోనే 6-0తో తొలిసెట్‌ను కైవసం చేసుకున్నాడు. రెండోసెట్ ఆరంభంలో పౌలీ వరుసగా రెండుపాయింట్లు నెగ్గి పుంజుకున్నట్టు కనిపించినా.. ఆ ఆనందం అతనికెంతో సేపు నిలవలేదు. ఓ పవర్‌ఫుల్ బ్యాక్‌హ్యాండ్ షాట్‌తో పౌలీని బ్రేక్ చేసిన జొకో.. ఆ తర్వాత ప్రత్యర్థి వరుస తప్పిదాలకు పాల్పడేలా వ్యూహాత్మక ఆటతీరుతో ముందుకు సాగాడు. అదే ఊపులో 6-2తో రెండోసెట్‌ను సొంతం చేసుకున్న నొవాక్‌కు ఆఖరిదైన మూడోసెట్‌లోనూ ఎదురులేకుండా పోయింది. 26 నిమిషాలపాటు సాగిన ఈ సెట్‌నూ జొకో 6-2తో గెలుచుకొని ఫైనల్‌కు దూసుకెళ్లాడు. మూడు డబుల్‌ఫాల్ట్స్ చేసిన పౌలీ.. ఏకంగా 27 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకున్నాడు.



'నెంబర్ వన్' ఫైట్

మహిళల సింగిల్స్ ఫైనల్
మ. 2 గం. తర్వాత
సోనీ సిక్స్, సోనీ టెన్-2లో

నిరుడు యూఎస్ ఓపెన్ ఫైనల్లో సెరెనా విలియమ్స్‌ను చిత్తుచేసి సంచలనం సృష్టించిన జపాన్ యువ కెరటం నవోమి ఒసాకా.. ఇప్పుడు మరో వండర్‌కు సిద్ధమైంది. కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన 21 ఏళ్ల ఒసాకా శనివారం జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో చెక్ రిపబ్లిక్ తార, రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ పెట్రా క్విటోవాతో అమీతుమీ తేల్చుకోనుంది. 2016లో ఓ దుండగుడి చేతిలో కత్తిపోటుకు గురైన 28ఏళ్ల క్విటోవా.. 2017లో పునరాగమనం తర్వాత తొలి గ్రాండ్‌స్లామ్ ఆడుతోంది. ఈ సీజన్‌లో అద్భుతఫామ్‌తో దూసుకెళ్తున్న 8వ సీడ్ క్విటోవా ఈసారి మెల్‌బోర్న్ పార్క్‌లో ఒక్కసెట్ కూడా కోల్పోకుండా తుదిపోరుకు చేరింది. తొలిసారి ముఖాముఖి తలపడుతున్న ఈ ఇద్దరిలో ఎవరు గెలిచినా, ట్రోఫీతో పాటు బోనస్‌గా ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్ సొంతం కానుంది. 4వ సీడ్ ఒసాక గెలిస్తే, నెంబర్‌వన్ ర్యాంక్ అందుకున్న తొలి జపాన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించనుంది. మరి.. ఈ 'నెంబర్‌వన్' ఫైట్‌లో పైచేయి ఎవరిదో నేడు తేలనుంది.



సెమీస్‌లో సైనా

- సింధు, శ్రీకాంత్ అవుట్
- ఇండోనేసియా మాస్టర్స్

జకర్తా: భారత ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్ ఇండోనేసియా మాస్టర్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. సింగిల్స్‌లో సైనా సెమీఫైనల్ చేరింది. మరో ఇద్దరు స్టార్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లకు నిరాశ ఎదురైంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఎనిమిదో సీడ్ సైనా 21-7, 21-18తో పోర్న్‌పవీ చోచువాంగ్‌పై గెలిచింది. శనివారం జరిగే సెమీఫైనల్లో ఆరోసీడ్ హే బిన్‌గ్జియావో (చైనా)తో సైనా తలపడనుంది. ఇక, పూర్తి ఏకపక్షంగా సాగిన మరో క్వార్టర్స్‌లో రెండోసీడ్ సింధు 11-21, 12-21తో ఒలింపిక్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో పరాజయంపాలైంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో 8వ సీడ్ కిడాంబి శ్రీకాంత్ 18-21, 19-21తో స్థానిక షట్లర్ జొనాథన్ క్రిస్టీ చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఆధిక్యంలో ఆస్ట్రేలియా

బ్రిస్బేన్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ట్రావిస్ హెడ్ (84), మార్నస్ లబుషానే (81) అర్ధ సెంచరీలతో రాణించడంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 323 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా లంకపై ఆసీస్‌కు 179 పరుగుల ఆధిక్యం లభించింది. ఆ తర్వాత శుక్రవారం రెండోరోజు ఆట ముగిసే సరికి లంక రెండో ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 17 పరుగులు చేసింది. క్రీజులో తిరిమన్నె (6) ఉన్నాడు.

రంజీ ఫైనల్లో విదర్భ

వయనాడ్ (కేరళ): డిఫెండింగ్ చాంపియన్ విదర్భ వరుసగా రెండో ఏడాది రంజీ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండు రోజుల్లోనే ముగిసిన సెమీస్ మ్యాచ్‌లో విదర్భ జట్టు ఇన్నింగ్స్ 11 పరుగుల తేడాతో కేరళపై గెలిచింది. ఉమేశ్ యాదవ్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో కేరళ రెండో ఇన్నింగ్స్‌లో 24.5 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 208, కేరళ 106 పరుగులు చేశాయి. మరో సెమీస్‌లో సౌరాష్ట్రపై కర్ణాటక 48 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఈ జట్టు 275 రన్స్‌కు ఆలౌటైంది. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 227 రన్స్ చేసింది.



పీవీతో మన్మోహన్(ఫైల్)

మన్మోహన్‌కు పీవీ స్మారక అవార్డు

- దేశం దిశ, దశ మార్చిన పీవీ: జయప్రకాశ్ నారాయణ

పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు దిశ, దశ మార్చిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. చెన్నైకి చెందిన ఇండియా నెక్స్ట్ అనే స్వచ్ఛంద సంస్థ తొలిసారిగా పీవీ నర్సింహారావు మెమోరియల్ నేషనల్ లీడర్‌షిప్ అండ్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. దీనికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్‌తో కలిసి జయప్రకాశ్ నారాయణ ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం ఇండియా నెక్స్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 28న ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు రామచంద్రమూర్తి తెలిపారు.

ఆంధ్రలో డ్రోన్ల విప్లవం: లోకేశ్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ల విప్లవం కొనసాగుతోందని ఐటీ మంత్రి లోకేశ్ అన్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశంలో ప్రప్రథమంగా ఆంధ్రవిద్యార్థులు డ్రోన్లు తయారు చేసే సత్తా కలిగి ఉండడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్రోన్లు, పరికరాల తయారీ కోసం ప్రత్యేకం కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిందని వివరించారు. అత్యాధునిక డ్రోన్ల తయారీ ఉపకరణాలను రూపొందించడంలో ప్రభుత్వం భాగస్వామ్యమైందని లోకేశ్ చెప్పారు. త్వరలోనే ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ, ప్రజాసేవలోనూ డ్రోన్ల వినియోగాన్ని పెంచుతామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు కూడా పెడుతూ నిర్ణయం తీసుకున్నామని, ఫలితంగా భద్రతకు ప్రాధాన్యం కలుగుతుందని చెప్పారు. ఇప్పుడు పలు దేశాలు భద్రత, పారిశుధ్యం తదితర కార్యక్రమాల్లో డ్రోన్ల భాగస్వామ్యాన్ని పెంచాయని లోకేశ్ వివరించారు.

రెండేళ్ల చిన్నారిపై అత్యాచారం

- ఆడుకుంటుండగా ఎత్తుకెళ్లి దుశ్చర్య
- నిందితుడికి దేహశుద్ధి
- కుత్బుల్లాపూర్‌లో ఘటన



దుండిగల్/హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ముద్దులొలికే చిన్నారిని చిదిమేశాడో కామాంధుడు. ముగ్గురు పిల్లల తండ్రి అయినా..

మద్యం మత్తులో కన్నూమిన్నూ కానరాక అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధను భరించలేక చిన్నారి విలపిస్తున్నా కనికరం లేకుండా అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కుత్బుల్లాపూర్‌లో ఈ ఘటన జరిగింది. దుండిగల్ ఠాణా పరిధిలో నివసిస్తున్న ముగ్గురు యువకులు గురువారం రాత్రి ఫుటుగా మద్యం తాగారు. వీరిలో 36 ఏళ్ల మొయినుద్దీన్‌ను ఇంటి వద్ద వదిలి మిగిలిన ఇద్దరూ వెళ్లిపోయారు. ఆ సమయంలో అతడి ఇంటి పక్కన రెండేళ్ల చిన్నారి ఆడుకుంటోంది. మద్యం మత్తులో అతడు.. చిన్నారిని పొదల్లోకి ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప విలపిస్తుండటంతో తల్లిదండ్రులు బయటికి రాగా ఒంటిపై రక్తపు మరకలు ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని గమనించగా.. మొయినుద్దీన్‌ను ఇద్దరు వ్యక్తులు ఒకరిని విడిచి వెళ్లడం, తర్వాత అతడు చిన్నారిని ఎత్తు కెళ్లినట్లు గుర్తించారు. దీంతో స్థానికులు నిందితుడిని గుర్తించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మొయినుద్దీన్‌పై కేసు నమోదు చేశారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, నిందితుడిని ఉరి తీయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు.



అస్టో ప్లాస్టిక్ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు

కిరోసిన్ నుంచి కల్తీ డీజిల్!

- తయారీ పరిశ్రమపై విజిలెన్స్ దాడి
- హైదరాబాద్‌లో 2 ట్యాంకర్లు స్వాధీనం..
- కడపలో డీజిల్ ట్యాంకర్ పట్టుబడటంతో వెలుగులోకి

పటాన్‌చెరు రూరల్, జనవరి 25: హైదరాబాద్ శివారులో మరో కల్తీ మోసం బయటపడింది. బ్లూ కిరోసిన్‌ను వైట్ కిరోసిన్‌గా మార్చి డీజిల్‌గా మార్కెట్లలో విక్రయిస్తున్న పాశమైలారం పారిశ్రామికవాడలోని ఆస్టో ప్లాస్టిక్ పరిశ్రమపై తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. రెండు ట్యాంకర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిశ్రమ నుంచి వెళ్లిన ఓ పెట్రోల్ ట్యాంకర్‌ను కడప పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కడప పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు శుక్రవారం అస్టో ప్లాస్టిక్ పరిశ్రమపై దాడి చేశారు. రెండు ట్యాంకర్లతో పాటు పుల్లర్స్ ఎర్త్ పౌడర్, కెమికల్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ వినాయకరెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న యజమానులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**